www.bharathasakthi.com

# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

| సంపుటి : 21 | సంచిక : 41 | హైదరాబాద్ | బుధవారం,జులై 15 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00 |
|---|---|---|---|---|---|

## హసీనా బంగ్లాదేశ్ వస్తే అరెస్ట్ చేస్తాం

### - బంగ్లాదేశ్ మంత్రి సంచలన వ్యాఖ్యలు!



బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా రెండేళ్లుగా భారతదేశంలో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్‌లో వివాదాల కారణంగా ఆమె 2024 ఆగస్టు నెలలో ఇండియాకు వచ్చారు. అప్పటినుంచి ఇక్కడే ఉంటున్నారు. బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లిపోవటం గురించి కొద్దిరోజుల క్రితం హసీనా ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. 'అన్ని అడ్డంకులను, కుట్రలను అధిగమిస్తున్నాను. ఈ ఏడాది నా దేశానికి తిరిగి వెళ్లిపోతాను' అని అన్నారు. షేక్ హసీనా బంగ్లాదేశ్‌కు తిరిగి వెళతానని చెప్పటంపై ఆ దేశ విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి శామా ఒబేద్ ఇస్లాం స్పందించారు.

3లో..

## సీఎం రేవంత్ రెడ్డికి రెండు చోట్ల ఓటు..

### - క్లారిటీ ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు రెండు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో నమోదు
- ఇది సాధారణ తప్పిదమేనని స్పష్టం చేసిన తెలంగాణ ప్రభుత్వం
- కొడంగల్‌లో ఓటును ఉంచి, అచ్చంపేటలో తొలగించాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా దీన్ని సరిదిద్దుతున్నామన్న అధికారులు



**హైదరాబాద్ (భారత శక్తి)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరు రెండు వేర్వేరు నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో ఉండటంపై రాష్ట్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇది ఓటర్ల జాబితాలో దొర్లిన సాధారణ సాంకేతిక లోపమేనని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియలో భాగంగా దీనిని సరిదిద్దుతున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు

3లో..

## బడంగ్పేట్ జలాశయాల గర్భంలో రియల్ మాఫియా రాక్షస క్రీడ!










- బాలాపూర్ కొంతమోని కుంట ఆక్రమణల వెనుక అధికారుల ముడుపుల భాగోతం..
- పట్టణ ప్రణాళిక, నీటి వనరుల శాఖల నైతిక పతనం!
- జిహెచ్ఎంసి నుండి ఎలాంటి లేఔట్ అనుమతులు లేకుండానే దొడ్డిదారిన జిపి లేఔట్..!
- జి.హెచ్.ఎం.సి కమిషనర్ ఆర్ వి కర్ణన్ విజిలెన్స్ నిఘా విభాగ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్.

రియల్ ఎస్టేట్ మాఫియాకు స్వాగతం! బడంగ్‌పేట్ బాలాపూర్ లో చెరువులను మింగేసే రాక్షస క్రీడ అద్భుతంగా సాగుతోంది! కొంతమోని కుంట పరివాహక ప్రాంతంలో ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు ముడుపుల మత్తులో హాయిగా జోగుతూ, ప్రకృతిని కాంక్రీట్ వనంగా మారుస్తున్నారు. ఎలాంటి జీహెచ్ఎంసీ అనుమతులు లేకపోయినా, నకిలీ సంతకాలు, వెనుకటి తేదీల ఫోర్జరీ పత్రాలతో అక్రమ సామ్రాజ్యాన్ని సృష్టించడం ఈ కేటుగాళ్లకే చెల్లింది. కళ్లముందే ప్రకృతి సర్వనాశనమవుతుంటే, జోనల్ కమిషనర్ చంద్రకళ గారు నిమ్మకు నీరెత్తినట్లు నిద్రపోవడం మరింత విశేషం. ఇప్పటికైనా ఉన్నతాధికారి ఆర్.వి. కర్ణన్ విజిలెన్స్ కన్ను తెరిచి, ఈ ముడుపుల అక్రమ భాగోతంపై క్రిమినల్ వేటు వేస్తారో లేక ఈ చీకటి అంధకారాన్నే ఆశీర్వదిస్తారో చూడాలి!

2లో..

## దమ్ముంటే పట్టుకోండి చూద్దాం..!

- మణుగూరులో రెచ్చిపోతున్న అక్రమ ఇసుక ట్రాక్టర్లు
- పట్టపగలే ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా.!
- బరితెగించిన అధికార పార్టీ చోటమోట నేతలు
- ఎవరికీ భయపడేది లేదంటూ ధైర్యం
- ఎవరి మాటా వినేది లేదంటూ అహంకారం.!
- ఇసుక మాఫియా గుప్పిట్లో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు






**మణుగూరు, జూలై 14 (భారతశక్తి):** మండలంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణాకు రోజురోజుకు హద్దే లేకుండా ఇష్టారాజ్యంగా చెలరేగిపోతుంది. ఎవ్వరి మాట మేము వినం.. అంతా మా ఇష్టం అంటూ బహిరంగంగా సవాల్ విసురుతున్న ఇసుక అక్రమ రవాణా ముఠా, అధికార వ్యవస్థను సైతం తమ గుప్పిట్లో పెట్టుకున్నట్లు ప్రవర్తిస్తోంది. అధికార పార్టీ మదం, రెవెన్యూ, మైనింగ్ అధికారులే తమవైపే ఉన్నారని గర్వంగా చెప్పుకుంటూ, ఎవరైనా అడ్డుకొస్తే చూసుకుంటామని బెదిరింపులకు దిగుతోంది. ట్రాక్టర్లకు నెంబర్లు లేకుండా మైనర్లతో డ్రైవింగ్ చేయిస్తున్నారు. గ్రామ రహదారులు పూర్తిగా దెబ్బతిన్నా, ధూళి, శబ్ద కాలుష్యం పెరిగినా మాఫియా మాత్రం డోంట్ కేర్ అన్నట్టే వ్యవహరిస్తోంది. గ్రామస్తులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. ప్రకృతి సంపదను విచ్చలవిడిగా కొల్లగొడుతున్నారని ఫిర్యాదు చేసినా అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### బరితెగించిన అధికార పార్టీ చోటమోటా నేతలు

మండలంలో అధికార పార్టీకి చెందిన చోటమోట నేతలు అడ్డగోలుగా బరితెగించారు. ట్రాక్టర్ల యజమానులు సిండికేట్ గా ఏర్పడి రాత్రి పగలు అనే తేడా లేకుండా గోదావరిని కొల్లగొట్టి ఇసుక అక్రమ రవాణా చేస్తూ

2లో..

## ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

- దేశ శ్రమశక్తికి 'సేవ', 'సమ్మాన్' అనేవి మన పరిపాలనకు మూలస్తంభాలు : డాక్టర్ మన్సుఖ్ మాండవియా
- 15 కోట్లకు పైగా ఒక దశాబ్దంలో ఈఎస్ఐసి లబ్ధిదారులు రెట్టింపు
- సనత్‌నగర్‌లో ఉన్న ఈఎస్ఐసి ఆసుపత్రి కొత్త ఓపీడీ బ్లాక్ ప్రారంభం.
- ఈ సౌకర్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల మందికి పైగా ప్రయోజనం
- కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా



**హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూలై 14:** తెలంగాణలోని సనత్‌నగర్‌లో ఉన్న ఈఎస్ఐసి ఆసుపత్రి కొత్త ఓపీడీ బ్లాక్‌ను ఈరోజు కేంద్ర కార్మిక, ఉపాధి, యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ప్రారంభించారు. మొత్తం రూ. 211.13 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ కొత్త వైద్య సదుపాయం, తెలంగాణ వ్యాప్తంగా 12.3 లక్షలకు పైగా బీమాదారులకు మరియు లబ్ధిదారులకు సేవలు అందిస్తుంది. సభను ఉద్దేశించి మాట్లాడుతూ, కేంద్ర మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా, శ్రమ్ శక్తి మరియు యువ శక్తి దేశ నిర్మాణానికి రెండు కీలక స్తంభాలని పేర్కొన్నారు. సాంకేతికత మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ముఖ్యమైనవే అయినప్పటికీ, దేశ ప్రగతికి శ్రమ్ శక్తి కేంద్రంగా నిలుస్తుందని ఆయన అన్నారు. దేశ నిర్మాణ లక్ష్యానికి కార్మికులు సమర్థవంతంగా దోహదపడాలంటే, వారికి గౌరవం, మర్యాద మరియు సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. మోదీ ప్రభుత్వ పాలనలో దేశ శ్రమ్ శక్తికి "సేవ" మరియు "సమ్మాన్" అనేవి పరిపాలనకు కేంద్రంగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. సామాజిక భద్రతను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను హైలైట్ చేస్తూ, డాక్టర్ మాండవియా మాట్లాడుతూ, దశాబ్దం క్రితం సుమారు 7.5 కోట్లుగా ఉన్న ఈఎస్ఐసి లబ్ధిదారుల సంఖ్య ప్రస్తుతం 15 కోట్లకు పైగా పెరిగిందని అన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) అంచనాలను ప్రస్తావిస్తూ,

2లో..



## ప్రపంచ స్ట్రోక్ సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌గా డా. పి. విజయ ఎన్నిక



**గుంటూరు, భారత శక్తి ప్రతినిధి, జూలై 14:** గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్టు, లలితా పి.వి.ఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ న్యూరోసైన్సెస్ విభాగాధిపతి, అంకినీడు అడ్వాన్స్డ్ స్ట్రోక్ సెంటర్ డైరెక్టర్, న్యూరోసైంటిస్ట్స్ అసోసియేషన్, గుంటూరు అధ్యక్షురాలు డా. పి. విజయ (MD.,DM., FWSO.,FIAN.,FIAMS) ప్రపంచ స్ట్రోక్ సంస్థ (వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ - ఔూ) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ప్రపంచవ్యాప్తంగా 95 దేశాలకు చెందిన 3,500 మంది ఔూ సభ్యుల ద్వారా ఎన్నికైన 18 మంది ప్రతిష్టాత్మక డైరెక్టర్లలో డా.

3లో..

### రూ.2 లక్షల లంచం తీసుకుంటూ

## ఏసీబీకి చిక్కిన పెద్దపల్లి మున్సిపల్ ఏఈ

### ఇంట్లో రూ.32.31 లక్షల అక్రమ నగదు స్వాధీనం



**పెద్దపల్లి, జూలై 14 (భారత శక్తి):** పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) కల్లేపల్లి సతీష్ కుమార్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. ఏసీబీ కరీంనగర్ యూనిట్ అధికారులు సోమవారం నిర్వహించిన ట్రాప్‌లో, కాంట్రాక్టర్‌కు సంబంధించిన బిల్లును ప్రాసెస్ చేసి, హైదరాబాద్‌లోని తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (TUFIDC)కు పంపించి

2లో..


## మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు



2లో..

## విద్యార్థుల భవిష్యత్తుపై కాంగ్రెస్ సర్కార్ నీలినీడలు

- 3 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్నా నిధుల కొరత ఎందుకు?
- ఫీజుల చెల్లింపులో రేవంత్ ప్రభుత్వం ఘోర వైఫల్యం..
- ఇందిరా పార్క్ సాక్షిగా వెల్లువెత్తిన ప్రజా ఆగ్రహం..
- పాలకులకు గుణపాఠం తప్పదని హెచ్చరిక!



**హైదరాబాద్ జూలై 14(భారత శక్తి):** తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం, వారి భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది. వార్షిక బడ్జెట్ అంచనాలు ఏకంగా మూడు లక్షల కోట్ల రూపాయల మార్కును దాటినా, విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోంది. ప్రభుత్వ ధోరణిని నిరసిస్తూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం

2లో..

## అవినీతి తిమింగలం 'బచ్చు' గుట్టు రట్టు!

- హెచ్ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్ ఇళ్లే లక్ష్యంగా ఏసీబీ మెరుపుదాడులు..
- ఏకకాలంలో 12 చోట్ల ముమ్మర తనిఖీలు..
- భారీగా అక్రమాస్తుల పత్రాలు లభ్యం!



**హైదరాబాద్, జూలై 14 భారతి శక్తి:** రాష్ట్రంలో అవినీతి అధికారుల గుండెల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మరోసారి వణుకు పుట్టించారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, తమ అధికార పరిధిని అడ్డం పెట్టుకుని కోట్లాది రూపాయల అక్రమాస్తులు కూడబెట్టారనే నమ్మదగిన సమాచారంతో ఏసీబీ బలగాలు రంగంలోకి దిగాయి. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) చీఫ్ ఇంజనీర్ బచ్చు రవీందర్ లక్ష్యంగా మంగళవారం తెల్లవారుజాము నుంచే అధికారులు ముమ్మర దాడులు నిర్వహించారు. ఈ ఆకస్మిక తనిఖీలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపాయి.

### - పక్కా నిఘా.. వ్యూహాత్మక దాడులు

గత కొంతకాలంగా రవీందర్‌పై పెద్ద ఎత్తున అవినీతి, అక్రమ సంపాదనకు సంబంధించిన

2లో..

# బడంగ్‌పేట్ జలాశయాల గర్భంలో
# రియల్ మాఫియా రాక్షస క్రీడ!



హైదరాబాద్: జులై 14 భారతశక్తి, నగర శివార్లలోని బడంగ్‌పేట్ పురపాలక సంఘం పరిధిలో ప్రభుత్వ నిబంధనలను, పర్యావరణ చట్టాలను నిలువునా పూడ్చిపెడుతూ ఒక భారీ అక్రమ గృహనిర్మాణ క్షేత్రం (వెంచర్) వెలిసింది. బాలాపూర్ సమీపంలోని చారిత్రాత్మక కొంతమోని కుంట పరివాహక ప్రాంతంలో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో సాగుతున్న ఈ అక్రమ సామ్రాజ్యానికి స్థానిక పట్టణ ప్రణాళికా అధికారులు, నీటి వనరుల (ఇరిగేషన్) శాఖ అధికారులు అండదండలు పుష్కలంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. చెరువులు, కుంటల పరిరక్షణ పరిధిలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదనే ప్రాథమిక న్యాయ సూత్రాన్ని ఇక్కడ పూర్తిగా తుంగలో తొక్కారు. కోట్ల రూపాయల ముడుపుల ఆశకు లోబడి, ప్రభుత్వ ఖజానాకు భారీ గండి కొడుతూ, ప్రకృతిని నాశనం చేస్తున్న ఈ



వ్యవహారంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### శాస్త్రీయ విశ్లేషణ: ప్రకృతి సమతుల్యతకు వాటిల్లుతున్న ఘోర విపత్తు

భూగర్భ జల వనరుల పరిరక్షణ మరియు జల విజ్ఞాన శాస్త్ర సూత్రాల ప్రకారం.. ఒక జలాశయం లేదా కుంట పరిసర ప్రాంతాలు నగర జీవావరణానికి సహజ సిద్ధమైన శ్వాసకోశాల వంటివి. కొంతమోని కుంట సమీపంలోని సర్వే సంఖ్యలు 88, 89, 90, 272, 273, 275, 276, 277, 278, 281 పరిధిలో జరుగుతున్న ఈ నిబంధనల ఉల్లంఘన భవిష్యత్తులో తీవ్రమైన మానవ నిర్మిత విపత్తుకు దారితీయనుంది.

**భూగర్భ జల పునరుద్ధరణకు తీవ్ర విఘాతం:** ఇక్కడ యథేచ్ఛగా సాగుతున్న కాంక్రీటు నిర్మాణాల వల్ల భూమి ఉపరితల రంధ్రత పూర్తిగా దెబ్బతింటుంది. దీనివల్ల వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోయే సహజ ప్రక్రియ నిలిచిపోయి, రాబోయే రోజుల్లో భూగర్భ జలమట్టం పాతాళానికి పడిపోయే ప్రమాదం ఉంది.

కృత్రిమ వరదల ముప్పు: సహజ నీటి ప్రవాహ మార్గాలను, వరద కాలువలను మట్టితో పూడ్చివేయడం వల్ల వర్ష కాలంలో నీటి ప్రవాహ వేగం పెరిగి, సమీప నివాస ప్రాంతాలు జలమయమై వేలాది కుటుంబాలు ముంపునకు గురవుతాయి.

**మృత్తిక క్రమక్షయం - ఉపరితల నష్టం:** ఇక్కడి సహజ సిద్ధమైన మట్టి పొరలను యంత్రాలతో తొలగించడం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా, భూమి తన అంతర్గత స్థిరత్వాన్ని కోల్పోయి కుంగిపోయే ప్రమాదం ఉంది.

### ఫోర్జరీ పత్రాలు.. నకిలీ సంతకాల మాయాజాలం!

మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ నిబంధనల ప్రకారం.. నూతన నివాస స్థలాల రూపకల్పన చేసేటప్పుడు విశాలమైన రహదారులు, మురుగునీటి పారుదల వ్యవస్థ, విద్యుద్దీకరణ, ఉద్యానవనాలు వంటి కనీస మౌలిక వసతులు కల్పించాలి. అంతేకాకుండా ప్రజా అవసరాల



కోసం ఉచితంగా నిర్దేశిత భూమిని కేటాయించాలి.

కానీ, ఇక్కడ ఈ నిబంధనలన్నింటినీ దాటవేయడానికి కేటుగాళ్లు దొంగమార్గాన్ని ఎంచుకున్నారు. నకిలీ భూ నమూనా పత్రాలు, ఫోర్జరీ చేయబడిన భూ క్రమబద్ధీకరణ పత్రాలు, గ్రామ సర్పంచుల నకిలీ




సంతకాలతో కూడిన పత్రాలను సృష్టించి అక్రమంగా ఈ సామ్రాజ్యాన్ని నిర్మించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### దశాబ్దాల నాటి భూములకు 'వ్యవసాయేతర' నయా రూపు!

దశాబ్దాల క్రితం వ్యవసాయ భూములుగా ఉన్న ఈ ప్రాంతానికి, 2022 సంవత్సరం తర్వాత వెనుకటి తేదీలతో వ్యవసాయేతర భూ పరివర్తన చేయించినట్లు సమాచారం. ఈ నకిలీ పత్రాల ఆధారంగానే పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు యథేచ్ఛగా గృహ నిర్మాణ అనుమతులు మంజూరు చేశారు. ఈ అనుమతుల వెనుక కోట్ల రూపాయల అక్రమ నగదు లావాదేవీలు జరిగినట్లు స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. కళ్లముందే ఇంతటి అక్రమ పర్వం సాగుతున్నా, సంబంధిత క్షేత్రస్థాయి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు



వ్యవహరించడం వెనుక ఉన్న అసలు శక్తులెవరో తేలాల్సి ఉంది.

### నిమ్మకు నీరెత్తిన నీటి వనరుల శాఖ.. ముడుపుల మత్తులో అధికారులు!



చెరువులు, కుంటలు, నాలాలు కళ్ళముందే కబ్జా అవుతుంటే.. వాటిని రక్షించాల్సిన నీటి వనరుల (ఇరిగేషన్) శాఖ అధికారులు ముడుపుల మత్తులో జోగుతున్నారు. అక్రమార్కులు యథేచ్ఛగా జలాశయ గర్భాన్ని పూడ్చుతున్నా, కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడని పరిస్థితి నెలకొంది. కబ్జాదారులతో చేతులు కలిపి, ప్రకృతి సంపదను తెగనమ్ముకుంటున్న ఈ అధికారుల తీరుపై ప్రజలు తీవ్ర విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### ఉన్నతాధికారులారా.. ఈ అంధకారానికి ముగింపు ఎప్పుడు?

బడంగ్‌పేట్ పరిధిలో క్షేత్రస్థాయి అధికారులు ఇంతటి భారీ అవినీతికి పాల్పడుతుంటే.. శంషాబాద్ ప్రాంతీయ అధికారి (జోనల్ కమిషనర్) చంద్రకళ అసలు ఏం చేస్తున్నట్టు? తన పరిధిలో జరుగుతున్న ఈ ఘోర ఉల్లంఘనలు ఆమె కంటికి ఆనడం లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా మహానగర పాలక సంస్థ ముఖ్య అధికారి (కమిషనర్) ఆర్.వి. కర్ణన్ ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలి. తక్షణమే ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించి, క్షేత్రస్థాయి పరిశీలన జరపాలి.

విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి నకిలీ పత్రాలు సృష్టించిన నిందితులపై, వారికి సహకరించి లంచాలు రుచి చూసిన నీటి వనరుల, పట్టణ ప్రణాళికా అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక జనం ఉరుముతున్నారు.

# దమ్ముంటే పట్టుకోండి చూద్దాం.!

లక్షలు గడిస్తున్నారు. నదిలో నుంచి ప్రతిరోజూ వదుల సంఖ్యలో ట్రాక్టర్లు యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గోదావరి నది ప్రవాహ గ్రామలైన చిన్నరాయుగూడెం, అన్నారం ప్రాంతాల నుండి అక్రమ ఇసుక రవాణా చేస్తూ రహస్య ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారు. డిమాండ్ వచ్చినప్పుడు అక్కడి నుండి కావాల్సిన వారికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నిత్యం ట్రాక్టర్ల జాతరను తలపించే విధంగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### మామూళ్ల మత్తులో అధికారులు

ఇసుక బకాసురులకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని రాష్ట్రప్రభుత్వం గొప్పలు చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా ఉంటోంది. ఇసుక అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలంటే ముందుగా కిందిస్థాయి అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు వేటు వేస్తేనే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలుండవనే వాదనలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో ఇసుక అక్రమ రవాణాకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ఒక్కో ఇసుక ట్రాక్టర్ రూ.2 వేల నుండి రూ.3వేల వరకు ధర పలుకుతోంది. దూరాన్ని బట్టి ఈరేటు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తే అక్రమ ఇసుక దోపిడీని అరికట్టే అవకాశాలున్నాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ అక్రమాలతో పర్యావరణానికి, ప్రభుత్వ ఆదాయానికి తీవ్రమైన నష్టం జరుగుతున్నా, అధికార యంత్రాంగం మాత్రం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోంది.

# మీనాక్షి నటరాజన్‌కు కడియం శ్రీహరిపై కొండా సురేఖ ఫిర్యాదు

తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య నెలకొన్న వివాదం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ వద్దకు చేరింది. మీనాక్షి నటరాజన్‌తో మంత్రి కొండా సురేఖ భేటీ అయి కడియం శ్రీహరిపై ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే తన ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని, అనవసర వివాదాల్లోకి లాగుతున్నారని మీనాక్షి దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరి మధ్య నెలకొన్న వివాదానికి సంబంధించిన అన్ని అంశాలను వివరించారు. సురేఖ వివరించిన అంశాలను ఓపికగా విన్న మీనాక్షి నటరాజన్ సంయమనం పాటించాలని సూచించారు. చిన్నచిన్న విషయాలను పెద్దగా పట్టించుకోవద్దని సలహా ఇచ్చారు. ఈ వివాదంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి కడియంపై సురేఖ ఫిర్యాదు చేశారు.

# అవినీతి తిమింగలం
# 'బచ్చు' గుట్టు రట్టు!

ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏసీబీ ఉన్నతాధికారులు ఆయన కదలికలపై రహస్యంగా నిఘా పెట్టారు. ప్రాథమిక విచారణలో అందిన శాస్త్రీయ ఆధారాలు, సేకరించిన నివేదికల ఆధారంగా దాడులకు పూర్తిగా సిద్ధం చేశారు. ఏసీబీ డీఎస్పీ మాజీద్ అలీఖాన్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు మంగళవారం సూర్యోదయానికి ముందే రంగంలోకి దిగాయి. రవీందర్ నివాసంతో పాటు ఆయన బంధువులు, అత్యంత సన్నిహితుల ఇళ్లే లక్ష్యంగా ఏకకాలంలో మొత్తం 12 ప్రాంతాల్లో ఈ సోదాలు ప్రారంభమయ్యాయి.

### బట్టబయలైన అక్రమ సామ్రాజ్యం?

రవీందర్ అధికారిక నివాసం, కార్యాలయాల్లో జరిపిన తనిఖీల్లో ఏసీబీ అధికారులకు కళ్లు చెదిరే వాస్తవాలు లభ్యమైనట్లు సమాచారం. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు నిర్ధారించే పలు కీలక దస్త్రాలు (డాక్యుమెంట్లు), విలువైన భూములకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శాస్త్రీయ విశ్లేషణల ద్వారా ఈ పత్రాల అసలు విలువను, నిందితుడి బ్యాంక్ ఖాతాల లావాదేవీలను ఏసీబీ ఆర్థిక నిపుణుల బృందం నిశితంగా పరిశీలిస్తోంది. తనిఖీలు ఇంకా కొనసాగుతుండటంతో, స్వాధీనం చేసుకున్న మొత్తం ఆస్తుల విలువ అధికారికంగా తేల్చాల్సి ఉంది.

### తప్పు చేస్తే వదిలేదే లేదు: ఏసీబీ ఉన్నతాధికారులు.

"నిరుపేదల సొమ్మును, ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టే ఎంతటి ఉన్నతాధికారైనా చట్టం ముందు మోకరిల్లాల్సిందే. పక్కా ఆధారాలు, శాస్త్రీయ విచారణతోనే ఈ దాడులు చేపట్టాం. అవినీతి నిరోధమే మా లక్ష్యం" అని ఏసీబీ ఉన్నతాధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఈ దాడుల పూర్తి వివరాలు, లభ్యమైన బంగారం, నగదు మరియు స్థిరాస్తుల వివరాలను బుధవారం నాటికి అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఈ పరిణామం హెచ్ఎండీఏ వర్గాల్లోనే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉన్నతాధికార యంత్రాంగంలో పెను సంచలనంగా మారింది.

# విద్యార్థుల భవిష్యత్తుపై కాంగ్రెస్ సర్కార్ నీలినీడలు

ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ సత్యాగ్రహ దీక్ష శంఖారావం పూరించింది. బీసీ జాతీయ నేత ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో జరిగిన ఈ మహా దీక్షకు భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు బండారు దత్తాత్రేయ, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సహా వేలాది మంది విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు తరలివచ్చి మద్దతు ప్రకటించారు.

### అధికార వికేంద్రీకరణ - ప్రాధాన్యతల లోపం: శాస్త్రీయ విశ్లేషణ

ఆర్థిక శాస్త్ర నియమాల ప్రకారం, ఒక సంక్షేమ ప్రభుత్వ బడ్జెట్ పరిమాణం పెరిగినప్పుడు మానవ వనరుల అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు మరియు నిధుల విడుదల నిష్పత్తి కూడా సమానంతరంగా పెరగాలి. సంపద సృష్టి పెరిగినప్పుడు సామాజిక పెట్టుబడి (విద్య) పై పెట్టే ఖర్చు సమాజ ఉత్పాదకతను పెంచుతుంది. కానీ ప్రస్తుత తెలంగాణ ఆర్థిక నిర్వహణ శాస్త్రీయ సూత్రాలకు భిన్నంగా సాగుతోంది. మూడు లక్షల కోట్ల రూపాయల భారీ బడ్జెట్ అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రాథమిక సామాజిక బాధ్యత అయిన విద్యా నిధులను నిలిపివేయడం నిపుణుల ప్రభుత్వ ప్రాధాన్యతల లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఆదాయాన్ని కేవలం తక్షణ రాజకీయ ప్రయోజనాలు ఆశించే రంగాలకే మళ్లించడం వల్ల విద్యా వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఏర్పడింది.

### ప్రజాపాలన పేరిట విఫల పాలన: అల్లంపల్లి

### రామకోటి ధ్వజం

ఈ సత్యాగ్రహ దీక్షా వేదికపై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపై నిప్పులు చెరిగారు. బీసీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అనంతుల రామ్మూర్తి గౌడ్ గారితో కలిసి ఆయన ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఎండగట్టారు. అల్లంపల్లి రామకోటి మాట్లాడుతూ.. చారిత్రక ఆధారాలను, గత గణాంకాలను శాస్త్రీయంగా ప్రస్తావించారు: "నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉమ్మడి బడ్జెట్ పరిమాణం కేవలం లక్ష కోట్ల లోపు మాత్రమే ఉన్నప్పుడు, నాటి ముఖ్యమంత్రి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారు ఎంతో దూరదృష్టితో, శాస్త్రీయ ప్రణాళికతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అత్యంత విజయవంతంగా అమలు చేశారు. నాడు వేలాది మంది పేద విద్యార్థులు ఇంజనీర్లుగా, డాక్టర్లుగా మారి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. కానీ నేడు తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ మూడు లక్షల కోట్లు దాటినా విద్యార్థులకు ఫీజులు చెల్లించలేకపోతున్నారు. ఈ వైఫల్యాన్ని సఫలమైన ప్రభుత్వమందామా? లేక విఫలమైన దుర్మార్గపు ప్రభుత్వమందామా? దీనికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి!" అని అల్లంపల్లి రామకోటి గారు నిలదీశారు.

### కమీషన్ల కోసమే ప్రాజెక్టులా? విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం!

ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులలో జరుగుతున్న అసమతుల్యతను అల్లంపల్లి రామకోటి తీవ్రంగా తప్పుపట్టారు. కేవలం కమీషన్లు వచ్చే కాంట్రాక్టు ప్రాజెక్టులకు మాత్రమే నిధులు తక్షణమే విడుదలవుతున్నాయని, పేద విద్యార్థుల చదువులకు సంబంధించిన ఫీజుల ఫైళ్లు మాత్రం సచివాలయంలో మూలపడుతున్నాయని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో వెనుకబడిన తరగతుల ఓట్ల కోసం అభ్యర్థించిన పాలకులు, అధికారంలోకి రాగానే విద్యార్థులను రోడ్లపైకి లాగడం నైతిక పాలన అనిపించుకోదని స్పష్టం చేశారు. ఫీజులు కట్టలేక విద్యాసంస్థల నుండి విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక, ఉన్నత చదువులకు దూరం కావడమనేది మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుందని హెచ్చరించారు.

విద్యార్థుల భవిష్యత్తును కాపాడలేని ఏ ప్రభుత్వమైనా, ముఖ్యమంత్రైనా పదవిలో కొనసాగే అర్హత లేదని అల్లంపల్లి రామకోటి ఘాటుగా విమర్శించారు. ఇదే వైఖరి అవలంబిస్తే రాబోయే రోజుల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ ఓటు హక్కు అనే శక్తివంతమైన ఆయుధం ద్వారా ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

### విద్యా రంగానికి తక్షణమే నిధులు విడుదల చేయాలి

సత్యాగ్రహ దీక్ష ముగింపు సందర్భంగా బీసీ సంఘాల నాయకులు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న అన్ని విద్యా ఫీజుల బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఈ ఉద్యమం సచివాలయం ముట్టడికి దారితీస్తుందని హెచ్చరించారు. మూడు లక్షల కోట్ల బడ్జెట్ లో విద్యార్థుల వాటాను శాస్త్రీయ పద్ధతిలో కేటాయించి, విద్యా హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు.

# ఆజాదీ కా అమృత్ మహోత్సవ్

భారతదేశంలో సామాజిక భద్రతా కవరేజ్ 2014లో 19 శాతం నుండి నేడు 64 శాతానికి పైగా విస్తరించిందని, ఇది 94 కోట్ల మంది ప్రజలను కవర్ చేస్తుందని ఆయన తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో చేపట్టిన వివిధ సంక్షేమ కార్యక్రమాలను కూడా ఆయన హైలైట్ చేశారు. వీటిలో 80 కోట్లకు పైగా లబ్ధిదారులకు ఉచిత ఆహార ధాన్యాలు అందించడం, అర్హులైన కుటుంబాలకు నాలుగు కోట్లకు పైగా పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టడం వంటివి భారతదేశ కార్మిక శక్తి జీవన సౌలభ్యాన్ని బలోపేతం చేయడానికి దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. కార్మిక సంస్కరణల గురించి మాట్లాడుతూ, కేంద్ర మంత్రి నాలుగు కార్మిక స్మృతులు ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలోకి వచ్చాయని, తద్వారా సరళమైన, కార్మిక-కేంద్రీకృత కార్మిక వ్యవస్థకు మార్గం సుగమం చేశాయని అన్నారు. తప్పనిసరి నియామక పత్రాలు, 40 ఏళ్లు పైబడిన కార్మికులకు వార్షిక ఉచిత ఆరోగ్య పరీక్షలు, స్త్రీపురుషులకు సమాన వేతనాలు, ఒక సంవత్సరం సర్వీసు తర్వాత గ్రాట్యుటీకి అర్హత వంటి నిబంధనలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. సామరస్యపూర్వక పారిశ్రామిక సంబంధాల ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ, అభివృద్ధి చెందిన, సుసంపన్నమైన భారతదేశ నిర్మాణానికి యజమానులు, ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేయాలని డాక్టర్ మాండవియా పిలుపునిచ్చారు. ఆసుపత్రి ప్రారంభోత్సవాన్ని ప్రస్తావిస్తూ, ఈ సౌకర్యం కార్మికుల ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు మరియు వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, దేశ నిర్మాణంలో వారి పాత్రను గుర్తించి, తెలంగాణలోని సనత్‌నగర్‌లో ఉన్న ఈఎస్ఐసి ఆసుపత్రిలోని ఓపిడి బ్లాక్ అభివృద్ధికి సహకరించిన నిర్మాణ కార్మికులను కేంద్ర మంత్రి సత్కరించారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉందని నొక్కిచెబుతూ, ఆయన ఈఎస్ఐ లబ్ధిదారులకు నగదు ప్రయోజనాలను కూడా పంపిణీ చేశారు. సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసి మెడికల్ కాలేజ్ & హాస్పిటల్‌లో కొత్తగా నిర్మించిన ఓపీడీ బ్లాక్ ఒక మైలురాయి వంటి ఆరోగ్య సంరక్షణ కేంద్రం. ఇది తెలంగాణ వ్యాప్తంగా హైదరాబాద్, మెడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి మరియు మహబూబ్‌నగర్ జిల్లాలను కవర్ చేస్తూ, 12,30,183 మంది బీమాదారులకు మరియు లబ్ధిదారులకు ఆధునిక, సమగ్రమైన ఔట్ పేషెంట్ సేవలను అందిస్తుంది.

ఇది ఒక మెడికల్ కాలేజ్ కమ్ హాస్పిటల్ కావడంతో, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీమాదారులకు కూడా సేవలు అందిస్తుంది. 43,611.04 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించబడిన ఈ సదుపాయంలో జనరల్ మెడిసిన్, ఈఎన్‌టి, డెంటిస్ట్రీ, ప్రసూతి & గైనకాలజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, సైకియాట్రీ, డెర్మటాలజీ, పల్మనాలజీ, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ మరియు ఆయుష్ విభాగాలకు ఓపీడీ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వీటితో పాటు ఫిజికల్ మెడిసిన్ & రిహాబిలిటేషన్, రేడియాలజీ, యోగా, 180 సాధారణ పడకలు (మూడు 60-పడకల వార్డులలో), 25 ఐసియు మరియు 20 ఎన్ఐసియు పడకలు, ఐసియు/ఎన్ఐసియు యూనిట్లు, మెడికల్ స్టోర్లు మరియు ఒక క్లినికల్ లెక్చర్ థియేటర్ కూడా ఉన్నాయి. ఈ ప్రారంభోత్సవాలు ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను విస్తరించడంలో మరియు భారతదేశ కార్మిక శక్తికి సామాజిక భద్రతను బలోపేతం చేయడంలో ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తాయి. కార్మిక శక్తి యొక్క గౌరవం, ఆరోగ్యం మరియు సంక్షేమాన్ని జాతీయ పురోగతికి కేంద్రంగా ఉంచడం ద్వారా, ఇవి 'శ్రమేవ జయతే' అనే ప్రభుత్వ దార్శనికతకు ప్రతిరూపంగా నిలుస్తాయి.

# రూ.2 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన
# పెద్దపల్లి మున్సిపల్ ఏఈ

మంజూరు చేయించేందుకు రూ.2 లక్షల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా సతీష్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఫిర్యాదుదారు పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తెనుగువాడ హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులు, కునారం రోడ్డు శ్మశానవాటిక అభివృద్ధి పనులు (ప్యాకేజీ-IX) చేపట్టారు. ఈ పనులకు సంబంధించిన రూ.12,28,748 విలువైన తుది బిల్లును ప్రాసెస్ చేసి TUFIDCకి పంపేందుకు ఏఈ లంచం కోరినట్లు ఏసీబీ తెలిపింది. అధికారుల సమక్షంలో స్వీకరించిన రూ.2 లక్షల లంచం నగదును ఏఈ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన నివాసంలో నిర్వహించిన సోదాల్లో లెక్కల్లో చూపని రూ.32,31,900 నగదును కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక విధులను దుర్వినియోగం చేసి అక్రమ లాభం పొందేందుకు లంచం స్వీకరించినందుకు ఏఈపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఆయనను అరెస్టు చేసి కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలను ఏసీబీ వెల్లడించలేదు. అధికారుల సమక్షంలో స్వీకరించిన రూ.2 లక్షల లంచం నగదును ఏఈ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయన నివాసంలో నిర్వహించిన సోదాల్లో లెక్కల్లో చూపని రూ.32,31,900 నగదును కూడా ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారిక విధులను దుర్వినియోగం చేసి అక్రమ లాభం పొందేందుకు లంచం స్వీకరించినందుకు ఏఈపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం ఆయనను అరెస్టు చేసి కరీంనగర్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది. భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారు వివరాలను ఏసీబీ వెల్లడించలేదు.

### లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఫిర్యాదు చేయండి: ఏసీబీ

ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. అలాగే వాట్సాప్: 9440446106, ఫేస్‌బుక్ (Telangana ACB), ఎక్స్ (Twitter): ఏసీబీ తెలంగాణ ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN

## యుద్ధంలో సమిధలవుతున్న సామాన్యులు

పశ్చిమాసియాలో నెలకొన్న శాంతియుత పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారిపోయాయి. ఇరాన్ ను లక్ష్యంగా చేసుకుని అమెరికా భీకర దాడులకు దిగింది. ప్రతిగా ఇరాన్ కూడా ఎదురు దాడులకు దిగింది. యుద్ధం మూలంగా కేవలం ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా నే కాకుండా సమీపంలోని లెబనాన్,గల్ఫ్ దేశాలకు తీవ్ర నష్టం కలిగించింది. అటు ఆయా దేశాల్లోని అమెరికా స్థావరాలకు తీవ్ర నష్టం కలిగించింది. యుద్ధం మూలంగా ప్రపంచ వ్యాప్తంగా చమురు కొరత ఏర్పడి పలు దేశాలు లాక్ డౌన్ దిశగా అడుగులు వేస్తున్నాయి. యుద్ధం మూలంగా కేవలం ఆస్తి, ఆర్థిక నష్టమే కాదు పెద్ద ఎత్తున ప్రాణ నష్టం కూడా సంభవించింది. ముఖ్యంగా ఇరాన్‌లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో ముక్కుపచ్చలారని చిన్నారులు ఎందరో ఉన్నారు. ఎన్నో వందల మంది గాయాలపాలయ్యారు. పరస్పర దాడుల్లో ఆ రెండు దేశాలకు ఏ మేర నష్టం వాటిల్లిందన్న విషయాన్ని పక్కనపెడితే?ఇరాన్ దాడుల్లో భారత్ కు చెందిన ఓ వాణిజ్య నౌక ధ్వంసం కాగా? అందులోని ఓ భారతీయుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన హర్మూజ్ జలసంధికి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది.రెండు దేశాల మధ్య యుద్ధం కారణంగా ఆ దేశాలకు చెందిన ఆస్తి, ప్రాణ నష్టాలు సర్వసాధారణమే అయినప్పటికీ? ఆ యుద్ధం కారణంగా ఇతర దేశాలకు.. అది కూడా అలీన ఉద్యమంతో ప్రపంచ శాంతికి బాటలు వేస్తున్న భారత్ లాంటి దేశాలకు నష్టం వాటిల్లుతుండటం గమనార్హం. అమెరికా, ఇరాన్ యుద్ధంలో భారత్ ఏ ఒక్క దేశానికి మద్దతు పలక లేదు. అదే సమయంలో ఇరు దేశాలు చర్చించుకుని ప్రపంచ శాంతికి పాలుపడాలని భారత్ ఆకాంక్షిస్తున్న సంగతీ తెలిసిందే. ఇలాంటి నేపథ్యంలో ఇరాన్ దాడిలో భారత నౌక ధ్వంసం కావడం, అందులోని ఓ భారతీయుడు గల్లంతు కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ప్రారంభమైన యుద్ధానికి శాశ్వత ముగింపు పలికేందుకు జరుగుతున్న శాంతి ప్రయత్నాలపై తాజాగా జరుగుతున్న పోరాటం కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నది. ఇక ఈ రెండు దేశాల మధ్య శాంత కల్లేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో జరిపిన రెండు దాడుల కన్నా తీవ్రంగా ఆదివారం ఇరాన్‌లోని 140కు పైగా క్షిపణి, డ్రోన్ కేంద్రాలు, ఆయుధాగారాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర ప్రాంతాలపై లక్షిత దాడులు చేసినట్టు అమెరికా ప్రకటించింది. 'ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు అది మూల్యం చెల్లిస్తున్నది' అని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఆన్‌లైన్‌లో పోస్ట్ పెట్టారు. తాము మాత్రమే హ్వార్ముజ్ జలసంధిని నియంత్రించగలమని, దాని ద్వారా పయనించే నౌకలపై చార్జీలు విధించగలమని ఇరాన్ స్పష్టం చేసింది. ఏకపక్ష ఒప్పందాల శకం ముగిసిందని ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ బాఘెర్ ఘాలిబాఫ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కాగా, ఇరాన్ క్షిపణులను తాము సమర్థంగా అడ్డుకున్నట్టు ఖతార్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా క్షిపణి శకలాలు పడి ఒక పిల్లవాడు సహా ముగ్గురు పౌరులు గాయపడ్డట్టు తెలిపింది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను తాము కూడా అడ్డుకున్నట్టు కువైట్ మిలిటరీ ప్రకటించింది. ఆదివారం బహ్రెయిన్‌లో పౌరులకు మూడుసార్లు హెచ్చరిక సైరన్లు మోగాయి.సైప్రస్ జెండాతో భారత్ బయలుదేరిన జీఎఫ్ఎన్ గెలాక్సీ నౌకపై ఓమన్ తీరం సమీపంలో హర్మూజ్ జల సంధికి చేరుకున్న సమయంలో ఇరాన్ నుంచి దూసుకువచ్చిన బాంబు పడింది. దీంతో గెలాక్సీ నౌకలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. నౌకలో మంటలు చెలరేగిన సమయంలో అందులో ఉన్న 11 మంది భారతీయులు దానిని వదిలేసి చిన్నపాటి లైఫ్ బోటులో ప్రాణాలు కాపాడుకునే యత్నం చేశారు. ఈ క్రమంలో 10 మంది భారతీయులు చిన్నబోటులో సురక్షిత ప్రాంతానికి చేరుకోగా? మరో వ్యక్తి మాత్రం గల్లంతయ్యారు. గల్లంతైన వ్యక్తి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై భారత విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది.

కాగా, ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటిరకు ఇరాన్‌లో 8,531 మంది మరణించారని అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం హెచ్ఆర్ఏఎన్ఏ పేర్కొంది. వీరిలో 5,607 మంది సామాన్య పౌరులు ఉన్నారని తెలపడం గమనార్హం. అంతేకాదు మృతుల్లో 1244 మంది పిల్లలు కూడా ఉన్నారని పేర్కొనడం గుండెతరుక్కుపోయే విషం. క్షేత్రస్థాయి నివేదికలు, స్థానికుల సమచారం, వైద్య, అత్యవసర వనరులు, అధికారిక ప్రకటనల ఆధారంగా తాము ఈ సమాచారాన్ని సేకరించినట్లు ఆ సంస్థ తెలిపింది. ఆ సమాచారం ఆధారంగా ఇరాన్‌లో 5500 మందికి పైగా చనిపోయారని పేర్కొంది. ఇదిలా ఉండగా అంతర్జాతీయ సంస్థ అయిన రెడ్‌క్రాస్ వాదన మరోతీరు ఉంది. అమెరికా -ఇజ్రాయెల్ దాడుల మూలంగా ఇరాన్‌లో ఇప్పటివరకు కనీసం 3,900 మంది మరణించగా, 60,000 మంది గాయపడ్డారని పేర్కొన్నది. ఇక, మార్చి 2 నుంచి ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 1124 మంది చిన్నారులతో పాటు దాదాపు 3,368 మంది లెబనాన్ పౌరులు మరణించారని లెబనీస్ అధికారులు వెల్లడించారు.

అలాగే, లెబనీస్ సాయుధ సంస్థ హిజ్బుల్లాకు చెందిన 400 మంది సైనికులు మరణించారని ఆ సంస్థ ప్రకటించింది. అలాగే ఈ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాక్‌లో 702మంది మరణించారు.ఇరాన్ దాడికి ఖండిస్తూ ఆ శాఖ ఓ ప్రకటనను విడుదల చేసింది. దాడి జరిగిన సమయంలో ఓమన్ ప్రభుత్వం వేగంగా స్పందించి? ప్రమాదంలో పడిన భారతీయులను కాపాడిందని ఆ శాఖ తెలిపింది. భారతీయులను కాపాడిన ఓమన్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. గల్లంతైన వ్యక్తి కోసం ఓమన్ దేశ సహాయక సిబ్బందితో కలిసి గాలింపు చేపట్టినట్లు తెలిపింది.

## రజకుల భూములను ఆక్రమిస్తే సహించం

- ఐకాసా నాయకులు



ఆళ్లగడ్డ (భారత శక్తి) కులమతాలకు అతీతంగా సర్వ మతాలవారు రజకులను తమ ఇంటి ఆడపడుచు గా భావిస్తారు అలాంటి రజకుల భూములపై కన్నేస్తే సహించబోమని అఖిలభారత రజక సంఘం నాయకులు నాగేంద్ర పేర్కొన్నారు. ఆళ్లగడ్డ మండల పరిధిలోగల బత్తలూరు గ్రామంలో ఒకపక్క కులవృత్తి చేసుకుంటూ మరో ప్రక్క ప్రభుత్వం తమకు ఇచ్చిన భూములలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్న రజకులకు చెందిన భూములను అదే బత్తలూరు గ్రామానికి చెందిన కొంతమంది అగ్రవర్ణాల వారు కబ్జా చేసుకున్నారు పలు సంవత్సరాల నుండి రజకులను తమ సొంత పొలాల వద్దకు కూడా రాకుండా తమ పరపతి పలుకుబడితో అడ్డుపడుతూ భూములకు దూరంగా ఉంచుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాలకుల వద్దకు తమ మొరను తీసుకొని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేస్తున్న పట్టించుకోకపోవడంతో అఖిలభారత రజక సంఘం నాయకుల దృష్టికి బాధితులు సమస్యను తీసుకుని వెళ్లి తామపడుతున్న గోసను వెల్లబోసుకున్నారు. విషయం తెలుసుకున్న అఖిలభారత రజక సంఘం రాయలసీమ ఇంచార్జ్ నాగేంద్ర ఆళ్లగడ్డ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాళ్ళ భాషా, బీసీ సంఘం నాయకుడు సుబ్బయ్య, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు బి చంద్రశేఖర్ తదితర కుల, మత సంఘాల నాయకులతో కలిసి వివాదాస్పద భూమిని బాధితులతో కలిసి పరిశీలించారు. అక్కడ వారు ఎదుర్కొన్న సమస్యలను వారి ద్వారానే విని ప్రజాసంఘాల నాయకులు చల్లించి పోయారు. రజకులు తాము ఉతికిన బట్టలను ఆరబోసుకోవడానికి సైతం స్థలం లేక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మహిళలు బోరున విలపించారు. ఈ సందర్భంగా ప్రజాసంకల్ప నాయకులు బీరువాల భాష సుబ్బయ్య నాగేంద్ర లు మాట్లాడుతూ అగ్రవర్ణాల దౌర్జన్యం అణగారిన వర్గాల వారిపై ఇకా ఎంతకాలం సాగదని అన్నారు.

నియోజకవర్గ కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామంలో ఇంత దాష్టకం జరుగుతున్న స్థానిక సచివాలయ సిబ్బంది కానీ ఎమ్మార్వో కార్యాలయం వారు కానీ స్పందించడం లేదంటే అవతలి వారి పలుకుబడి పరపతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని అన్నారు. రజకులకు చెందిన భూములను వారికి తిరిగి అప్పగించకపోతే రాజ్యాంగబద్ధంగా చట్టానికి లోబడే అక్రమార్కులపై న్యాయపోరాటం చేస్తామని నాయకులు హెచ్చరించారు. అలాగే ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఈ ఘటనపై తక్షణమే స్పందించి బాధితులను పరామర్శించి భూ ఆక్రమణకు పాల్పడిన భూ బకాసురులపై తగిన చర్యలు తీసుకోవాలని వినమ్రతా పూర్వకంగా కోరుకుంటున్నామని ఐకాసా నాయకులు మీడియా ముఖంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల భాష బీసీ సంఘం నాయకుడు సుబ్బయ్య మాల మహానాడు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, మాల మహానాడు జిల్లా జాయింట్ సెక్రెటరీ రాజేష్, రజక సంఘం సభ్యులు చిన్న పాములేటి, శీను ,రాజా , చిన్న దిబ్బన్న, జాల శేఖర్, సుబ్బారాయుడు, వెంకటసుబ్బయ్య, నరసింహుడు, పామన్న, పాములేటి, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ ఆది నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## హసీనా బంగ్లాదేశ్ వస్తే అరెస్ట్ చేస్తాం

బంగ్లాదేశ్ న్యూస్ ఏజెన్సీ బీఎస్ఎస్‌తో శామా మాట్లాడుతూ.. 'ఒక వేళ షేక్ హసీనా లొంగిపోతే.. చట్ట ప్రకారం ఆమెపై చర్యలు తీసుకుంటాం. హసీనా తప్పక జైలుకు వెళ్లాల్సి వస్తుంది. చట్టం తన పని తను చేసుకుపోతుంది. ఇండియాలో లొంగిపోయినా.. బంగ్లాదేశ్‌కు వచ్చి లొంగిపోయినా.. మొదట ఆమె జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. నేరస్థులు చేసే వ్యాఖ్యలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోదు. అజ్ఞాతంలోకి వెళ్లిన అవామీ లీగ్ నాయకులను, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా ఆమె విదేశాల నుంచి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారు. అంతకంటే వేరే కారణం నాకు కనిపించడం లేదు' అని అన్నారు.

## పపంచ స్ట్రోక్ సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్కు డా. పి. విజయ ఎన్నిక

విజయ ఒకరిగా ఎన్నిక కావడం విశేషం. అమెరికా, యూరప్, ఆఫ్రికా/మిడిల్ ఈస్ట్ లతో పాటు ఉన్న 4 ప్రధాన ఖండాల గ్రూపులలో ఒకటైన ఆసియా–ఓషియానియా ప్రాంతానికి డాక్టర్ విజయ గారు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం) అత్యుత్తమ చికిత్సలు, పరిశోధన, ప్రజలలో అవగాహన మరియు ప్రజారోగ్య విధానాల రూపకల్పనలో ఆమె అందించిన విశిష్ట సేవలకు గాను ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ప్రపంచ స్ట్రోక్ సంస్థ (WSO) అనేది ప్రపంచవ్యాప్తంగా పక్షవాత నివారణ, అత్యాధునిక చికిత్స, పునరావాసం, పరిశోధన, వైద్య విద్య మరియు ప్రజల్లో అవగాహన పెంపుదల కోసం పనిచేస్తున్న అత్యున్నత అంతర్జాతీయ సంస్థ. డా. విజయ గారు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సభ్యురాలిగా 2026 నుంచి 2030 వరకు నాలుగేళ్లపాటు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ పదవిలో ఆమె ప్రపంచవ్యాప్తంగా స్ట్రోక్ వైద్య విధానాల రూపకల్పన, అంతర్జాతీయ చికిత్స మార్గదర్శకాల (guidelines ) అభివృద్ధి, విద్యా కార్యక్రమాల నిర్వహణ, ప్రపంచ స్ట్రోక్ కార్యక్రమాల పర్యవేక్షణ, వివిధ దేశాల స్ట్రోక్ నిపుణులు మరియు జాతీయ స్ట్రోక్ సంఘాల మధ్య సమన్వయం, అలాగే స్ట్రోక్ అవగాహన మరియు సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించనున్నారు. నూతన బోర్డు తొలి సమావేశంలో పాల్గొనడానికి ఈ ఏడాది అక్టోబర్లో ఆమె దక్షిణ కొరియాలోని సియోల్కు వెళ్లనున్నారు. భారతదేశంలో ఆధునిక స్ట్రోక్ వైద్య సేవలకు శ్రీకారం చుట్టిన ప్రముఖుల్లో డా. విజయ ఒకరు. ఆమె 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో మొట్టమొదటి స్ట్రోక్ యూనిట్ను ప్రారంభించారు. ముంబై, చెన్నై తర్వాత దేశంలో స్థాపించబడిన మూడవ స్ట్రోక్ యూనిట్. ఆమె నాయకత్వంలో ఈ కేంద్రం ఎంతో అభివృద్ధి చెంది, భారతదేశంలోనే మొట్టమొదటి అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్ (1స్ట్ అక్రిడిటెడ్ అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్ ) గా గౌరవాన్ని అందుకుంది. డా. విజయతో పాటు ఆమె నాయకత్వంలోని అంకినీడు అడ్వాన్స్ స్ట్రోక్ సెంటర్ అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకుంది. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రదానం చేసే పాల్ డడ్లీ వైట్ ఇంటర్నేషనల్ స్కాలర్ అవార్డు, అమెరికన్ అకాడమీ ఆఫ్ న్యూరాలజీ (AAN) యొక్క ఏ.బి. బేకర్ అవార్డు, అలాగే ప్రపంచ స్ట్రోక్ సంస్థ--ఏంజెల్స్ కార్యక్రమం నుంచి వరుసగా డైమండ్ స్టేటస్ అవార్డులు అందుకోవడం విశేషం. ప్రపంచ స్ట్రోక్ సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్కు డా. విజయ ఎన్నిక కావడం భారతదేశంలో స్ట్రోక్ వైద్యరంగ అభివృద్ధికి ఆమె అందించిన అసాధారణ సేవలకు అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచింది. ఈ అరుదైన గౌరవం లలితా పి.వి.ఎస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఆంధ్రప్రదేశ్ వైద్య సమాజం మరియు యావత్ దేశానికి గర్వకారణమని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## సీఎం రేవంత్ రెడ్డికి రెండు చోట్ల ఓటు..

రాష్ట్ర ప్రభుత్వ అధికారిక 'ఫ్యాక్ట్‌చెక్ తెలంగాణ' తన 'ఎక్స్' ఖాతాలో ప్రకటన విడుదల చేసింది. కొడంగల్, అచ్చంపేట (కొండారెడ్డిపల్లి) నియోజకవర్గాల ఓటర్ల జాబితాల్లో ముఖ్యమంత్రి పేరు (ఎపిక్ నెం: TES0274035) ఉన్నప్పటికీ, ఆయన రెండు చోట్ల ఓటు వేసే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోనే ఓటును కొనసాగించాలని, కొండారెడ్డిపల్లి జాబితా నుంచి పేరును తొలగించాలని రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు ఇప్పటికే ఎన్నికల అధికారులకు విన్నవించారు. 2023 ఎన్నికల అఫిడవిట్‌లో వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని నివాసాన్నే ఆయన ధ్రువీకరించగా, అచ్చంపేట నియోజకవర్గంలోని కొండారెడ్డిపల్లి ఆయన స్వగ్రామం. నివాసం లేదా వృత్తిరీత్యా ప్రాంతాలు మారినప్పుడు రికార్డులు సకాలంలో అప్‌డేట్ కాకపోవడం, పరిపాలనాపరమైన పరిమితుల వల్ల ఇటువంటి ద్వంద్వ నమోదులు జరుగుతుంటాయని అధికారులు వివరించారు. 'ఒక వ్యక్తి – ఒక ఓటు' అనే సూత్రాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేసేందుకు ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో ఎలాంటి ఉద్దేశపూర్వక తప్పిదం లేదని, ఇది సాధారణంగా జరిగేదేనని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

## ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి - టైలర్స్ కాలనీలో రూ.55 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన**

అమీన్‌పూర్: జూలై 14 భారతశక్తి,అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన, రక్షిత మంచినీటి సరఫరా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు.అమీన్‌పూర్ డివిజన్‌లోని టైలర్స్ కాలనీలో జలమండలి ఆధ్వర్యంలో రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమయ్యేలా మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేయడానికి నూతన పైపులైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయిన అనంతరం టైలర్స్ కాలనీ ప్రజలు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సిన అవసరం ఉండదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ వంటి అన్ని మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ ప్రతి కాలనీని ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి



ఉన్నామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసి సుధాకర్ రెడ్డి, జలమండలి జీఎం శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం శివ, ఏఈ శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు ఉపేందర్ రెడ్డి, జగదీష్, గోపాల్, రాములు, చంద్రశేఖర్, రాజు, బాలరాజు, స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ. 25 కోట్ల విలువైన ప్రజా స్థలాల పరిరక్షణ

**అక్రమార్కుల గుర్తైన భూములను స్వాధీనం చేసుకున్న హైడ్రా.. చెంగిచెర్లలో ఫెన్సింగ్ ఏర్పాటు**

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా జూలై 14 భారతదేశ మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని చెంగిచెర్ల గ్రామంలో ఉన్న జయప్రద కాలనీలో ఒక భారీ భూ రక్షణ చర్య చోటుచేసుకుంది. ప్రజా అవసరాల కోసం ఉద్దేశించిన సుమారు 4400 గజాల స్థలాన్ని 'హైదరాబాద్ విపత్తుల ప్రతిస్పందన, ఆస్తుల పర్యవేక్షణ, రక్షణ సంస్థ' (హైడ్రా) స్వాధీనం చేసుకుంది. ఈ భూమి బహిరంగ మార్కెట్ విలువ సుమారు రూ. 25 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

### - కేటాయింపుల వివరాలు

స్వాధీనం చేసుకున్న 4400 గజాల విస్తీర్ణంలో వివిధ ప్రజా **సౌకర్యాల కోసం కేటాయించిన స్థలాలు క్రింది విధంగా ఉన్నాయి:**

- ఉద్యానవనం (పార్కు): 1200 గజాలు
- వాణిజ్య సముదాయాలు (షాపింగ్ కాంప్లెక్స్): 1200 గజాలు
- పాఠశాల, గ్రంథాలయం: 800 గజాలు
- రక్షిత మంచి నీటి ట్యాంక్: 800 గజాలు
- ఆధ్యాత్మిక కేంద్రాలు (దేవాలయాలు): 400 గజాలు

**ఆక్రమణల నేపథ్యంలో ప్రజావాణికి ఫిర్యాదు**

వాణిజ్య సముదాయాల కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు నివాస స్థలాలుగా మార్చి, ఇప్పటికే రెండు ఇళ్లను నిర్మించారు. వరుసగా జరుగుతున్న ఈ భూ ఆక్రమణలపై జయప్రద కాలనీ నివాసితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికులు ఈ విషయమై హైడ్రా ప్రజావాణి విభాగానికి అధికారికంగా ఫిర్యాదు చేశారు.




### - తక్షణ చర్యలు:

ఫిర్యాదు అందిన వెంటనే హైడ్రా బృందం క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి పరిశీలన జరిపింది. ఆక్రమణలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో, తక్షణమే స్పందించి సదరు ప్రజా అవసరాల స్థలాల చుట్టూ రక్షణ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసింది. అంతేకాకుండా, ఆ భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్లు హెచ్చరిక బోర్డులను కూడా ప్రతిష్ఠించింది. ప్రజా ఆస్తులను కాపాడటంలో హైడ్రా చూపిన చొరవ పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ ఫారముల ఆన్ లైన్ వెంట వెంటనే పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 14 (భారత శక్తి) జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, సోమవారం సాయంత్రం నిర్మల్ పట్టణంలోని ఏఎన్ రెడ్డి కాలనీలో జరుగుతున్న ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పరిశీలించారు. గడువులోగా ఎస్ఐఆర్ ఫారముల స్వీకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ఫారంలను పూరించుటలో ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. ఇప్పటివరకు పూర్తయిన ఎస్ఐఆర్ ఫారముల డిజిటలీకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ లు క్షేత్రస్థాయిలో ఓటర్లకు ఎస్ఐఆర్ విషయంలో సహాయం చేయాలన్నారు. సూపర్వైజర్లు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవీదాస్, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్ విస్తరణకు మోక్షం ఎప్పుడో?

**-పెరిగిన రద్దీ.. సరిపోని ప్లాట్ ఫామ్లు**

**-ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు**




మంచిర్యాల, జులై 14 (భారతశక్తి): మంచిర్యాల పట్టణంలోని బస్టాండ్ పరిస్థితి దయనీయంగా మారింది. ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరుగుతున్న సౌకర్యాల కల్పన పై అధికారుల దృష్టి సారించడం లేదు.మంచిర్యాల జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా కేంద్రానికి ప్రయాణ సౌకర్యం పెరగడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తుండడంతో బస్టాండులో రద్దీ పెరిగింది కానీ ఆ మేరకు వసతులు మాత్రం కరువయ్యాయి. జిల్లాలో ఉన్న ఏకైక బస్సు డిపో మంచిర్యాల. జిల్లా కేంద్రంలో ఉన్న బస్టాండ్ రద్దీకి తగినంత సదుపాయాలు లేవు ప్రజలకు తమ వ్యక్తిగత అవసరాల కోసం జిల్లా కేంద్రాన్ని సందర్శిస్తుండడం, మండలాలు గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి తరచూ రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో బస్టాండ్లో రద్దీ రోజురోజుకు పెరుగుతుంది. కానీ బస్టాండ్లో కేవలం 9 ప్లాట్ఫాంలు మాత్రమే ఉండడంతో ప్రయాణకుల రద్దీ సమయంలో నీడ కల్పించలేని పరిస్థితి కొనసాగుతోంది.బస్ స్టేషన్ విస్తరణ కోసం ఆర్టీసీ అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. చుట్టుపక్కల మండలాలకు చెందిన ప్రజలు తమ వ్యక్తిగత అవసరాల కోసం మంచిర్యాల చేరేందుకు ఆర్టీసీలో రావాల్సి ఉండగా సరైన బస్సులు సమయానికి ఉండకపోవడం,అలాగే కేటాయించిన బస్సులలో రద్దీ ఎక్కువగా ఉండడం తో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది.ఇప్పటికైన అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చెస్తున్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు ఫ్యాన్లు బహూకరణ



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 14(భారత శక్తి):కేసముద్రం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం లయన్స్ క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ మారగాని కృష్ణ పుట్టినరోజును పురస్కరించుకుని బేరువాడ ప్రాథమికోన్నత పాఠశాలలో సీలింగ్ ఫ్యాన్లను పంపిణీ చేశారు. మండల విద్యాధికారి కాలేరు యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ పాఠశాలలకు ప్రతి ఒక్కరి సహకారం ఉండాలని కోరుతూ లయన్స్ క్లబ్ ద్వారా చేపడుతున్న సహాయ సేవా కార్యక్రమాలను అభినందించారు. ప్రజలకు ఉపయోగపడే సహాయ సేవా కార్యక్రమాలు చేయడంలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని, లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు భవిష్యత్ లో చేపడతామని క్లబ్ అధ్యక్షులు యర్నం శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కోట కనకయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీరం జనార్ధన్ రెడ్డి, క్లబ్ ప్రతినిధులు కటకం చంద్ర శేఖర్, మడిపెద్ది వెంకటేష్, బెజ్జం ప్రేమ్ కుమార్, చింత కరుణాకర్, మారగాని శ్రీధర్, ఉపాధ్యాయులు వాగ్య తదితరులు పాల్గొన్నారు.

# 19 న కాళీమాత బోనాలు



మంచిర్యాల ప్రతినిధి, జూలై 14 ( భారత శక్తి ) : మంచిర్యాల పట్టణ పరిధిలోని గాంధీ నగర్ కాళీమాత కాలనీలో నూతనంగా వెలిసిన శ్రీ శ్రీ శ్రీ కాళీమాత అష్టకాల భైరవ గణపతి దేవాలయంలో ఈ నెల 19న ఆదివారం రోజున ఆషాడ మాస బోనాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు గాను మంగళవారం రోజున స్థానిక ఎమ్మెల్యే నివాసంలో మాజీ డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ జాతర పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అగోరి రఘు స్వామి,కమిటి సభ్యులు నల్ల శంకర్ ,విజయ, ఇసంపెల్లి శ్రీనివాస్,కార్పొరేటర్,తూముల నరేష్ ,నాయకులు సల్ల మహేష్, కంకణాల శ్యామ్,రాంచందర్ ,పానుగంటి శ్రీనివాస్ ,తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోంది- గోగుల సరిత

**- మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన గోగుల సరిత, తుంగతుర్తి రవి**



బోడుప్పల్, జూలై 14(భారత శక్తి ): మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 9వ డివిజన్ మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి పార్టీ నాయకులు కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన గోగుల సరిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, భోజన నాణ్యత, పరిశుభ్రత, పాఠశాల వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన వారు పాఠశాలలో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బలరాం, మహ్మద్ మజర్, ప్రణయ్, బర్రె నాగరాజు, సోమయ్య, కాటపాక కుమార్, సునిల్, జయందర్, శరత్ గౌడ్, సాయిరాం గౌడ్, భరత్, మేడిపల్లి మండల ఎం ఇ ఓ శ్రీనివాస్,పాఠశాల ప్రధానోపాధ్యాయులుసత్య ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పేదవాడి ఉన్నత చదువులపై సర్కార్ దెబ్బ.

**- ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర**

**- మంచిర్యాల జిల్లాలో కళాశాలల బంద్ విజయవంతం**

**-ఏబీవీపీ జిల్లా కన్వినార్ లావుడ్యా అనిల్ కుమార్**





మంచిర్యాల ప్రతినిధి జులై 14 ( భారత శక్తి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ABVP రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఎబివిపి మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలల బంద్ లో భాగంగా జిల్లా పరిధిలోని కళాశాలలు విద్యార్థులు బంద్ కి సహకరించి బంద్ లో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగ ాాదీపూ మంచిర్యాల జిల్లా కన్వీనర్ అనిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వం అందించే ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లపై ఆధారపడి చదువుకుంటున్నారని, కానీ ప్రభుత్వం సరైన సమయంలో ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయని కారణంగా 11000 కోట్ల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి యేట 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, 4.5లక్షాల మంది సర్టిఫికెట్స్ తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇక్కడి విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వలసవెళ్లే పరిస్థితి దాపురించిందన్నారు. గతంలో ఉన్న ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని తుంగలో తొక్కుతూ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నదని, మా ప్రభుత్వంలో బకాయిలు చెల్లించడంతో పాటుగా, గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఫీజులు చెల్లిస్తామని చెప్పిన నేటి ముఖ్యమంత్రి తానే విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పటికీ ఇప్పటి వరకు బకాయిలు విడుదల చేయకపోవడంతో ఈ విషయం కోర్టు మెట్లు ఎక్కిందనీ అన్నారు .ప్రైవేట్ కాలేజీలు ప్రభుత్వం కలిసి ఆడుతున్న నాటకంలో విద్యార్థులు బలి అవుతున్నారని, బడ్జెట్ కాలేజిలు సైతం మూతపడుతున్నాయని, పొట్టకూటి కోసం లెక్చరర్ గా మారిన నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దీనికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే అన్నారు. రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్స్ అనేవి విద్యార్థుల హక్కు అని ప్రభుత్వం వేసే బిక్ష కాదన్నారు. రీయింబర్స్ మెంట్ కోసం అడిగితే విద్యార్థులపై ఉక్కుపాదం మోపుతున్నారని, నిరసన చేస్తే లాఠీచార్జీలు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని, కానీ తెలంగాణ విద్యార్థులకు ఇవి కొత్తేమీ కాదన్నారు. రేవంత్ రెడ్డి మాట తప్పారని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరవాలని, లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి అంకురార్పణ చేస్తామని, అన్ని కళాశాల ప్రాంగణాలు, విశ్వవిద్యాలయాలు మరోసారి ఉద్యమ వేదికలై కాంగ్రెస్ పార్టీకి మరణశాసనం రాస్తాయన్నారు. పేద విద్యార్థులను చదువులకు దూరం చేస్తూ రాక్షసానందం పొందుతున్న రాష్ట్రప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మార్చుకోక పోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అనిల్, శ్రీచరణ్, జగన్, అనురాగ్, వరుణ్ తరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

**- ప్రజలకు ఇబ్బందులు లేకుండా కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

**- అధికారులతో సమీక్షించి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం**

**- జనగామలో 39 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ**

**-ముఖ్య అతిథిగా హాజరైన జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి...**



జనగామ(భారత శక్తి)జులై 14 జనగామ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జనగామ పట్టణం, మండలానికి చెందిన కళ్యాణలక్ష్మి పథకం లబ్ధిదా రులకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 39 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేసి వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...**

కళ్యాణలక్ష్మి చెక్కులు కొంతకాలంగా పెండింగ్లో ఉండటాన్ని గుర్తించి, వాటిని త్వరితగతిన లబ్ధిదారులకు అందించేందుకు తాను ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు.ఎంఆర్ఓ, ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయ అధికారులతో పలుమార్లు చర్చించి, పెండింగ్లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి నట్లు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలు ఆలస్యం కాకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించి నట్లు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే తాను పాల్గొనే ప్రతి కార్యక్రమంలోనే కళ్యా ణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో చేరేలా చూడటం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు. కళ్యాణలక్ష్మి పథకం ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాల కు ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుం దన్నారు. ఈ పథకం వల్ల పేద కుటుంబాలపై వివాహ ఖర్చుల భారం తగ్గడంతో పాటు వారికి ఆర్థిక భరోసా కలుగుతోందని తెలిపారు.

# వియత్నాం బోటు ప్రమాద బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కలెక్టర్



కడప, జూలై 14(భారత శక్తి ): వియత్నాం బోటు ప్రమాదంలో మృతి చెందిన ముడియం శ్రీధర్ భౌతికకాయం కడపకు చేరుకున్న సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి అకాల మరణం తీవ్ర విషాదకరమనన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, జిల్లా యంత్రాంగం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.మృతుడు శ్రీధర్ పనిచేసిన కంపెనీ తరపున అందించాల్సిన పరిహారం, సహాయ సహకారాలు, ఇతర అవసరమైన చర్యలు త్వరగా పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. శ్రీధర్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు గట్టి మనోధైర్యాన్ని ఆ దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కడప ఆర్డీవో మురళి, కేఎంసీ కమిషనర్ భవానీ ప్రసాద్, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో రెండు రోజుల పాటు సీఎస్ శాంతికుమారి పర్యటన



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 14 (భారత శక్తి )తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి.ఈ నెల 15, 16 తేదీల్లో నిర్మల్ జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా జూలై 15న మధ్యాహ్నం 3 గంటలకు నిర్మల్ జిల్లాలోని బాసర ఐఐఐటీ ను సందర్శించి అక్కడి విద్యా, మౌలిక సదుపాయాలను పరిశీలించనున్నారు.అనంతరం జూలై 16న ఉదయం 11 గంటలకు జిల్లా సమీకృత భవన సముదాయం లో జిల్లా అధికారులతో సమావేశమై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై నిర్వహించే జిల్లా స్థాయి రివ్యూ సమావేశంలో పాల్గొంటారు. తదుపరి మధ్యాహ్నం 3 గంటలకు ఆదిలాబాద్కు బయలుదేరనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధికారులందరూ సంబంధిత ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు.

# మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జీరో వన్ జీరో పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలి

**- టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బలాస్టి రమేష్**





మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 14(భారత శక్తి):తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ కేసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గుండు సురేందర్, ప్రధాన కార్యదర్శి నర్సింహా రాజు నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమంలో భాగంగా మోడల్ స్కూల్ కల్వల పాఠశాలను సందర్శించిన సందర్భంగా జిల్లా అధ్యక్షులు బలాస్టి రమేష్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ లలో పనిచేసే ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ లో పనిచేసే ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెల్త్ కార్డు సౌకర్యాన్ని వర్తింప చేయాలని, ఇప్పటివరకు మోడల్ స్కూల్ లలో పనిచేసే ఉపాధ్యాయులు దాదాపు 45 మంది పైగా మరణించారని, ఆ మరణించిన కుటుంబాలకు కారుణ్య నియామక ప్రక్రియను వర్తింపచేసి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని, ముఖ్యమంత్రి తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామని చెప్పి వాటికి ఐదు ఎకరాల స్థలం, 15 కోట్ల రూపాయలు ఐదు బస్సులు కేటాయిస్తామని మాట మార్చి నేడు 194 మోడల్ స్కూల్ లను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా మార్చి 12 కోట్ల రూపాయలు కేటాయించి డిజిటలైజ్ చేస్తామని చెప్పడంలో అర్థమేంటని, తక్షణమే తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటును వెనుకకు తీసుకొని రాష్ట్రంలో కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మోడల్ స్కూల్లో ఫిజికల్ డైరెక్టర్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని, మోడల్ స్కూల్లో గ్రేడ్-2 హిందీ పండిట్ పోస్టులు అవర్ లీ బేస్డ్ గా ఉన్నాయని వాటిని తక్షణమే క్రమబద్ధీకరణ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మోడల్ స్కూల్ హాస్టల్ బాధ్యతలు పూర్తిగా ప్రిన్సిపాల్ లకు అప్పగించి సక్రమంగా నడిచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బి.అంజయ్య, కార్యదర్శులు, ఊట్కూరి ప్రణయ్ కుమార్, వీసం నర్సయ్య, జి.శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పొడిగించిన గడువు సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**- ఈనెల 24 వరకు బీఎల్ఓల ఇంటింటి సందర్శన, గణన పత్రాల సేకరణ**



కడప, జూలై 14(భారత శక్తి ): రాష్ట్రంలో ఎస్ఐఆర్ కార్యక్రమానికి భారత ఎన్నికల సంఘం ఈనెల 24 వరకు గడువు పొడిగించిన నేపథ్యంలో, ఈ అవకాశాన్ని సద్వినియోగించుకుని జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి అభ్యర్థన మేరకు భారత ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)ప్రక్రియకు నిర్దేశించిన గడువులకు అనుగుణంగా ఇంటింటి సర్వే, గణన పత్రాల సేకరణ, అర్హులైన ఓటర్ల నమోదు, వివరాల పరిశీలన వంటి ప్రక్రియలను వేగవంతం చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ప్రతి ఓటరి వివరాలు నమోదు అయ్యేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా ప్రజలు ఎస్ఐఆర్ పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఇంకా గణన పత్రాలు సమర్పించని వారు, ఓటరు వివరాల్లో మార్పులు లేదా సవరణలు అవసరమైన వారు జూలై 24లోపు తమ పరిధిలోని బీఎల్ఓలకు అవసరమైన పత్రాలు, వివరాలు అందజేసి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు, సిబ్బంది, ప్రజలు సమిష్టిగా సహకరించి ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు.

**సవరించిన షెడ్యూల్ ఇలా...**

- జూన్ 15 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓల ఇంటింటి సందర్శన, గణన పత్రాల సేకరణ.
- జూలై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ పూర్తి.
- జూలై 31న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ.
- జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ.
- సెప్టెంబర్ 28లోపు క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం.
- అక్టోబర్ 3, 2026న ఆంధ్రప్రదేశ్ తుది ఓటర్ల జాబితా ప్రచురణ.

# జీజేసీ భైంసాను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఐఈఓ పరశురామ్.



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 14 (భారత్ శక్తి): నిర్మల్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరశు రామ్ మంగళవారం భైంసా ప్రభుత్వ జూనియర్ కళాశాల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల హాజరు, బోధన విధానం, విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన డీఐఈఓ పరశురామ్, ప్రతిరోజూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరై ఉపాధ్యాయులు బోధించే అంశాలను శ్రద్ధగా అభ్యసించాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ, ప్రతి రోజు చదివిన పాఠాలను పునశ్చరణ చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. కళాశాలలో అందుబాటులో ఉన్న గ్రంథాలయం, ఇతర విద్యా వనరులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందిస్తూ విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని, ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేలా కృషి చేయాలని ఆదేశించారు. కళాశాలలో విద్యా వాతావరణం, క్రమశిక్షణ, మౌలిక సదుపాయాలపై కూడా ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ తనిఖీలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొని కళాశాల విద్యా కార్యక్రమాల వివరాలను డీఐఈఓకు వివరించారు. విద్యార్థులు విద్యపై పూర్తి దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని డీఐఈఓ పరశురామ్ ఆకాంక్షించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



**జనగామ** టరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను జిల్లాలో వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం, జిల్లాలోని జఫర్గడ్ మండల కేంద్రంలో బిఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయిలో ఫారాల పంపిణీ, స్వీకరణ, డేటా ఎంట్రీ పురోగతిపై ఆరా తీశారు. ఫారాలు పంపిణీ చేయడం మాత్రమే కాకుండా, పూర్తిగా పూరించిన దరఖాస్తులను తిరిగి సేకరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని సంప్రదించాలని, ఒక కుటుంబంలో ఒక సభ్యుడి మ్యాపింగ్ పూర్తయితే మిగిలిన అర్హులైన సభ్యులందరికీ మ్యాపింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంకా ఫారాలు సమర్పించని కుటుంబాలను గుర్తించి, ప్రత్యేకంగా తిరిగి సంప్రదించాలన్నారు. మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి, నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలన్నారు. బిఎల్ఓలు ఓటర్లతో మర్యాదగా వ్యవహరించి, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత అధికారులు, బిఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న 6 డీఏలు, పీఆర్‌సీ అమలు చేయాలి

**- రాష్ట్రవ్యాప్తంగా టీపీయూఎస్ ధర్నాలు**


**హైదరాబాద్,** పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయడంతో పాటు కొత్త పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట భారీ ధర్నాలు నిర్వహించబడ్డాయి. ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి తమ డిమాండ్లను వినిపించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ, పెరుగుతున్న జీవన వ్యయాల మధ్య డీఏలు, పీఆర్‌సీ అమలులో ప్రభుత్వం జాప్యం చేయడం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.


ఉద్యోగుల న్యాయమైన హక్కులను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులకు మద్దతుగా బీజేపీ ఎమ్మెల్సీ మరియు శాసన మండలిలో బీజేపీ పక్ష నాయకుడు శ్రీ ఏవియన్ రెడ్డి హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు మరియు ఉపాధ్యాయుల ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాల సాధన కోసం తాను నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలు మరియు పీఆర్‌సీ అమలుపై తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లకు బీజేపీ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# ఇంటింటికీ వెళ్లని 'సర్'

**-తమ వద్దకే రావాలంటూ ఓటర్లకు బీఎల్ఓల హుకుం**
**-రాకపోతే ఓటు ఉండదంటూ హెచ్చరికలు**
**-ప్రతి ఇంటినీ 3 సార్లు వెళ్లాలనే నిబంధన బేఖాతరు**
**-ఫారం నింపేందుకు సహకరించడంలోనూ తీవ్ర నిర్లక్ష్యం**
**-వంద ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ చేశామన్న అధికారులు**
**-క్షేత్రస్థాయిలో మాత్రం చాలామందికి అందని ఫారాలు**
**బిఎల్ఓల దగ్గరే పెట్టుకున్న వైనం**





మణుగూరు, జూలై 14 (భారతశక్తి): మండలవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ క్షేత్రస్థాయిలో సవాళ్లు, సమస్యల మధ్యసాగుతున్నది. నిబంధనల ప్రకారం ప్రతి బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) ఓటరు ఇంటికి మూడుసార్లు వెళ్లి ఫారాలు అందజేసి, వివరాలు సేకరించాల్సి ఉండగా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. మేము పంచాయితీ కార్యాలయంలో ఉన్నాం.. ఇక్కడికే వచ్చి మీ ఫారాలు తీసుకెళ్లండి. వివరాలు నింపి, ఇచ్చివెళ్లండి అంటూ బీఎల్ఓ లు ఓటర్లకు ఫోన్లుచేసి ఆదేశిస్తున్నారు. ఒకవేళ ఓటర్లు రాకపోతే ఓటు తొలగిస్తామంటూ హెచ్చరిస్తుండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజలే బీఎల్ఓలు చెప్పిన చోటుకు వెళ్లి ఫారాలు తెచ్చుకుంటున్నారు. మండలంలో 59,440 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు వంద శాతం పంపిణీ చేసినట్టు అధికారులు చెప్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో చాలా మందికి ఫారాలు అందలేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. వారం రోజుల కిందటే వరకే ఫారాల పంపిణీ పూర్తి కావాలి. కానీ క్షేత్రస్థాయిలో బీఎల్ఓ నిర్లక్ష్యంతో పాటు పట్టణ ప్రాంతాల్లో అడ్రస్ లు దొరకక పంపిణీ ఆలస్యమవుతున్నది. ఇక వాటిని నింపి వివరాలను డిజిటలైజేషన్ చేసే ప్రక్రియ కూడా నత్తనడకన సాగుతున్నది.

**- ఇంటింటికీ వెళ్లడం లేదు.. కార్యాలయాలకే రమ్మంటున్నారు!**

మండలంలో 'సర్' ఫారాల పంపిణీ వంద శాతం పూర్తయినట్టు కాగితాల్లో కనిపిస్తున్నా, వాస్తవ పరిస్థితి మరోలా ఉంది. నిబంధనల ప్రకారం బీఎల్ఓలే స్వయంగా ఓటర్ల ఇండ్లకు వెళ్లి ఫారాలు ఇవ్వాలి. కానీ, అనేక ప్రాంతాల్లో వారు ఇండ్లకు వెళ్లకుండా, ఆయా కార్యాలయాలకో లేదా తాము చెప్పిన ప్రాంతాలకో ఓటర్లను రమ్మంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఫారాలు తీసుకెళ్లకపోతే ఓట్లు తొలగిపోతాయంటూ బెదిరింపు ధోరణికి దిగుతుండటంతో,ఓటర్లు తప్పనిసరి పరిస్థితుల్లో పనులన్నీ మానుకొని బీఎల్ఓల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఫారాల్లో వివరాల నమోదు విషయంలోనూ బీఎల్ఓలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో బీఎల్ఓలకు ఓ పెద్ద సమస్యే ఎదురవుతోంది. గతంలో అద్దెకు ఉన్న ఓటర్లు ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారో తెలియక, వారి ఫోన్ నెంబర్లు కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రస్తుతం వారి ఆచూకీ కనుగొనడం కత్తిమీద సాములా మారింది. దీనికి తోడు, కొంతమంది బీఎల్ఓ లు నేరుగా ఫారాలను ఓటర్ల చేతికి ఇచ్చి, మీరే పూర్తి చేసుకోండి అని చెప్పి వెళ్లిపోతుండటంతో.. ఆ ఫారాలను ఎలా నింపాలో, ఏ వివరాలు ఎక్కడరాయాలో తెలియక సామాన్య ఓటర్లు తికమకపడుతున్నారు. సరైన అవగాహన లేక ఫారాల భర్తీ ప్రక్రియపూర్తిగా గందరగోళంలో పడింది.

**- సేకరణలో జాప్యం**

మండలంలో ఇప్పటివరకు దాదాపు 31.12 శాతం ఆన్లైన్లో నమోదు (డిజిటలైజేషన్) పూర్తయింది. ఆన్లైన్లో నమోదు చేయడం (డిజిటలైజేషన్) ఆశించినంత వేగంగా సాగడం లేదు. నెట్వర్క్ సమస్యలు, ఓటర్లు ఫారాలను ఆలస్యంగా అందించడం,



బిఎల్ఓలకు అవగాహన లేకపోవడం, కొన్ని ప్రాంతాల్లో సాంకేతిక ఇబ్బందులు వంటి కారణాలతో ఈ ప్రక్రియ మందగించినట్లు తెలుస్తోంది. దీంతో గడువు సమీపిస్తుండడంతో బీఎల్ఓలపై తీవ్ర ఒత్తిడి నెలకొంది.

**- సహకారం కోసం అన్ని వర్గాల వైపు అధికారుల చూపు**

ప్రారంభంలో సర్ కార్యక్రమం నిర్ణీత గడువులో పూర్తవుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేసినప్పటికీ, చివరి దశలో పరిస్థితి క్లిష్టంగా మారడంతో అదనపు సిబ్బందిని రంగంలోకి దింపుతున్నారు. వివిధ శాఖల ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువజన సంఘాలు, రాజకీయ పార్టీల కార్యకర్తల సహకారాన్ని కూడా తీసుకుంటున్నారు. గ్రామాలవారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి ఫారాల సేకరణను వేగవంతం చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్యోగులు పట్టణం, గ్రామాల్లో తిరుగుతూ సేకరణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. సర్ కార్యక్రమం గడువు ఈ నెల 24తో ముగియనున్న నేపథ్యంలో మిగిలిన ఫారాల సేకరణ, డిజిటలైజేషన్, వివరాల పరిశీలన వంటి పనులను పూర్తి చేయడానికి అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, బీఎల్ఓలు సమన్వయంతో పనిచేస్తుండగా, ప్రజలు కూడా తమ ఫారాలను వెంటనే పూర్తి చేసి అందజేస్తేనే ఓటర్ల జాబితా సమగ్రంగా, పారదర్శకంగా రూపొందుతుందని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం మండలం లో సర్వం సర్ మయంగా మారిన పరిస్థితుల్లో గడువు ముగిసేలోపు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయడమే అధికారయంత్రాంగం ముందున్న ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. పూర్తి చేసిన ప్రతి ఎన్యూమరేషన్ ఫారంలో సదరు ఓటరుతోపాటు బీఎల్ఓ సంతకం, అలాగే ఓటరు ఫొటో కచ్చితంగా ఉండేలా సరిచూసుకోవాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేయడంలో ఏమైనా సందేహాలు ఎదురైతే, మండల కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్, టోల్ ఫ్రీ 1950, 9553370850 నంబర్లకు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు.

# శంభీపూర్‌లో సర్ హెల్ప్ డిస్క్‌ను పరిశీలించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి




కుత్బుల్లాపూర్, జూలై 14(భారత శక్తి ):కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 296 డివిజన్ దుండిగల్ పరిధిలోని శంభీపూర్ గ్రామంలో నిర్వహిస్తున్నస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) హెల్ప్ డిస్క్ కార్యక్రమాన్ని లినియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రజలు ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపి సమర్పించాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు తాగునీటి సమస్య, గ్రామ చెరువు ఆక్రమణలపై స్పందించిన కొలను హన్మంత్ రెడ్డి చెరువు ప్రాంతాన్ని పరిశీలించి, ఆక్రమణలను తొలగించి చెరువును పరిరక్షించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రెండు బోర్‌వెల్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు అమరం ముత్యం రెడ్డి, దుండిగల్ డివిజన్ అధ్యక్షుడు జక్కుల మల్లేష్, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, పీసరి మహేందర్ రెడ్డి, మనోజ్ రెడ్డి, సంగొళ్ల నాగేష్, క్యాసారం సత్తయ్య, సంగొళ్ల శంకర్, మనోహర్, గురువా రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భైంసా మండలంలో సర్ ప్రక్రియపై సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్ సమీక్ష సమావేశం.



నిర్మల్ జిల్లా ప్రతినిధి జూలై 14 (భారత శక్తి): భైంసా మండలంలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్షవ్ రెవిషన్ (సర్ ) ప్రక్రియ పురోగతిపై భైంసా సబ్ కలెక్టర్, ఎన్నికల నమోదు అధికారి (ERO) అజ్మేరా సంకేత్ కుమార్,మండల ప్రత్యేక అధికారులు, ఫెయిర్ ప్రైస్ (ఎఫ్.పి.) డీలర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటింటి సర్వేను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, ఓటర్ల వివరాల ఖచ్చితత్వం, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాల నమోదు వంటి అంశాల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, సమర్థవంతంగా సర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులు, ఫెయిర్ ప్రైస్ డీలర్లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రజలు కూడా సర్ ప్రక్రియకు పూర్తి సహకారం అందించి, అవసరమైన సమాచారం, పత్రాలను సకాలంలో అందజేసి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సబ్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఫెయిర్ ప్రైస్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి**




సూర్యాపేట (భారతశక్తి ప్రతినిధి) జూలై 14: సూర్యాపేట పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యాపేట ట్రాఫిక్ సబ్ ఇన్స్పెక్టర్ ఆటో డ్రైవర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ క్రింది నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.

### డ్రైవింగ్ లైసెన్స్

ఆటో నడిపే ప్రతి డ్రైవర్ తప్పనిసరిగా ప్రభుత్వ గుర్తింపు పొందిన, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ మరియు వాహన పత్రాలను కలిగి ఉండాలి.

### -మద్యం సేవించి వాహనం నడపరాదు

మద్యం మత్తులో ఆటోలు నడపడం వల్ల అమాయక ప్రయాణికుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

### ట్రాఫిక్ సిగ్నల్ నియమాలు

జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, సిగ్నల్ జంపింగ్ చేయవద్దని స్పష్టం చేశారు.

### - పరిమితికి మించి ప్రయాణికులు

ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని, రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ ఆటోలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని కోరారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, స్థానిక ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు

# గోదావరి పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు

**- ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధికి రూ.117 కోట్లు**

**- అదనపు నిధుల కోసం కృషి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



జగిత్యాల, జూలై 14 (భారత శక్తి ప్రతినిధి): 2027 గోదావరి పుష్కరాలకు వచ్చే సామాన్యులు, వీఐపీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ధర్మపురిలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి పుష్కర ఏర్పాట్లను పరిశీలించారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి, భక్తుల సౌకర్యాల కోసం రూ.1,000 కోట్లు కేటాయించగా, ధర్మపురి, కోటిలింగాల క్షేత్రాల అభివృద్ధికి రూ.117 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ధర్మపురిలో శ్రీ ఉగ్ర నరసింహస్వామి ఆలయ అభివృద్ధి, వీఐపీ ఘాట్ల నిర్మాణం, కోటిలింగాలకు నాలుగు లైన్ల రహదారి, అమ్మ ఫంక్షన్ హాల్ నుంచి రాజారం రోడ్డు వరకు ప్రత్యేక రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. పుష్కర పనుల కోసం మరో రూ.60 కోట్ల అదనపు నిధులు తీసుకురావడానికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఆలయాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, ధర్మపురిని కూడా మాస్టర్ ప్లాన్‌తో టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పూజారులకు వేతనాల పెంపు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆదర్శ కమ్యూనిస్టు అరుణోదయ నాగన్న జీవితం ఆదర్శనీయం.

**సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఎస్‌డీఎల్‌సీ కార్యదర్శి కొట్టం అంజయ్య**




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 14(భారత శక్తి):హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జులై 25న జరగనున్న అరుణోదయ నాగన్న సంతాప సభ పోస్టర్‌ను మంగళవారం సబ్ డివిజన్ నాయకులు అన్నారపు హనుమంతు అధ్యక్షతన కేసముద్రం మార్కెట్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఎస్‌డీఎల్‌సీ కార్యదర్శి కొట్టం అంజయ్య మాట్లాడుతూ అరుణోదయ నాగన్న జీవితం తెలుగు రాష్ట్రాల ప్రజలకు తెరిచిన పుస్తకం వంటిదన్నారు. పీడిత ప్రజల పక్షపాతి, అణగారిన వర్గాల గొంతుకగా ఐదు దశాబ్దాల పాటు విప్లవోద్యమానికే తన జీవితాన్ని అంకితం చేశారని పేర్కొన్నారు. ఎర్రజెండాను భుజానెత్తుకొని పేదల పక్షాన, అమరుల త్యాగాలను స్మరిస్తూ ప్రజలను విప్లవోద్యమం వైపు చైతన్యపరిచిన యోధుడని కొనియాడారు. నిరాడంబర జీవితం గడిపిన నాగన్న ఎలాంటి ఆడంబరాలకు తావివ్వకుండా, తన చివరి శ్వాస వరకు ప్రజల కోసం, పేదల పక్షాన పోరాడిన గొప్ప మహనీయుడని తెలిపారు. సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జులై 25న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే అరుణోదయ నాగన్న సంతాప సభకు ఆయన అభిమానులు, విప్లవాభిమానులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్‌డివిజన్ నాయకులు బొమ్మగాని వెంకన్న, అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) మండల నాయకులు అంబటి నాగమల్లు, ఐఎఫ్‌టీయూ నాయకులు బట్టు నాగేశ్వర రావు, మిట్టగడుపుల వెంకన్న, పిన్నోజు చంద్రమౌళి, కాసు సూరయ్య, చిట్ల సంజీవ్, ఆదినారాయణ, పీర్నాకి శ్రీను, ముత్యాల ఉపేందర్, గుండెల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కడప పారిశ్రామిక ప్రగతికి మరో మైలురాయి..!

**- రూ.3,478 కోట్ల పెట్టుబడితో దాల్మియా సిమెంట్ లైన్--2 విస్తరణ...**

**- నేడు (15న) రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన**





కడప, జూలై 14(భారత శక్తి ): వైఎస్సార్ కడప జిల్లాను ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా పారిశ్రామిక రంగంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. దేశంలోని ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థలలో ఒకటైన దాల్మియా సిమెంట్ (భారత్) లిమిటెడ్ చేపడుతున్న లైన్-2 విస్తరణ ప్రాజెక్టుకు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు. జమ్మలమడుగు సమీపంలోని మైలవరం మండలం చిన్నకొమర్లలోని దాల్మియా సిమెంట్ ప్లాంట్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. కడప జిల్లాను పారిశ్రామిక కేంద్రంగా ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా తీర్చిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషీ ఫలితంగా జిల్లాలో యువత, పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల కుటుంబాల్లో వెలుగులు నిండనున్నాయి. పరిశ్రమల కారిడార్ గా ఎదుగుతున్న కడప జిల్లాలో వేల సంఖ్యలో చిన్న, కుటీర పరిశ్రమలతో పాటు అనేక భారీ పరిశ్రమలు దేశ ఆర్థిక వృద్ధిరేటులో కీలకమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. జిల్లాలో సిమెంట్ పరిశ్రమ బలంగా ఎదుగుతోందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం 16 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో పెద్ద సిమెంట్ యూనిట్లు పనిచేస్తుండగా, మరిన్ని విస్తరణ ప్రాజెక్టులు ప్రతిపాదిత దశలో ఉన్నాయి. ఈ విజయ పరంపరలో జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్న దాల్మియా సిమెంట్ కర్మాగార యూనిట్‌కు రెట్టింపు ఉత్పత్తి సామర్థ్యంతో రెండో భారీ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టనుంది. ఈ బృహత్తర శుభకార్యానికి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ శుభారంభం చేయనున్నారు. రూ.3,478 కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టు పూర్తయితే సంస్థ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 12.6 మిలియన్ టన్నులకు పెరగనుంది. ఈ విస్తరణతో 354 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించగా, మొత్తం ప్రత్యక్ష ఉద్యోగాల సంఖ్య 954కు చేరుకోనుంది. ఈ ప్రాజెక్టుకు ఇటీవలే కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నుంచి పర్యావరణ అనుమతి, అలాగే ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి స్థాపన అనుమతి (సీటీఈ) లభించడంతో నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది. కాగా దాల్మియా సిమెంట్స్ విస్తరణతో కడప జిల్లాలో పారిశ్రామిక వాతావరణం మరింత బలోపేతం కానుంది. ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు రవాణా, నిర్మాణం, గనుల తవ్వకం, యంత్రాల నిర్వహణ, సేవారంగం, చిన్నతరహా పరిశ్రమల్లో వేలాది మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. స్థానిక యువతకు ఉపాధి, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతం, కొత్త పెట్టుబడులకు ప్రోత్సాహం లభించే ఈ ప్రాజెక్టు కడప పారిశ్రామికాభివృద్ధిలో మరో కీలక అధ్యాయంగా నిలవనుందని పారిశ్రామిక వర్గాలు, ఉద్యోగార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థులు సైన్స్‌పై పరిశోధనా దృక్పథం పెంపొందించుకోవాలి

**– జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**





కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జులై 14: విద్యార్థులు సైన్స్‌పై అవగాహనతో పాటు పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.

### గ్రామ అభివృద్ధి కార్యక్రమాల పరిశీలనలో భాగంగా

మంగళవారం రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో పర్యటించిన కలెక్టర్, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు.

**- ఇందిరమ్మ ఇండ్లు :** గ్రామానికి మంజూరైన 25 ఇందిరమ్మ ఇండ్లలో 10 ఇళ్ల నిర్మాణం పూర్తై లబ్ధిదారులు గృహప్రవేశం చేశారు. మిగిలిన 15 ఇళ్లు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయని అధికారులు వివరించారు. నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**- సర్ ప్రక్రియ:** సుమారు 80% పని పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తి చేస్తామని మండల తహసీల్దార్ ఉమామలత తెలిపారు.

### పాఠశాల తనిఖీ - శాస్త్రీయ దృక్పథం ప్రోత్సాహం

గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన బోధనపై ఉపాధ్యాయులను అభినందించారు.

**- అటల్ టింకరింగ్ ల్యాబ్:** పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు.

**- పక్షుల పరిశీలన:** పాఠశాల పరిసరాలకు వచ్చే పక్షుల రాకపోకలు, వాటి ప్రవర్తన, గురించి సంఖ్య, జీవన విధానంపై విద్యార్థులు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో 20 రోజులపాటు పరిశీలన నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.

– ఇలాంటి పరిశోధనాత్మక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, పరిశీలనా నైపుణ్యం పెంపొందుతుందని కలెక్టర్ అన్నారు.

జిల్లాలోని 41 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్న పాఠశాలలన్నీ ఈ కార్యక్రమాన్ని ఒక సవాల్‌గా స్వీకరించి అమలు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, పీడీ హౌసింగ్ విజయ్‌పాల్ రెడ్డి, మండల తహసీల్దార్ ఉమామలత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సర్ గడువును పొడిగించాలని ఎన్నికల అధికారికి విజ్ఞప్తి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్.



జనగామ (భారత శక్తి)జులై 14: తెలంగాణ రాష్ట్రంలో సర్ గడువును పొడిగించాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ని కలిశారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలను ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లి, అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గడువును పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు గణేష్, నవీన్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్, మోత రోహిత్, టీపీసీసీ ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రాజేష్,ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# అమావాస్య భోజనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించిన ఆర్యవైశ్య సంఘం.



జనగామ(భారత శక్తి)జులై 14: అమావాస్య సందర్భంగా దేవరుప్పుల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం అమావాస్య భోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 250 మందికి అన్నప్రసాదాన్ని వడ్డించి సంఘం సేవాభావాన్ని చాటుకుంది.ప్రతి అమావాస్య రోజున నిర్వహించే ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని భోజనాలు చేశారు. సమాజంలో సేవా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యతను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిరంతరం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఇరుకుల శ్రీను, సెక్రటరీ యామ సంతోష్, కార్యదర్శి వనమాల శ్రీను, బుక్క రామయ్య,బెల్దే నర్సయ్య ,శ్రీరంగం నర్సయ్య, సందీప్, బుక్క శ్రీధర్, వనమాల సురేష్, గజ్జి సోమయ్య తదితరులు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.అమావాస్య సందర్భంగా నిర్వహించిన ఈ అన్నప్రసాద కార్యక్రమాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. ఆర్యవైశ్య సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు ప్రశంసించారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎస్ఐఆర్ పై ప్రత్యేక సమీక్ష

**- మండల అధ్యక్షుడు పిరినాకి నవీన్**



మణుగూరు, జూలై 14 (భారతశక్తి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై సర్పంచులతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పిరినాకి నవీన్ సమీక్ష నిర్వహించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, సర్ ప్రక్రియ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసి ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని ఓటరుగా నమోదు చేయడం, ఓటరు జాబితాలోని పేరు, వయస్సు, చిరునామా, ఫోటో తదితర వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించడం, డూప్లికేట్, ఇతర ప్రాంతాలకు మారిన, మరణించిన ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం సవరించడం మండలంలోని సర్పంచ్లు ఉప సర్పంచులు బిఎల్ఓలకు, బిఎల్ఏ ఇన్చార్జిలు సూపర్వైజర్లతో సమన్వయం చేసుకుంటూ సర్ ప్రక్రియను బాధ్యతగా పరిశీలించాలని తెలియచేశారు. అదేవిధంగా ప్రతి పంచాయతీలో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేసే ఆలోచన చేసే వంటి అంశాలపై సర్పంచులు, ఉప సర్పంచులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో పార్టీ అభివృద్ధి, సంస్థాగత బలోపేతం, కాంగ్రెస్ పార్టీ సూచనలు అమలు, బూత్ స్థాయిలో కమిటీ సమన్వయం, పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సర్పంచులు, ఉప సర్పంచులు ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయిలో విజయవంతం చేయాలని, అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ లు శ్వేతా, కలబోయినా మాధవరావు, మడకం కృష్ణ, పూనెం రమేష్, శెట్టిపల్లి మాధవి, పాల్వంచ రాములు, జగిడి ప్రసాద్, కారం పూజ ఉపసర్పంచ్ లు కోటం మనోజ్ కుమార్, గోరంట్ల కనకయ్య, కొమరం మహేష్, కొమరం మధుకిరణ్, కుంజ శ్రీను, శెట్టిపల్లి గోపాల్ నాయకులు ఎస్సి సెల్ మండల అధ్యక్షులు బర్ల శ్వేతన్, ఎనిక బాలకృష్ణ, సిరపు గణేష్ రెడ్డి, బల్లెం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ చేసిన లయన్స్ చంద్రమోహన్




మణుగూరు, జూలై 14 (భారతశక్తి): లయన్స్ కె చంద్రమోహన్ పుట్టినరోజు సందర్భంగా మండల పరిధిలోని సి టైపు ఎదురుగా ఉన్న బాలవెలుగు విద్యాలయం విద్యార్థులకు అవసరమైన వస్తువులు, నిత్యావసర సరుకులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దొబ్బల వెంకటప్పయ్య, సెక్రటరీ కత్తి రాము, శెట్టి నాగేశ్వరరావు, ఆదిత్యన్, అడబాల నాగేశ్వరరావు, బాలవెలుగు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేసుల దర్యాప్తు వేగవంతం చేసి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలి

**- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.**



రాజన్న సిరిసిల్ల, జూలై 14(భారత శక్తి ): ప్రతి కేసులో దర్యాప్తును వేగవంతం చేసి, శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన విచారణ చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా ప్రతి అధికారి కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సిరిసిల్ల సబ్‌డివిజన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలు, శాంతిభద్రతల నిర్వహణ, పోలీసు సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో శాస్త్రీయ,సాంకేతిక ఆధారాలు,ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ ఎవిడెన్స్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. నాణ్యమైన దర్యాప్తు ద్వారానే కోర్టుల్లో నిందితులకు శిక్షలు పడతాయని,బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందని తెలిపారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి, చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. పెట్రోలింగ్ సమయంలో అనుమానితులు, పాత నేరస్తులు, రౌడీషీటర్లను మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ ద్వారా తప్పనిసరిగా తనిఖీ చేసి నేరాల నియంత్రణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను వినియోగిస్తూ నేరాలను వేగంగా ఛేదించి బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు అయిన గంజాయి,గుడుంబా, పేకాట,పిడిఎస్ రైస్,అక్రమ ఇసుక రవాణా వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి దాడులు నిర్వహించి వాటికి అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, మొగిలి, మధుకర్, ఆర్ఐ సురేష్, ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టాలి.

**-మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు**



మణుగూరు, జూలై 14 (భారతశక్తి): వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టి భూగర్భజలాలను పెంపొందించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ ఏరియాలో ఉన్న ప్రజానీకం ఇంటి పై కప్ ద్వారా వెళ్లే వర్షపు నీరు వృధాగా వెళ్లకుండా పైపులైన్ల అమర్చి (రూఫ్ టాప్స్) ద్వారా నీటిని భూమిలోకి ఇంకే విధంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల్లో బోర్లు తవ్వి నీటిని తోడేస్తున్నారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటాయన్నారు. నీటి వనరుల పెంపు కోసం ఇళ్లల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. వర్షపు నీరు వృధాను అరికట్టి భూగర్భజలాలను పెంపొందించేందుకు నీటి కుంటలు పారంపాండ్ లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. నీటి ఎద్దడిని ఎదుర్కొని భూగర్భజలాలను పెంపొందించేందుకు ఇది సరైన మార్గమని తెలియజేశారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండండి. ప్రాణాంతక వ్యాధులకు గురికాకండి

**- డ్రగ్స్ నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత**

**- మెదక్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి**




నర్సాపూర్, జూలై 14, భారత శక్తి న్యూస్): మాదకద్రవ్యాల అలవాటు మెదడు సంకేత వ్యవస్థను నిర్వీర్యం చేసి, విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతుందని మెదక్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి హెచ్చరించారు. నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో మంగళవారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో "డ్రగ్స్ నియంత్రణ అవగాహన సదస్సు" నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న మెదక్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సతీష్ కుమార్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గులాం ముస్తఫా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. యువత "డ్రగ్స్‌కు నో " చెప్పాలని పిలుపునిస్తూ, మాదకద్రవ్యాల వల్ల మెదడులో డోపమైన్ వ్యవస్థపై తీవ్ర ప్రభావం ఏర్పడి, ఆలోచనా శక్తి, జ్ఞాపకశక్తి, నిర్ణయ సామర్థ్యం దెబ్బతింటాయని వివరించారు. డ్రగ్స్ అలవాటు విద్యార్థుల విద్యాభ్యాసం, ఆరోగ్యం, కెరీర్‌తో పాటు కుటుంబ జీవితాన్నీ తీవ్రంగా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. తాత్కాలిక ఆనందం కోసం మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితాంతం నష్టపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎస్ఐ సుచరిత మాట్లాడుతూ, యువత చెడు స్నేహాలు, తోటివారి ఒత్తిళ్లకు లొంగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగంపై ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసు లేదా ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐ రాఘవేంద్రరావు, ఎస్ఐ అజీజ్ ఖాన్, ఎస్ఐ అరుణ, డీటీఎఫ్ సీఐ గోపాల్, డీటీఎఫ్ ఎస్ఐ బాలయ్య తదితర అధికారులు పాల్గొన్నారు. బీవీఆర్ఐటీ డైరెక్టర్ డాక్టర్ కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్ దూబే విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.

# డబ్బుల వివాదంతో యువకుడి హత్య..

## మూడు రోజుల్లోనే కేసు ఛేదించిన భైంసా పోలీసులు




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూలై 13 (భారత శక్తి)భైంసా పట్టణంలో సంచలనం సృష్టించిన యువకుడి హత్య కేసును పోలీసులు స్వల్ప వ్యవధిలోనే ఛేదించారు. డబ్బుల వివాదం కారణంగా స్నేహితుడే యువకుడిని హత్య చేసి, అనంతరం మృతదేహాన్ని మురికి కాలువలో పడవేసినట్లు దర్యాప్తులో తేలిందని ఏఎస్పీ, భైంసా మరియు భైంసా టౌన్ ఇన్‌స్పెక్టర్ మీడియా సమావేశంలో వెల్లడించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, భైంసా పట్టణంలోని న్యూ ఆబాదికి చెందిన నసీర్ అహ్మద్ (27) ఈ నెల 11న కనిపించకుండా పోయాడు. అదే రోజు మధ్యాహ్నం ఆటోనగర్ చోటా బ్రిడ్జి సమీపంలోని మురికి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి భైంసా ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతదేహం ఫోటోలను ప్రచారం చేయగా, మృతుడు తన కుమారుడు నసీర్ అహ్మద్ అని తండ్రి మక్బూల్ అహ్మద్ గుర్తించారు. మృతుడి శరీరంపై గాయాలు ఉండటంతో తన కుమారుడి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయగా, పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా మృతుడి బంధువులు, స్నేహితులను విచారించడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలు, సెల్‌ఫోన్ కాల్ డేటా రికార్డులు (సీడీఆర్), ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలించారు. ఈ క్రమంలో మృతుడు చివరిసారిగా తన స్నేహితుడు మొహమ్మద్ సఫ్రాన్ అహ్మద్‌తో కలిసి ఉన్నట్లు గుర్తించారు.పోలీసుల దర్యాప్తులో, గతంలో జరిగిన డబ్బుల వివాదం నేపథ్యంలో గ్యారేజీలో ఇద్దరి మధ్య గొడవ జరగగా, నిందితుడు మొహమ్మద్ సఫ్రాన్ అహ్మద్ సుత్తులతో నసీర్ అహ్మద్ తలపై పలుమార్లు దాడి చేసి హత్య చేసినట్లు వెల్లడైంది. అనంతరం నేరాన్ని దాచిపెట్టేందుకు మృతదేహాన్ని ఐరన్/సీఓ2 మెషిన్ బాక్స్‌లో ఉంచి, మృతుడి మోటార్‌సైకిల్‌పై తీసుకెళ్లి ఆటోనగర్ చోటా బ్రిడ్జి సమీపంలోని మురికి కాలువలో పడవేసినట్లు పోలీసులు తెలిపారు.

ఈ నెల 13న నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, శాస్త్రీయ ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలు, సాక్షుల వాంగ్మూలాలు, డిజిటల్ ఆధారాల ఆధారంగా నేరంలో అతని ప్రమేయం నిర్ధారణ కావడంతో అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

నిందితుడి వద్ద నుంచి మృతుడి మోటార్‌సైకిల్, మొబైల్ ఫోన్, హత్యకు ఉపయోగించిన రెండు సుత్తులు, మృతదేహాన్ని తరలించేందుకు ఉపయోగించిన ఐరన్/సీఓ2 మెషిన్ బాక్స్‌తో పాటు కేసుకు సంబంధించిన ఇతర భౌతిక, శాస్త్రీయ ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నేరస్థలంలోని ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను పరిశీలించడం, సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా విశ్లేషించడం, సాంకేతిక ఆధారాలను సేకరించడం ద్వారా కేసును అత్యంత వేగంగా ఛేదించగలిగామని ఏఎస్పీ తెలిపారు. కేసుకు సంబంధించిన తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

# నైకా బ్యూటీ బార్ చెన్నైకి విచ్చేసింది

**- దిహీరో ఉత్పత్తులను ప్రయత్నించడం,**

**- నిపుణుల చిట్కాలు నేర్చుకోవడం నుండి కొత్త ఇష్టమైన వాటిని కనుగొనడం వరకు,**

**- నైకా బ్యూటీ బార్ కేవలం షెల్ఫ్‌కే పరిమితం కాని సౌందర్యాన్ని ఆవిష్కరించిందిది**




చెన్నై, జూలై 14(భారత శక్తి ప్రతినిధి ): కొత్తగా విడుదలైన ఉత్పత్తులను కనుగొనడం, సౌందర్య చిట్కాలను నేర్చుకోవడం, ఉత్పత్తులను స్వచ్ చేయడం మరియు దాదాపు 200 మంది సౌందర్య ప్రియులు ఒకేచోట కలవడం – ఇవన్నీ నైకా బ్యూటీ బార్ చెన్నైలోని ఫీనిక్స్ మార్కెట్‌సిటీకి తీసుకువచ్చింది. వినియోగదారులు, సృష్టికర్తలు మరియు ప్రముఖ బ్యూటీ బ్రాండ్‌లను ఒకచోట చేర్చిన ఈ కార్యక్రమం, హాజరైన వారికి కొత్త ఇష్టమైన వాటిని కనుగొనడానికి, నిపుణుల నుండి నేర్చుకోవడానికి మరియు సౌందర్యాన్ని సరదాగా, ఆసక్తికరంగా అనుభవించడానికి అవకాశాన్ని కల్పించింది.ఈ కార్యక్రమానికి ప్రధాన ఆకర్షణ మేకప్ ఆర్టిస్ట్ ఒలివియా అనుగ్రహ నిర్వహించిన మాస్టర్‌క్లాస్. ఆమె నైకా కాస్మెటిక్స్, ఉత్పత్తుల యొక్క ప్రత్యేక మిశ్రమాన్ని ఉపయోగించి, ఎంతో ఇష్టపడే సాఫ్ట్ గ్లామ్ లుక్‌ను పునఃసృష్టించారు. కాస్మెటిక్స్, కే బ్యూటీ, ఇండే వైల్డ్, మిరాబెల్ కొరియా, నైకా వాండర్‌లస్ట్, నైకా మోయ్ మరియు ఎక్లిప్స్ సోలేర్. ఈ సెషన్‌ను మరింత ఉత్తేజపరిచేందుకు, అదృష్టవంతులైన ఇద్దరు హాజరైనవారిని వేదికపైకి ఆహ్వానించారు. అక్కడ ఒలివియా సులభమైన అప్లికేషన్ పద్ధతులను ప్రదర్శించి, వ్యక్తిగత సౌందర్య చిట్కాలను పంచుకుని, వారి ప్రశ్నలకు ప్రత్యక్షంగా సమాధానమిచ్చారు. తద్వారా ప్రతిఒక్కరూ ఇంట్లోనే ప్రయత్నించగల ఆచరణాత్మక చిట్కాలను అందించారు.హాజరైనవారు హీరో ఉత్పత్తులను ప్రయత్నించడం, వ్యక్తిగత సౌందర్య సలహాలను పొందడం మరియు వారి దినచర్యలలో చేర్చుకోవడానికి కొత్త ఇష్టమైన వాటిని కనుగొనడంతో మాస్టర్‌క్లాస్ తర్వాత కూడా ఉత్సాహం కొనసాగింది. వినోదం అక్కడితో ఆగలేదు, వారు కాంప్లిమెంటరీ గూడీ బ్యాగ్‌లు మరియు ప్రత్యేకమైన షాపింగ్ కూపన్‌లను కూడా ఇంటికి తీసుకువెళ్లారు.

దీనితో ఒలివియా సిఫార్సు చేసిన ఉత్పత్తులతో ఆ లుక్‌ను సులభంగా తిరిగి సృష్టించుకోవచ్చు. మాస్టర్‌క్లాస్ ముగిసినప్పటికీ, బ్యూటీ బార్ అనుభవం వారాంతం మొత్తం కొనసాగింది. కొనుగోలుదారులు ఫీచర్ చేయబడిన బ్రాండ్‌లను కనుగొనడం, కొత్త లాంచ్‌లను అన్వేషించడం మరియు ప్రత్యేకమైన ఆఫర్‌లలో షాపింగ్ చేయడం వంటివి చేశారు.నైకాల్యాండ్ నుండి బెస్ట్ ఇన్ బ్యూటీ అవార్డ్స్ మరియు బ్యూటీ బార్ వరకు, నైకా షాపింగ్‌కు అతీతమైన అనుభవాలను సృష్టిస్తూనే ఉంది. సౌందర్య ప్రియులు, నిపుణులు మరియు బ్రాండ్‌లను ఒకే చోటకి తీసుకువస్తోంది. ప్రతి ఎడిషన్‌తో, బ్యూటీ బార్ వినియోగదారులకు ఉత్పత్తులను కనుగొనడానికి, నిపుణుల నుండి నేర్చుకోవడానికి మరియు అందాన్ని కలిసి అనుభవించడానికి కొత్త మార్గాలను అందిస్తుంది.

నైకా బ్యూటీ బార్ ప్రయాణాన్ని Instagram @mynykaa లో అనుసరించండి.

# ఓటరు జాబితా సవరణను ప్రజల భాగస్వామ్యం తో పూర్తి చేయాలి

**- ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు**




ములుగు జిల్లా ప్రతినిధి, జులై 14 (భారత శక్తి) : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ను ప్రజల భాగస్వామ్యం తో ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ నిర్ణిత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని 2 లక్షల 36 వేల 9 వందల 70 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1లక్ష 46 వేల 5 వందల 83 ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటలైజ్ 61.86 శాతం పురోగతి నమోదైందని పేర్కొన్నారు. ఇంకా 82 వేల 9 వందల 94 ఫారాలు 38.14 శాతం డిజిటలైజేషన్ చేయాల్సి ఉందని తెలిపారు. నిర్ణీత గడువులోపు వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎన్నికల అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలన్నారు.ప్రతి ఇంటిని బీఎల్ఓలు తప్పనిసరిగా సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, పూర్తిగా నింపిన ఫారాలను తిరిగి సేకరించాలని సూచించారు. ఇంటికి తాళం వేసి ఉంటే మరోసారి వెళ్లి ఫారాలు సేకరించేలా చూడాలని, సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను రోజువారీగా బీఎల్ఓ యాప్‌లో డిజిటలైజ్ చేసి, పెండింగ్ లేకుండా ఎన్నికల సిబ్బంది నమోదు చేయాలన్నారు.బీఎల్ఓలు ప్రజలతో మర్యాదతో, స్నేహపూర్వకంగా మమేకమై వారి సందేహాలను నివృత్తి చేయాలని, అర్హులైన ప్రతి ఓటరికి అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు. బీఎల్ఏలు కూడా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా పనిచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు కూడా ఎన్నికల సిబ్బందికి పూర్తి సహకారం అందించి, తమ వివరాలను సరిచూసుకుని ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి, అవసరమైన పత్రాలతో నిర్ణీత గడువులోపు సంబంధిత బీఎల్ఓలకు అందించాలని దకలెక్టర్ కోరారు. తప్పుడు సమాచారం ఇవ్వకుండా, ఓటరు జాబితా ఖచ్చితత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు నమోదై ఉన్న ఏ ఓటరినీ ముందస్తు నోటీసు ఇవ్వకుండా తొలగించే అవకాశం లేదని,అందువల్ల ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా, ప్రతి ఓటరు తప్పనిసరిగా తన ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి, నిర్ణీత గడువులోపు సంబంధిత బీఎల్ఓకు సమర్పించాలని కోరారు. ప్రతి ఓటరు స్వచ్ఛందంగా ఈ ప్రక్రియలో భాగస్వామి కావడం ద్వారా ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందించేందుకు సహకరించాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోరారు.

# జగన్మోహన్ రావు కు శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్



ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)జూలై14: వరంగల్ క్లబ్ (ఆఫీసర్స్ క్లబ్) కార్యవర్గ సభ్యులుగా కో ఆప్షన్ ద్వారా నియమితులైన ఎన్నమనేని జగన్ మోహన్ రావు ని ఆదివారం రోజు సర్వసభ్య సమావేశంలో నూతనంగా ఎన్నికైన కమిటీ నియమించడం జరిగింది. ఈ సందర్భంగా వారు క్లబ్ చైర్మన్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయ్ ఐఏఎస్ ని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలియజేస్తూ క్లబ్ కార్యకలాపాలను పారదర్శకంగా నిర్వహించుటకు ఉద్యోగుల పక్షాన నియమితులైన మీరు పూర్తి బాధ్యత తీసుకోవాలని కోరడం జరిగింది. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ రవి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందించారు. వారు అభినందనలు తెలియజేసి, రాబోయే రెండు సంవత్సరాలు ఎలాంటి అవకతవకలు తలెత్తకుండా ఉద్యోగుల పక్షాన ఉన్న మీరు చూసుకోవాలని తెలిపారు.

# అభివృద్ధిని పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్




ములుగు జిల్లా ప్రతినిధి, జులై 14 (భారత శక్తి): జిల్లా కేంద్రంలోని గట్టమ్మ వద్ద జిల్లాలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, జిల్లా ప్రగతిని ఒకేచోట ప్రతిబింబించేలా ఏర్పాటు చేస్తున్న పైలాన్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బోర్థడే హేమంత్ సహదేవరావు క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పైలాన్‌ను ప్రారంభించే అవకాశం ఉన్న నేపథ్యంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల అమలులో ఎలాంటి రాజీ లేకుండా నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.అనంతరం నూతన సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయం ఆవరణలో చేపడుతున్న ల్యాండ్‌స్కేపింగ్ పనులను పరిశీలించారు. పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటాలని, పైలాన్ అభివృద్ధి, అలంకరణ మొక్కల ఏర్పాటు, నడక మార్గాల నిర్మాణం, సుందరీకరణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి ఆవరణను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, హార్టికల్చర్ అధికారి సంజీవరావు, మున్సిపల్ కమిషనర్ సంపత్, గుత్తేదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ట్యాలీ ఆధారిత అకౌంటింగ్ నైపుణ్యాలను

# విద్యార్థులు నేర్చుకోవాలి

- ఉపకులపతి ఆచార్య ఉమేశ్ కుమార్
- శాతవాహనలో మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి కార్యశాల ప్రారంభం




**కరీంనగర్(భారత శక్తి)** శాతవాహన విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్ర విభాగఆధ్వర్యంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల కోసం చేపట్టిన "అకాడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్ ? 100 రోజుల కార్యాచరణ" లో భాగంగా "కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ యూజింగ్ ట్యాలీ ఈఆర్పి 9 ? ఏ స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్" అనే మూడు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ కార్యశాల జూలై 14 నుంచి 16 వరకు నిర్వహించబడుతోంది. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ట్యాలీ ఇఖీఖ 9లో కంపెనీ క్రియేషన్, లెడ్జర్ నిర్వహణ, వౌచర్ ఎంట్రీ, జీఎస్టీ అకౌంటింగ్, ఇన్వెంటరీ, పేరోల్, బ్యాంకింగ్, ఆర్థిక నివేదికలు మరియు డేటా భద్రతపై శిక్షణ ఇవ్వనున్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు. ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, ఆధునిక వ్యాపార రంగంలో అకౌంటింగ్ విధానాలు వేగంగా మారుతున్నాయని, విద్యార్థులు సంప్రదాయ పరిజ్ఞానంతో పాటు ట్యాలీ వంటి నూతన అకౌంటింగ్ సాంకేతికతలను తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అభివృద్ధి చేసుకున్నప్పుడే విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను సమర్థవంతంగా అందిపుచ్చుకోగలరని అన్నారు.విశిష్ట అతిథిగా పాల్గొన్న విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్ మాట్లాడుతూ, ట్యాలీ సాఫ్ట్‌వేర్‌ను త్వరలోనే విశ్వవిద్యాలయ అకౌంట్స్ విభాగంలో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని వాణిజ్య శాస్త్ర అంశాలతో రూపొందించిన ఈ కోర్సు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని, వారి ఉపాధి నైపుణ్యాలను పెంపొందిస్తుందని అన్నారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్, ఐక్యూఏసీ డైరెక్టర్, అకాడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వి. శ్రీరంగ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు, ప్రాయోజిక నైపుణ్యాలు, ఉద్యోగ సామర్థ్యాలను పెంపొందించడమే అకాడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్ ప్రధాన ఉద్దేశమని వివరించారు.?

ఇటువంటి కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమ కన్వీనర్, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి,బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ డి. హరికాంత్ మాట్లాడుతూ, వాణిజ్యశాస్త్ర విద్యార్థులకు అవసరమైన సాంకేతిక, ఉపాధి ఆధారిత నైపుణ్యాలను అందించేందుకు త్వరలో మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల వాణిజ్యశాస్త్ర విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చే విధంగా కామర్స్ స్టూడెంట్స్ మీట్ నిర్వహించేందుకు కూడా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్లు డా. కె. తిరుపతి, డా. బి. నరేష్, డా.బి. పరశురాములు, అధ్యాపకులు డా. ఎం. మనోజ్ కుమార్, డా. టి. కృష్ణకుమార్, శ్రీమతి సావిత్రి, అనిల్, వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇవాళ్టి నుంచి దుర్గమ్మకు ఆషాఢ సారె

**విజయవాడ,(భారత శక్తి)** ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో ఆషాఢ మాస మహోత్సవాలు ఆగష్టు 12 వరకు వైభవంగా జరగనున్నాయి. ఆషాఢ మహోత్సవాల ప్రారంభం సందర్భంగా ఉదయం 07:30 గంటల నుంచి 07:45 గంటల మధ్య ఘాట్ రోడ్ వద్ద ఆలయ అర్చకులు వేద పండితులు అమ్మవారికి పట్టుచీరను సమర్పించే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం ఉత్సవాల పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా ప్రారంభమవుతాయి. ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం..కనకదుర్గ అమ్మవారు ఆంధ్రప్రదేశ్ లో విజయవాడ నగరానికి ఆధ్యాత్మిక కేంద్రం. కృష్ణా నది తీరాన ఉన్న ఈ పుణ్యక్షేత్రం గురించి కాలికా పురాణం, దుర్గా సప్తశతి వంటి గ్రంథాల్లో ఉంది. అమ్మవారు ఇక్కడ స్వయంభువుగా వెలసినట్టు స్థలపురాణం. ఇక్కడ దుర్గాదేవి మహిషాసుర మర్దిని రూపంలో ఎనిమిది భుజాలతో, ఆయుధాలు ధరించి భక్తులకు దర్శనమిస్తుంది. శక్తి, సంపద, కరుణను భక్తులకు ప్రసాదించే అమ్మగా పూజలందుకుంటోంది దుర్గమ్మ. ఏటా ఆషాఢ మహోత్సవాల్లో భాగంగా శాకాంబరి ఉత్సవాలు అత్యంత పవిత్రంగా జరుగుతాయి. ఈ సమయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, శాస్త్రోక్త విధానాలు, వేదపండితుల సమక్షంలో హోమాలు,అభిషేకాలు జరుగుతాయి. అమ్మవారికి పట్టుచీర సమర్పించే కార్యక్రమంతో వేడుక మొదలవుతుంది. ఈ ఉత్సవాలు భక్తి, వైభవం, సంగీతం, నృత్యాలతో నిండి ఉంటుంది. లక్షలాది భక్తులు దర్శనం చేసుకుని అమ్మవారి అనుగ్రహం పొందుతారు.ఇంద్రకీలుడు తపస్సు చేసిన ప్రదేశం కావడంతో ఇంద్రకీలాద్రి అయింది. దుర్గా దేవి మహిషాసురుడిని సంహరించి ఈ ప్రాంతాన్ని రక్షించినట్టు పురాణాలు చెబుతున్నాయ్. ఏటా శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతాయి. ఆషాఢ మాస ఉత్సవాలకు కూడా అంతే ప్రాధాన్యత ఉంటుంది. ప్రత్యేక సేవలు, మొక్కులు చెల్లించుకోవడం ద్వారా భక్తులు శు భాలు పొందుతారు.ఆషాఢ మహోత్సవాలు నిర్వహణ ప్రాచీన సంప్రదాయం. ఈ ఉత్సవాలు దుర్గా దేవి శక్తి, సంపద, రక్షణ స్వరూపాన్ని ఆరాధించేందుకు నిర్వహిస్తారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని శాకాంభరి రూపంలో ప్రత్యక్షమై సమస్త మానవాళికి ఆహార లోటు రాకుండా కాపాడుతుందని విశ్వాసం. చోళుల కాలంనాటి శాసనాల్లోనూ ఆషాఢ మాసోత్సవాల గురించి ఉంది. అంటే ఈ సంప్రదాయం శతాబ్దాలుగా కొనసాగుతోంది. పట్టుచీర సమర్పించడం ద్వారా ఉత్సవాలు ప్రారంభమవుతాయి. నెల రోజుల పాటూ శాస్త్రోక్తంగా పూజలు , హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఈ సమయంలో అమ్మవారికి వివిధ రకాల ఆహారాలు, పూలు, ఆభరణాలు సమర్పిస్తారు. పకృతి సమృద్ధిగా ఉండే ఈ నెలలో లక్షలాది భక్తులు ఉత్సవాల్లో పాల్గొని దుర్గమ్మ కృపకు పాత్రులవుతారు.

# అడ్డంగా దొరికిన ఏఈ సతీష్

**హైదరాబాద్,(భారత శక్తి)** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు జరిపిన మెరుపు దాడిలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ సతీష్ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. రూ.2 లక్షల లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు.

పెద్దపల్లి పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ఎంబీ రికార్డు నమోదు చేసి, బిల్లులు క్లియర్ చేయడానికి ఏఈ సతీష్ ఆ కాంట్రాక్టర్‌ను భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.అధికారి లంచం అడగడంతో బాధిత కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలోని బృందం పక్కా ప్రణాళికతో వల పన్నింది. కాంట్రాక్టర్ నుంచి ఏఈ సతీష్ లంచం నగదు తీసుకుంటుండగా అధికారులు అప్రమత్తమై రెడ్ హ్యాండెడ్‌గా అతనిని పట్టుకున్నారు.

## డోర్ టు డోర్ ఎన్యూమరేషన్ గడువు మరో 10 రోజులు పొడిగింపు...

**తిరుపతి,** ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి వివరాల సేకరణ గడువును భారత ఎన్నికల సంఘం మరో 10 రోజులు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.?జిల్లాలో ఈ ప్రక్రియ దాదాపు పూర్తయిందని, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో మిగిలిన కొద్దిపాటి వివరాల సేకరణ కూడా నేటితో ముగుస్తుందని చెప్పారు. జిల్లాలో ఇంకా మ్యాపింగ్ కాని 2.02 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసి, ధ్రువీకరణ పత్రాల సమర్పణకు అవకాశం కల్పిస్తున్నారు. అలాగే బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు సంయుక్తంగా ధ్రువీకరించిన ఆచూకీ లేని, వలస వెళ్లిన, మరణించిన మరియు డూప్లికేట్ ఓటర్ల జాబితాను, ముసాయిదా ఓటరు జాబితాతో కలిపి జూలై 31న ప్రచురిస్తామని వెల్లడించారు. ఎవరి పేరైనా పొరపాటున ఈ జాబితాలో చేరితే, నివాస ఆధారాలతో అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని, పూర్తి విచారణ అనంతరం అధికారులు తుది నిర్ణయం తీసుకుంటారని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ అదనపు గడువును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# డ్రైవింగ్‌లో ప్రాణాలు పోతే..మర్డర్ కేసా...

**విశాఖపట్టణం,(భారత శక్తి)** "సిదిరి అప్పలరాజు కొడుకు 18 ఏళ్ల పిల్లోడు.. బైక్ నడుపుతూ , గుద్దితే ఓ వ్యక్తి చనిపోయాడు. దాంతో సిదిరి అప్పలరాజు కొడుకుపై మర్డర్ కేసు పెట్టారు. ఆ పిల్లోడికి ఏం తెలుసు? నిజంగా ఈ ప్రభుత్వానికి మానవత్వం ఉందా?" ఇవి విశాఖలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు. అప్పలరాజు కుమారుడు బైక్ నడుపుతూ ఓ ప్రమాదం చేశారు. వేగంగా ఢీకొట్టడంతో గొర్లె కాపర చనిపోయాడు. ఈ ప్రమాదం నుంచి అప్పలరాజు కుమారుడ్ని తప్పించి వేరే యువకుడ్ని నిందితుడిగా చేర్చారు. అయితే సీసీ కెమెరాల్లో అన్నీ దొరికిపోవడంతో చివరికి అప్పలరాజు కుమారుడు సరెండర్ అయ్యారు. చట్టం ప్రకారం పోలీసులు కేసు పెట్టారు. అయితే అప్పలరాజు కుమారుడిపై కేసు పెట్టడం తప్పన్నట్లుగా మాజీ సీఎం మాట్లాడటం సంచలనంగా మారింది. ఇటీవల విశాఖపట్నం సముద్ర తీరంలో జరిగిన విషాదకర బోటు ప్రమాదంలో గల్లంతైన, ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించేందుకు జగన్ విశాఖ వెళ్లారు. నగరంలోని జబ్బర్‌తోటకు వెళ్లిన ఆయన బాధిత కుటుంబాలను కలిసి ఓదార్చారు. మూడేళ్లు కళ్లు మూసుకుంటే మన ప్రభుత్వం వస్తుందని అప్పుడు తలా కోటి రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారు. విశాఖ తీరానికి కేవలం 10 మైళ్ల దూరంలోనే రాకాసి అలల తాకిడికి వారి బోటు మునిగిపోయింది. ప్రమాదానికి ముందే తాము క్షేమంగా వస్తున్నామని మత్స్యకారుడు చిన్నా తన కుటుంబ సభ్యులకు ఫోన్ కూడా చేశాడు. అయితే బోటు మునిగిపోయిన వెంటనే ఒకరు బోటు కింద పడి మరణించగా, మిగిలిన ఆరుగురు ప్రాణాలు కాపాడుకోవడానికి ఈత కొడుతూ సముద్రంలో పోరాటం చేశారు. వేటకు వెళ్లిన వారు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు కోస్ట్ గార్డ్ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు కనీసం స్పందించలేదు. ఒకవేళ అధికారులు సకాలంలో స్పందించి, కోస్ట్ గార్డ్ రంగంలోకి దిగి ఉంటే కనీసం ఆ ఐదుగురు మత్స్యకారులైనా ఈ రోజు బతికేవారు. చివరికి వైజా బోటు సాయంతో కేవలం చిన్నా ఒక్కడే సురక్షితంగా ఒడ్డుకు చేరాడు. ఇంత దారుణం జరుగుతుంటే ఈ ప్రభుత్వానికి కనీసం మానవత్వం ఉందా అని వైఎస్ జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విశాఖ నగరంలో ఉన్న వ్యవస్థల పనితీరును ప్రస్తావిస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని నిలదీశారు. "విశాఖపట్నం ఇక్కడే ఉంది అంటే దానికి అర్థం ఏంటి? విశాఖలో ఇండియన్ నేవీ హెడ్‌క్వార్టర్స్ ఉంది, కోస్ట్ గార్డు సిబ్బంది ఉన్నారు, రెస్క్యూ కోసం సిద్ధంగా ఉండే హెలికాప్టర్లు ఉన్నాయి. అలాగే ఇక్కడే కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు ఉన్నారు. ఇన్ని వ్యవస్థలు, అత్యాధునిక సాంకేతిక పరికరాలు, రెస్క్యూ విమానాలు అందుబాటులో పెట్టుకుని కూడా కేవలం 10 మైళ్ల దూరంలో సముద్రంలో కొట్టుమిట్టాడుతున్న మన మత్స్యకారులను ఎందుకు కాపాడలేకపోయారు? కేవలం పాలకుల అలసత్వం, సమన్వయ లోపం వల్లే ఆరు ప్రాణాలు సముద్రంలో కలిసిపోయాయి" అని విమర్శించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రాజకీయ కక్షసాధింపు చర్యలపైనా వైఎస్ జగన్ మండిపడ్డారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు కుమారుడి ఉదంతాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. "సిదిరి అప్పలరాజు కొడుకు కేవలం 18 ఏళ్ల పిల్లోడు. అనుకోకుండా రోడ్డుపై బైక్ నడుపుతూ ఒకరిని ఢీకొట్టడంతో ఆ వ్యక్తి చనిపోయాడు. అది యాక్సిడెంట్ మాత్రమే. కానీ ఈ ప్రభుత్వం కక్షగట్టి ఆ 18 ఏళ్ల పిల్లోడిపై సెక్షన్ 302 కింద ఏకంగా 'మర్డర్' (హత్య) కేసు నమోదు చేసింది. అసలు ఆ చిన్న పిల్లోడికి ఏం తెలుసని మర్డర్ కేసు పెడతారు? ఇలాంటి చర్యలను చూస్తుంటే అసలు ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా లేక కక్షసాధింపుల కార్ఖానా నడుస్తోందా అనిపిస్తోంది. మానవత్వాన్ని పూర్తిగా పక్కనబెట్టేశారు" అంటూ వైఎస్ జగన్ విమర్శించారు.బాధిత మత్స్యకార కుటుంబాలకు వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల ప్రాణం విలువ కూటమి ప్రభుత్వం ఇస్తున్న రూ. 10 లక్షల కంటే చాలా ఎక్కువని ఆయన స్పష్టం చేశారు. ఇంకా మూడేళ్లే సమయం ఉంది.. కళ్ళు మూసి తెరిచే లోపు ఈ మూడేళ్లు గడిచిపోతాయి. వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం. మేము అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే.. ఈ బోటు ప్రమాదంలో మరణించిన మత్స్యకార బాధిత కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందిస్తాం. ఇందుకు నాదే పూర్తి బాధ్యత అని వైఎస్ జగన్ బాధితులకు హామీ ఇచ్చారు. గల్లంతైన వారి కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు తమ పార్టీ తరఫున పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.

# మాల్స్ భద్రతా వ్యవస్థలో వైఫల్యాలు

**హైదరాబాద్,(భారత శక్తి)** కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ప్రముఖ లులు మాల్‌లో ఓ వ్యక్తి తుపాకీతో కనిపించడం తీవ్ర కలకలం రేపింది. మాల్ పార్కింగ్ ప్రదేశంలో రెండు కుటుంబాల మధ్య అకస్మాత్తుగా ఘర్షణ చోటుచేసుకుంది. ఈ గొడవపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఆ గొడవకు కారణమైన ఇరువర్గాల వారిని పోలీసులు విచారిస్తుండగా, పాతబస్తీకి చెందిన సిద్ధీఖీ అనే వ్యక్తి జేబులో గన్ ఉన్నట్లు గుర్తించి షాకయ్యారు.వెంటనే పోలీసులు ఆ తుపాకీని స్వాధీనం చేసుకుని తనిఖీ చేయగా, దానికి చట్టబద్ధమైన చెల్లుబాటయ్యే లైసెన్స్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. అయితే, లైసెన్స్ ఉన్నప్పటికీ అంత పెద్ద షాపింగ్ మాల్‌లోకి ఒక వ్యక్తి గన్‌తో ప్రవేశిస్తుంటే అక్కడి భద్రతా సిబ్బంది ఎందుకు గమనించలేదనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మాల్‌లోకి ప్రవేశించే సమయంలో సెక్యూరిటీ సిబ్బంది సరైన తనిఖీలు నిర్వహించడంలో విఫలమయ్యారని తేలింది. భద్రతలో ఘోర నిర్లక్ష్యం వహించినందుకు గానూ లులు మాల్ యాజమాన్యంపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.హైదరాబాద్‌లోని లులు మాల్‌లో జరిగిన భద్రతా లోపాన్ని స్పష్టం చేస్తుంది. ఇలాంటి సంఘటనలు షాపింగ్ మాల్స్‌లో ప్రజల రక్షణపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తాయి. ఈ ఘటన ఆధారంగా , సాధారణంగా షాపింగ్ మాల్స్‌లో కస్టమర్ల భద్రతకు సంబంధించి తలెత్తే ముఖ్యమైన ప్రశ్నలు ఇవే.మెటల్ డిటెక్టర్లు, స్క్రీనింగ్ నిర్లక్ష్యం: లైసెన్స్ ఉన్నా, లేకపోయినా మాల్స్ లోపలికి లేదా పార్కింగ్ ఏరియాలోకి ఒక వ్యక్తి ఆయుధాన్ని తీసుకురాగలిగాడంటే అక్కడ తనిఖీలు సక్రమంగా జరగడం లేదని అర్థమవుతుంది. చాలా సందర్భాలలో భద్రతా సిబ్బంది కేవలం మొక్కుబడిగా తనిఖీలు చేస్తుంటారు. అనుమానాస్పద వస్తువులను లేదా వ్యక్తులను గుర్తించే సరైన శిక్షణ వారికి లేకపోవడం లోపంగా మారుతోంది.

**లైసెన్స్ ఉంటే ఎక్కడికైనా తీసుకెళ్లవచ్చా?** లైసెన్స్ ఉన్న తుపాకీని ఆత్మరక్షణ కోసం కలిగి ఉండవచ్చు, కానీ విమానాశ్రయాలు, మాల్స్, సినిమా హాళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి అత్యంత రద్దీ ఉండే.. నిషేధిత బహిరంగ ప్రదేశాలలోకి వాటిని అనుమతించరు. ప్రైవేట్ యాజమాన్యాలు (మాల్స్) తమ ప్రాంగణంలోకి ఆయుధాల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించే హక్కును కలిగి ఉంటాయి. ఎవరైనా ఆయుధంతో వస్తే, వారిని లోపలికి అనుమతించకుండా వారిని ఆపి పోలీసులకు సమాచారం అందించాలి.భద్రతలో నిర్లక్ష్యం వహించినందుకు గానూ పోలీసులు సదరు మాల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటారు. ఇది మిగిలిన మాల్స్ యాజమాన్యాలకు కూడా హెచ్చరికగా మారుతుంది.పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ (ఖబీఎశ్రీఱతిఱ ాజీటవవబిఎ ంఇఖబి) ప్రకారం, ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే మాల్స్, థియేటర్లలో సీసీటీవీ కెమెరాలు, మెటల్ డిటెక్టర్లు, బెస్ట్ సెక్యూరిటీని ఏర్పాటు చేయడం యాజమాన్యాల చట్టపరమైన బాధ్యత.వాహనాల తనిఖీ వద్ద నుంచే కాకుండా మాల్ లోపలికి వచ్చే ప్రతి ప్రవేశ ద్వారం (ఇనిబిఠీఎ ఖనీతినిబి) వద్ద క్షుణ్ణంగా చెక్ చేయాలి. పోలీసులు లేదా ప్రభుత్వ భద్రతా విభాగాలు షాపింగ్ మాల్స్‌లో భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయాలి.ఇలాంటి సంఘటనల నేపథ్యంలో కస్టమర్లు కూడా అప్రమత్తంగా ఉండటం, మాల్స్ లోపల ఏవైనా గొడవలు లేదా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెంటనే అక్కడి సెక్యూరిటీకి లేదా 100 నంబర్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

## తిరుపతి జిల్లాలో త్వరలో ప్రారంభం కానున్న రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం...




**తిరుపతి (భారత శక్తి):** తిరుపతి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను పాఠశాల ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా త్వరలోనే ప్రారంభించనున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. వి. బాలకృష్ణ నాయక్ తెలిపారు. స్థానిక జిల్లా కార్యాలయంలో దీనికి సంబంధించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని మొత్తం 2,35,745 మంది చిన్నారులకు వైద్య బృందాలు క్షేత్రస్థాయికి వెళ్లి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఇందుకోసం సిబ్బందికి ఇప్పటికే ప్రత్యేక శిక్షణ పూర్తయిందని తెలిపారు.?ఈ కార్యక్రమం ద్వారా చిన్నారులలో పుట్టుకతో వచ్చే లోపాలు, పోషకాహార లోపాలు, బాల్య వ్యాధులు, ఎదుగుదల లోపాలు అనే నాలుగు ప్రధాన విభాగాల కింద మొత్తం 38 రకాల ఆరోగ్య సమస్యలను ముందస్తుగా గుర్తిస్తారు. ముఖ్యంగా గుండె లోపాలు, పెదవి చీలిక, రక్తహీనత, చూపు, వినికిడి లోపాలు, మాట ఆలస్యం కావడం వంటి సమస్యలు ఉన్నట్లు తేలితే, ఆ చిన్నారులను జిల్లా ముందస్తు సహాయ కేంద్రానికి లేదా ఉన్నత ఆసుపత్రులకు పంపి ప్రభుత్వ ఖర్చుతో ఉచితంగా చికిత్స, శస్త్రచికిత్సలు, పునరావాస సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి డా. వి. బాలకృష్ణ నాయక్, కార్యక్రమ అధికారి డా. రెడ్డి ప్రసాద్, సహాయ కేంద్ర మేనేజర్ డా. ఆర్. గుణశేఖర్, ఆరోగ్య సిబ్బంది రత్నాకర్, సుబ్బరాజు, వెంకటేష్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# పూణె రియాల్టర్ కేసు మోడీకి లేఖ

**ముంబై,(భారత శక్తి)** పుణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసులో న్యాయం చేయాలని కోరుతూ ఆయన తల్లి రాఖీ అగర్వాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తీవ్ర భావోద్వేగపూరితమైన లేఖ రాశారు. తన కుమారుడి మరణంతో తమ ప్రపంచం శూన్యమైందని ఆవేదన వ్యక్తం చేసిన ఆమె, ఈ కేసును కేవలం మరో ఫైల్‌గా పరిగణించవద్దని ప్రధానిని వేడుకున్నారు.గత నెల 18న 26 ఏళ్ల కేతన్ అగర్వాల్‌ను లోహగడ్ కోటపై నుంచి తోసి హత్య చేసిన ఉదంతం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ దారుణానికి కేతన్ కాబోయే భార్య సియా గోయల్, ఆమె ప్రియుడు చేతన్ చౌదరి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హత్యగా నిర్ధారించిన పోలీసులు, నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.ప్రధానమంత్రికి పంపిన ఈమెయిల్‌లో రాఖీ అగర్వాల్ తన మనోవేదనను పంచుకున్నారు. "ప్రతి తల్లిలాగే, నా కుమారుడు వివాహం చేసుకుని మా కళ్ల ముందే సంతోషంగా జీవించాలని కలలు కన్నాను. కానీ, విధి వైపరీత్యం వల్ల నా బిడ్డకు నేనే అంత్యక్రియలు నిర్వహించాల్సి వచ్చింది" అని ఆమె పేర్కొన్నారు. ఇంట్లోని ప్రతి వస్తువు, అతని గది, దుస్తులు, అతని చిరునవ్వులు లేని నిశ్శబ్దం, అన్నీ తన కుమారుడిని గుర్తుచేస్తూ ప్రతిక్షణం నరకాన్ని చూపిస్తున్నాయని ఆమె వాపోయారుఈ కేసులో మరో విషాదం కూడా చోటుచేసుకుంది. కేతన్ మరణాన్ని తట్టుకోలేక, సుమారు 20 రోజుల తర్వాత అతని తాత దేవీచంద్ అగర్వాల్ (71) గుండెపోటుతో మరణించారు. "కేవలం కొద్ది రోజుల వ్యవధిలోనే మా కుటుంబం రెండు తరాలను కోల్పోయింది" అని రాఖీ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు.తాను ఎలాంటి సానుభూతిని లేదా ప్రత్యేక సహాయాన్ని కోరడం లేదని స్పష్టం చేసిన రాఖీ, న్యాయం జరగడంలో జాప్యం జరిగే కొద్దీ తమ బాధ రెట్టింపు అవుతోందని పేర్కొన్నారు. "దయచేసి కేతన్ కేసును మరో ఫైల్‌గా మిగిలిపోనివ్వకండి. నాకు అతనే సర్వస్వం. ఏదో ఒకరోజు నా కుమారుడి చిత్రపటం ముందు నిలబడి నీకు న్యాయం జరిగిందని చెప్పాలనుకుంటున్నాను" అని ఆమె తన లేఖను ముగించారు. కాగా, గత వారం కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ కూడా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాసి, విచారణను వేగవంతం చేయాలని విన్నవించారు

# ప్రాజెక్టులపై దమ్ముంటే చర్చకు రండి


**విజయవాడ,(భారత శక్తి)** రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వైసీపీ ఇప్పుడు కొత్త డ్రామాకు తెరలేపిందని, ఐదేళ్ల పాలనలో వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసి ఇప్పుడు సమీక్షల పేరుతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తోందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాజెక్టులపై తాము చేసిన ఖర్చు, వైసీపీ హయాంలో జరిగిన నిర్లక్ష్యంపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని, దమ్ముంటే రావాలని ఆయన సవాల్ విసిరారు. ఈరోజు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్ర విమర్శలు చేశారు.2020లోనే నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్జీటీ) రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ (ఆర్ఎల్ఐఎస్) పనులపై స్టే ఇచ్చిందని సోమిరెడ్డి గుర్తుచేశారు. "అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ అల్లుడు, మంత్రి హరీశ్ రావు తామే 18 లేఖలు రాసి, కేసులు వేసి ఆర్ఎల్ఐఎస్ పనులను ఆపించామని ఆనాడు 'నమస్తే తెలంగాణ' పత్రికలో గొప్పగా చెప్పుకున్నారు. మరి, కేసీఆర్‌తో స్నేహంగా ఉన్న జగన్.. ఆ స్టేను నాలుగేళ్ల పాటు ఎందుకు ఎత్తివేయించలేకపోయారు? ఇప్పుడు అధికారం కోల్పోయాక 'గొడ్డలి పార్టీ' నాయకులు సమీక్షలు, రౌండ్ టేబుల్ సమావేశాల పేరుతో కొత్త నాటకాలు ఆడుతున్నారు. ఈ సమీక్షలు మీ తాడేపల్లి ప్యాలెస్‌లో పెట్టుకుని, ఐదేళ్లలో మీరేం చేశారో ఆత్మపరిశీలన చేసుకోండి" అని సోమిరెడ్డి ఎద్దేవా చేశారు.టీడీపీ ప్రభుత్వానికి, వైసీపీ ప్రభుత్వానికి ప్రాజెక్టులపై ఉన్న చిత్తశుద్ధికి ఖర్చు చేసిన నిధులే నిదర్శనమని సోమిరెడ్డి పేర్కొన్నారు. "మేం అధికారంలోకి వచ్చిన వెంటనే 24 నెలల్లోనే ప్రాజెక్టులపై రూ. 12,484 కోట్లు ఖర్చు చేశాం. మరో రూ. 10 వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ మీరు 2019 నుంచి 2024 వరకు ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయగలరా? వైసీపీ నేత, ఉరవకొండ ఇన్‌ఛార్జ్ విశ్వేశ్వర్ రెడ్డే స్వయంగా తమ ప్రభుత్వ హయాంలో సీమకు ఏమీ చేయలేకపోయామని అంగీకరించారు. దీన్నిబట్టి చూస్తే రాయలసీమకు ద్రోహం చేసింది ఎవరో స్పష్టమవుతోంది" అని విమర్శించారు.తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, వాటిని అత్యధికంగా పూర్తి చేసింది స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబు అని సోమిరెడ్డి గుర్తుచేశారు. "జగన్ రెడ్డి జీఓ 365 పేరుతో రాయలసీమలోని 102 సాగునీటి ప్రాజెక్టుల పనులను రద్దు చేశారు. అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోతే 39 మంది ప్రాణాలు కోల్పోయారు. కృష్ణా జలాల్లో మిగులు జలాలు కోరబోమని బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్‌కు లేఖ రాసి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీమకు తీరని అన్యాయం చేశారు. జలయజ్ఞం పేరుతో మీరు చేసింది ధనయజ్ఞం మాత్రమే" అని ఆరోపించారు.

**మైక్రో ఇరిగేషన్‌ను చంపేశారు** రాయలసీమ వంటి కరవు ప్రాంతానికి అత్యంత కీలకమైన మైక్రో ఇరిగేషన్ (బిందు, తుంపర సేద్యం) పథకాన్ని జగన్ రెడ్డి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సోమిరెడ్డి మండిపడ్డారు. "చంద్రబాబు హయాంలో 5 ఎకరాల సబ్సిడీని 10 ఎకరాలకు పెంచి, డ్రిప్ ఇరిగేషన్‌లో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపాం. కానీ జగన్ రాగానే ఆ పథకాన్ని రద్దు చేశారు. దీంతో రాయలసీమ రైతులు తీవ్రంగా నష్టపోయారు. పులివెందుల రెడ్లే తన వద్దకు వచ్చి ఈ విషయం అడుగుతున్నారని అప్పటి వ్యవసాయ మంత్రి కన్నబాబు జగన్‌తో చెప్పినా, 'నీ పని నువ్వు చూసుకో' అని విసుక్కున్నారంటే సీమ రైతులపై ఆయనకు ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది" అని సోమిరెడ్డి అన్నారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టిందని సోమిరెడ్డి తెలిపారు. "నిర్వీర్యమైన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాం. కృష్ణా డెల్టాకు నీళ్లు లేకపోతే పట్టిసీమ ద్వారా 7 వేల క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నాం. రూ. 35,313 కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చంద్రబాబు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. సాగునీటి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిజాయతీగా, కష్టపడి పనిచేస్తున్నారు. ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూసే వైసీపీ నేతలకు రాయలసీమ పేరు ఎత్తే అర్హత కూడా లేదు" అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి స్పష్టం చేశారు.

## రైతులకు భారంగా

# బీమా ప్రీమియం

- పంటల బీమా ప్రభుత్వమే చెల్లించాలి...
- సిపిఎం




**దేవనకొండ(భారత శక్తి)** వర్ష బావ పరిస్థితులు, గత కొన్ని ఏళ్లు గా వ్యవసాయానికి తీవ్ర ఆటంకాలు ప్రకృతితో తీవ్రంగా నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా పంటల బీమా చెల్లించాలని సిపిఎం జిల్లా నాయకులు బి. వీర శేఖర్ డిమాండ్ చేశారు మంగళవారం నాడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆంధ్ర గ్రామీణ బ్యాంక్ ముందు మరియు స్థానిక వ్యవసాయ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీరశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయం భారం అవుతున్న నేటి పరిస్థితుల్లో రైతుల సహనానికి పరీక్ష పెట్టినట్లు ప్రభుత్వాలు రైతులపై విరివిగా భారాలేస్తూ రైతును కృంగ దీస్తున్నాయని వాటికి ఉదాహరణ భారీగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని కోరడమేనని పేర్కొన్నారు అసలే అప్పుల బాధతో ప్రకృతి సహకరించక పాలకుల విధానాల వలన నష్టపోతున్న రైతుకు ప్రభుత్వాలు పంటల బీమా ప్రీమియం పేరుతో వారిని తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారని పేర్కొన్నారు ఎరువులు ,విత్తనాలు, పురుగుమందుల ధరలు పెరగడం ఈ సంవత్సరం వ్యవసాయానికి మరింత భారంగా మారిందని గత సంవత్సరం గిట్టుబాటు ధర లేకపోవడం వర్షాభావ పరిస్థితులు అతివృష్టి పరిస్థితి రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీసేయని ఇప్పుడు రైతులే ప్రీమియం చెల్లించాలంటే భారీగా పెంచిన ప్రీమియం ధరలు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని వారు పేర్కొన్నారు ప్రభుత్వమే రైతులకు ఉచితంగా ప్రీమియం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాండురంగడు మహేంద్ర వివిధ గ్రామాల రైతులు ఆంజనేయులు నరసన్న మాదన్న నాగరాజు రామాంజనేయులు బడేసా రామయ్య శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో

## ఎస్‌డీఆర్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం

**మార్నింగ్ వాక్‌కు వెళ్తుండగా ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనంకర్నూలు**



**(భారత శక్తి)** జాతీయ రహదారి 44 పై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ హెడ్ కానిస్టేబుల్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం... 2వ బెటాలియన్ ఏపీఎస్‌పికి చెందిన ఎస్‌డీఆర్ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ రెడ్డి (43) ఈరోజు తెల్లవారుజామున సుమారు 5:20 గంటల ప్రాంతంలో బెటాలియన్ గేటు వద్ద తన స్కూటీని పార్క్ చేశారు. అనంతరం ఆయన జాతీయ రహదారి 44 పై మార్నింగ్ వాక్ (నడక) కోసం బయలుదేరారు.ఆయన బళ్ళారి చౌరస్తా సమీపంలో నడుచుకుంటూ వెళుండగా, అదే సమయంలో వేగంగా వచ్చిన ఒక గుర్తుతెలియని వాహనం ఆయనను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు వరప్రసాద్ రెడ్డి రోడ్డు పక్కన ఉన్న సర్వీస్ రోడ్డు కింద పడిపోయారు. తీవ్ర గాయాలు కావడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుడు చిన్నరెడ్డి కుమారుడిగా పోలీసులు గుర్తించారు.సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు:ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌లను సేకరిస్తున్నారు.

## ఓవైసీని భయపెడుతున్న స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్

**హైదరాబాద్,(భారత శక్తి)** మునుపెన్నడూ లేని విధంగా సాగుతున్న ఈ ఓటర్ల జాబితా ప్రక్షాళన, దశాబ్దాలుగా పాతబస్తీని తమ రాజకీయ సామ్రాజ్యంగా ఏలుతున్న మజ్లిస్ పార్టీకి, ముఖ్యంగా ఓవైసీ కుటుంబానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. క్షేత్రస్థాయిలో నకిలీ ఓట్లు, అక్రమ ఓట్ల వ్యవహారం ఈ ప్రత్యేక తనిఖీలతో వెలుగులోకి రాబోతుండటమే ఇందుకు ప్రధాన కారణమనే చర్చ జోరందుకుంది.హైదరాబాద్ జిల్లా పరిధిలోని చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, బహదూర్‌పురా వంటి పాతబస్తీ నియోజకవర్గాల్లో ప్రతి ఎన్నికల్లోనూ అత్యంత తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతుంటుంది. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా సగటు ఓటింగ్ 45శాతం నుండి 50శాతం లోపే ఉండటానికి ప్రధాన కారణం ఓటర్ల జాబితాలోని అద్దగోలు లోపాలేనని ఈ నిరంతర తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో బూత్ లెవల్ అధికారులు కేవలం ఆధార్ కార్డ్ లేదా ఏదైనా ఒక సాధారణ గుర్తింపు పత్రాన్ని చూసి ఓట్లు నమోదు చేసేవారు. దీనివల్ల ఒకే ఇంట్లో పదుల సంఖ్యలో ఓట్లు ఉండటం, చనిపోయిన వారి పేర్లు, గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వారి ఓట్లు కూడా జాబితాలో అలాగే ఉండిపోయాయి.ప్రస్తుత కఠినమైన 'స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్'లో అధికారులు పౌరసత్వం, స్థానికతను నిరూపించుకోవడానికి దశాబ్దాల నాటి మున్సిపల్ అసెస్‌మెంట్ రసీదులు, రిజిస్టర్డ్ సేల్ డీడ్స్ వంటి పక్కా లీగల్ డాక్యుమెంట్లు అడుగుతున్నారు. పాతబస్తీలో తరతరాలుగా నివసిస్తున్న మెజారిటీ ముస్లిం పేద కుటుంబాలు అద్దె ఇళ్లలోనో, సరైన పత్రాలు లేని పాత ఇళ్లలోనో ఉంటుండటంతో ఈ పత్రాలు చూపించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రక్రియ ముగిసేసరికి పాతబస్తీలో భారీ సంఖ్యలో బోగస్, బల్క్ ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.ఈ ఓట్ల గల్లంతు భయం వెనుక ఎంఐఎం పార్టీ ఉనికికి సంబంధించిన పెద్ద రాజకీయ సంక్షోభం దాగి ఉంది. పాతబస్తీలో పోలింగ్ శాతం తక్కువగా ఉన్నప్పటికీ, అక్కడ నమోదయ్యే లాయల్ ఓట్ బ్యాంక్, బల్క్ ఓటింగ్ ఆధారంగానే అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలు దశాబ్దాలుగా ఏకపక్ష విజయాలను సాధిస్తూ వస్తున్నారు. ఈ ప్రత్యేక ప్రక్షాళన వల్ల లక్షలాది ఓట్లు తొలగిపోతే, ఎంఐఎం సంప్రదాయ ఓట్ బ్యాంక్ ఛిన్నాభిన్నమవుతుంది.రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సీట్ల సంఖ్య దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది. ఓటర్ల జాబితాలో నకిలీలు ఏరివేస్తే, ఓవైసీ కుటుంబానికి పాతబస్తీపై ఉన్న తిరుగులేని రాజకీయ పట్టు సడలిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.తమ రాజకీయ కోటను కాపాడుకునేందుకు రంగంలోకి దిగిన ఎంఐఎం అగ్రనేత అసదుద్దీన్ ఓవైసీ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహానికి తెరలేపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ దొరకకపోవడంతో, ఎంఐఎం ప్రతినిధి బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 162ని ఉపయోగించి, కర్ణాటక ప్రభుత్వం సకల సేవల చట్టం-2011 కింద జారీ చేస్తున్నట్లుగా, ఇక్కడి ఓటర్లకు కూడా శాశ్వత నివాస ధృవీకరణ పత్రాలు లేదా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఓవైసీ డిమాండ్ చేస్తున్నారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న బ్లాక్‌మెయిల్ రాజకీయంగా విమర్శకులు అభివర్ణిస్తున్నారు.మరోవైపు, సీఎం రేవంత్ రెడ్డి ఈ శాశ్వత నివాస ధృవీకరణ డిమాండ్‌పై అత్యంత వ్యూహాత్మకంగా మౌనం వహిస్తున్నారు. తెలంగాణలో స్థానికత అనేది సెంటిమెంట్‌తో కూడిన అంశం కావడంతో, ఎంఐఎం అడిగినట్లు హడావుడిగా శాశ్వత నివాస పత్రాలు జారీ చేస్తే అది రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ దుమారానికి దారి తీస్తుంది, పైగా బీజేపీ దీనిని ప్రధాన ఆయుధంగా మార్చుకుంటుంది. చట్టపరంగా ఓటర్ల జాబితా సవరణ అనేది పూర్తిగా కేంద్ర ఎన్నికల సంఘం పరిధిలోని అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేస్తోంది. ఏదేమైనా, ఈ స్పెషల్ రివిజన్ ప్రక్రియ పూర్తయ్యే సరికి పాతబస్తీ రాజకీయ చిత్రపటంలో ఓవైసీ మార్క్ ఏకపక్షాధిపత్యానికి బ్రేకులు పడటం ఖాయంగా కనిపిస్తోంది.

## కాళేశ్వరంపై బీజేపీ కిం కర్తవ్యం

**హైదరాబాద్,(భారత శక్తి)** తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా మారిన కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ ఇప్పుడు సరికొత్త రాజకీయ వ్యూహాలు, ప్రతివ్యూహాలు నడుస్తున్నాయి. ముఖ్యంగా ఈ వ్యవహారంలో బీజేపీ అనుసరిస్తున్న వైఖరి రాజకీయ వర్గాల్లో తీవ్ర గందరగోళానికి దారి తీస్తోంది. ఒకవైపు కేంద్రంలోని తమ ప్రభుత్వ పరిధిలోని సంస్థ ఇచ్చిన నివేదికకు భిన్నంగా రాష్ట్ర బీజేపీ నేతలు మాట్లాడుతుండడం, మరోవైపు దీనిని అధికార కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకుని విమర్శలు గుప్పించడంతో కాళేశ్వరం చుట్టూ రాజకీయం వేడెక్కింది.మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడంతో కాళేశ్వరం ప్రాజెక్టు భద్రతపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ రంగంలోకి దిగి పరిశీలనలు జరిపింది. ప్రస్తుతానికి మేడిగడ్డ వద్ద నీటిని నిలపవద్దని, అలా చేస్తే బ్యారేజీ నిర్మాణానికి మరింత ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎన్డీఎస్ఏ స్పష్టమైన సిఫారసు చేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ మార్గదర్శకత్వంలోనే ఈ సంస్థ పనిచేస్తోంది.అయితే, విచిత్రంగా రాష్ట్ర బీజేపీ నేతలు మాత్రం ఇందుకు భిన్నమైన డిమాండ్లను తెరపైకి తెస్తున్నారు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ బహిరంగంగానే స్పందిస్తూ.. కాళేశ్వరంలో నీటిని నింపి, ఎత్తిపోయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అటు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు సైతం కాళేశ్వరంపై ప్రభుత్వ వైఖరిని తప్పుబడుతూ సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాయడం సంచలనంగా మారింది. కేంద్ర సంస్థ చెప్పినదానికి భిన్నంగా, రాష్ట్ర బీజేపీ నేతలు నీటిని నింపాలని కోరడం వెనుక ఉన్న వ్యూహం ఏంటో అర్థం కాక ఆ పార్టీ శ్రేణులే గందరగోళానికి గురవుతున్నారు.రాష్ట్ర బీజేపీ నేతల విమర్శలపై అధికార కాంగ్రెస్ పార్టీ అంతే దీటుగా స్పందిస్తోంది. తాము సొంత నిర్ణయాలు తీసుకోవడం లేదని, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్డీఎస్ఏ సిఫారసులనే తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని ప్రభుత్వం గట్టిగా వాదిస్తోంది. ఒకవేళ ఎన్డీఎస్ఏ నివేదికను కాదని నీటిని నిలిపితే, భవిష్యత్తులో బ్యారేజీకి ఏమైనా నష్టం జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. కేంద్ర సంస్థ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే లేనిపోని సాంకేతిక, చట్టపరమైన సమస్యలు వస్తాయని ప్రభుత్వం వివరిస్తోంది. బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఇలాంటి డిమాండ్లు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు.ఈ గందరగోళాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా పూర్తిగా వాడుకుంటోంది.

బీఆర్ఎస్ చెప్పినట్లే బీజేపీ నేతలు ఆడుతున్నారంటూ కాంగ్రెస్ కొత్త పల్లవి అందుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్, వైఫల్యాలపై బీఆర్ఎస్ తీరును గతంలో తప్పుబట్టిన బీజేపీ, ఇప్పుడు అదే బీఆర్ఎస్ లైన్‌ను ఎందుకు అందుకుందని ప్రశ్నిస్తోంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే రంగంలోకి దిగి.. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు రాసిన స్క్రిప్ట్ ప్రకారమే ఈటల రాజేందర్ నడుచుకుంటున్నారని సంచలన ఆరోపణలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్, బీజేపీల మధ్య అంతర్గత అవగాహన కుదిరిందనే అనుమానాలకు ఈ వైఖరే నిదర్శనమని కాంగ్రెస్ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి.వాస్తవానికి కాళేశ్వరం అవినీతిపై బీఆర్ఎస్‌ను గద్దె దించుతామని గతంలో బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. కానీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను టార్గెట్ చేసే క్రమంలో, బీఆర్ఎస్ వాదనకు బలం చేకూర్చేలా మాట్లాడడం ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఒకవైపు కేంద్ర సంస్థ నీళ్లు నిలపొద్దంటుంటే, మరోవైపు రాష్ట్ర నేతలు నీళ్లు నింపాలనడం ద్వంద్వ వైఖరిని సూచిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అంశంపై పార్టీలో సరైన సమన్వయం, స్పష్టత కొరవడిందని స్వయంగా బీజేపీలోని కొందరు ముఖ్య నేతలే అంతర్గత చర్చల్లో అభిప్రాయపడుతున్నారు.మొత్తానికి, కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ ఎంత ఆలస్యమైతే అంత రాజకీయ ప్రయోజనం పొందాలని ఒకరు, కేంద్ర నివేదికలను అడ్డం పెట్టుకుని ప్రత్యర్థులను కట్టడి చేయాలని మరొకరు చూస్తున్నారు.

ఈ రాజకీయ చదరంగంలో బీజేపీ తీసుకుంటున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలు ఆ పార్టీకే తిప్పలు తెచ్చిపెట్టేలా కనిపిస్తున్నాయి.

### పారిశ్రామిక, నిర్మాణ రంగాల్లో

# దేశం టాప్‌లో ఉంది

**- ఎల్ అండ్ టి ప్రతినిధి శ్రీకాంత్**

**(భారత శక్తి)** ప్రస్తుత పారిశ్రామిక, నిర్మాణ రంగాల్లో ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత దేశం టాప్ లెవల్‌లో కొనసాగుతుందని రానున్న సంవత్సరాల్లో ఈ రంగాల్లో మరింత పురోగతి ఉంటుందని ఎల్అండ్‌టి(లారెన్స్ అండ్ టుబ్రో) సంస్థ ప్రతినిధి బి. శ్రీకాంత్ అన్నారు. ఎల్అండ్‌టి ఇండస్ట్రీయల్ వెల్డింగ్ సొల్యూషన్స్ మార్కెట్‌లో తన ఉనికిని బలోపేతం చేయడానికి కొత్త సాలిడో శ్రేణి హై పెర్ఫార్మెన్స్ వెల్డింగ్ ఎలక్ట్రోడ్లను ప్రారంభించింది. మంగళవారం ఓ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రంజన్ బిర్ సింగ్ ఆనంద్, పర్మేందర్ సింగ్, బ్లూ3 గ్లోబల్ ఇంజనీరింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన రాకేష్ టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వెల్డింగ్ సొల్యూషన్స్ అందుబాటులోకి విస్తరించేందుకు ఈ సంస్థలు కృషి చేస్తాయని వారు తెలిపారు. సాలిడో శ్రేణిలో జనరల్ ఫ్యాబ్రికేషన్ కోసం మిల్డ్ స్టీల్ ఎలక్ట్రోడ్స్, హై స్ట్రెంగ్త్ స్ట్రక్చరల్ అప్లికేషన్ కోసం హైడ్రోజన్ ఎలక్ట్రోడ్స్, కరోషన్, రెసిస్టెంట్, డిసిమిలర్ మెటల్ వెల్డింగ్ అప్లికేషన్స్ కోసం స్టీల్ ఎలక్ట్రోడ్స్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

## అమెరికా త్రిశంకు స్వర్గంలో ఎన్నారైలు

**హైదరాబాద్ (భారత శక్తి)** ఉద్యోగం పోయిన తర్వాత, కొన్ని కుటుంబాలకు మొదటి షాక్ వీసా అయితే, రెండో షాక్ వాళ్లు కొన్న ఇల్లు. అమెరికాలో ఇల్లు కొనేసిన వాళ్లు ఇప్పుడు ఒక విచిత్రమైన ఉచ్చులో చిక్కుకున్నారు. దీనిని నెగెటివ్ ఈక్విటీ అంటారు. ఒక ఉదాహరణతో చూస్తే ఇది సులభంగా అర్థమవుతుంది: "ఒక ఉద్యోగి ఐదేళ్ల క్రితం మార్కెట్ బాగున్నప్పుడు ?8 కోట్లకు ఒక ఇల్లు కొన్నాడు. ఇప్పుడు మార్కెట్ పడిపోవడంతో ఆ ఇల్లు ?7 కోట్లకే అమ్ముడవుతోంది. కానీ బ్యాంకుకు ఇంకా ?7.5 కోట్ల లోన్ బాకీ ఉంది. అంటే, ఇప్పుడు ఆ ఇల్లు అమ్మేసినా కూడా బ్యాంకు అప్పు తీరదు, పైగా జేబులోంచి మరో ?50 లక్షలు కట్టాలి!"దీంతో అటు ఇల్లు అమ్మలేక, ఇటు నెలకు లక్షల్లో ఈఎంఐలు కట్టలేక ఎంతోమంది ఐటీ ఉద్యోగులు ఊపిరాడకుండా బతుకుతున్నారు.ఒకప్పుడు డల్లాస్ సబర్బన్ ఏరియాలో కొత్త ఇళ్ల అమ్మకాల్లో 70% భారతీయులవే ఉండేవి. ఇప్పుడు అది 30% కంటే కిందకు పడిపోయింది. భారతీయులు కొనుగోలు చేయడం ఆపేయడంతో అక్కడ ఇళ్ల ధరలు ఏకంగా 9% పడిపోయాయి. ఒక్క డల్లాస్ మాత్రమే కాదు? సియాటిల్, నార్తర్న్ వర్జీనియా, రాలీ లాంటి ఐటీ ఆధారిత ప్రాంతాలు కూడా ఇప్పుడు ఈ వీసా నిబంధనలు, లేఆఫ్స్ వల్ల ప్రభావితమవుతున్నాయి.అయితే అమెరికా కల పూర్తిగా ముగిసిపోయిందని చెప్పడం కూడా సరైంది కాదు. ఏఐ స్కిల్స్, స్పెషలైజ్డ్ టెక్నాలజీలు, హెల్త్కేర్, సెమీకండక్టర్స్ వంటి రంగాల్లో అవకాశాలు ఇంకా ఉన్నాయి. కానీ 'అమెరికా వెళ్తే జీవితం ఆటోమేటిక్గా సెటిల్' అనే పాత ఫార్ములా మాత్రం ఇక పనిచేయడం లేదనే సంకేతాలు కనిపిస్తున్నాయి. కేవలం కోడింగ్ నాలెడ్జ్ సరిపోదు: పాత పద్ధతుల్లో సాఫ్ట్వేర్ నేర్చుకుంటే ఇప్పుడు సర్వైవ్ అవ్వడం కష్టం. ఏఐ టూల్స్ను వాడుకుంటూ వేగంగా పని చేయగల నిపుణులకే ఇప్పుడు డిమాండ్ ఉందఅదే పూజా గదుల్లో దీపం వెలిగించే కుటుంబాలు తగ్గుతున్నాయి. అదే ఇళ్ల ముందు ఫర్ సేల్ బోర్డులు పెరుగుతున్నాయి.మారింది ఇళ్లు కాదు. భారతీయులు అమెరికాను చూసే చూపు. అమెరికన్ డ్రీమ్ ముగిసిపోలేదు. కానీ, ఇప్పుడు ఆ కలను కొనడానికి డాలర్లు మాత్రమే సరిపోవు. కొత్త స్కిల్స్ కావాలి. కొత్త ధైర్యం కావాలి. ముఖ్యంగా అనిశ్చితితో బతకగలిగే మనస్తత్వం కావాలి.ఒకప్పుడు భారతీయుల కోసం పూజా గదులు కట్టించిన అమెరికా? ఇప్పుడు అదే పూజా గదుల్లో మళ్లీ ఎవరు దీపం వెలిగిస్తారో ఎదురు చూస్తోంది.

## యూట్యూబ్‌లో తప్పుడు ప్రకటనలు

**- గేదెలు బర్రెలు విక్రయిస్తున్నట్లు నమ్మించి ప్రజలను మోసం చేసిన సైబర్ క్రైం నిందితుడు అరెస్ట్**



**సిద్ధిపేట(భారత శక్తి)** మార్క్యూక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన సైబర్ మోసం కేసును గజ్వేల్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. రవి రాజు ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు.కేసు వివరాల్లోకి వెళితే, పల్లె సాయికిరణ్, తండ్రి శ్రీశైలం, నివాసం బీరంగూడ, అమీన్‌పూర్, లక్ష్మీ డెయిరీ ఫార్మ్ పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తూ,గేదెలు,బర్రెలు అమ్మకానికి ఉన్నట్లు వీడియోలు అప్లోడ్ చేసేవాడు. వీడియోలలో చూపించిన ఫోన్ నంబర్‌కు సంప్రదించిన అమాయక ప్రజలను నమ్మించి, ముందుగా అడ్వాన్స్ చెల్లించాలని చెప్పి వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడుతున్నాడు.ఈ క్రమంలో, మార్క్యూక్ గ్రామానికి చెందిన సాయిరెడ్డి, శంకర్ రెడ్డి యూట్యూబ్‌లో వీడియోలు చూసి నిందితుడిని సంప్రదించి 10 బర్రెలు కావాలని కోరగా, వాటి ధర రూ.15 లక్షలు అని చెప్పి సుమారు రూ.2,50,000 అడ్వాన్స్‌గా ఆన్‌లైన్ ద్వారా తీసుకున్నాడు. అనంతరం బర్రెలను ఎప్పుడు పంపిస్తారని బాధితుడు పలుమార్లు సంప్రదించినప్పటికీ నిందితుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకపోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించాడు.బాధితుడు సైబర్ ఫిర్యాదు చేయగా, మార్క్యూక్ పోలీస్ స్టేషన్ సైబర్ క్రైం కేసు నమోదు చేయబడింది.గజ్వేల్ రూరల్ సీఐ డి. రవి రాజు ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో నిందితుడిని గుర్తించి, అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి గజ్వేల్ న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.దర్యాప్తులో నిందితుడు ఇదే తరహాలో మరికొందరిని కూడా లక్షల వరకు మోసం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు నాగర్‌కర్నూల్ మరియు వికారాబాద్ జిల్లాలో కూడా ఇదే తరహాలో కేసులు నమోదైనట్లు గుర్తించారు.ఈ సందర్భంగా గజ్వేల్ రూరల్ సీఐ డి. రవి రాజు ప్రజలకు సూచిస్తూ, యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికల్లో వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను గుడ్డిగా నమ్మవద్దని, వస్తువులను కొనుగోలు చేసే ముందు విక్రేత వివరాలు పూర్తిగా ధృవీకరించుకోవాలని,ఎట్టి పరిస్థితుల్లోనూ తెలియని వ్యక్తులకు ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపవద్దని సూచించారు.అదేవిధంగా, ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కు కాల్ చేసి లేదా ఙలిలి.ఇఎవవతీఇతీతిఎవ.ఙనీల.తిని వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### రైతులు చెల్లించే పంటల బీమా

## ప్రీమియం జూలై 31 పొడిగించాలి

**కౌతాళం(భారత శక్తి)** పత్తి పంటకు రైతు వాటాగా ఎకరాకు 2000 రూపాయలు ప్రభుత్వం నిర్ణయించింది. ఇది రైతులకు భారం పడుతుందని ఎకరాకు 500 రూపాయలకు మించకుండా రైతుల బీమా ప్రీమియం వాటా నిర్ణయించాలని రైతు సంఘం డిమాండ్ చేశారు.పత్తి ,వేరుశనగ, టమోటా పంటలకు వాతావరణ ఆధారిత భీమా పథకంలో రైతులు చెల్లించే పంటల బీమా ప్రీమియం ఆఖరి తేదీ గడువును 2026 జూలై 15 నుండి జూలై 31 వరకు పెంచవలసిందిగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం 2026, 2027 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ సీజన్లో రైతుల పండిస్తున్న పంటలకు బీమా చెల్లించేందుకు ప్రధానమంత్రి పసల బీమా ,వాతావరణ భీమా పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు ప్రకటన చేసింది .పత్తి ఒక్కొక్క రైతు 5 ఎకరాలు నుంచి పది ఎకరాల వరకు సాగు చేస్తున్నారు .నిత్యం కరువు ప్రాంతంగా ఉండే కర్నూల్ జిల్లాలలో ఇంత పెద్ద మొత్తం పంటల బీమా ప్రీమియం చెల్లించడం రైతులకు భారమవుతుందని పంటల బీమా ప్రీమియంను పత్తికి ఎకరాకు ?500 కు మించకుండా నిర్ణయించవలసిందిగా నిర్ణయించాలని గత ప్రభుత్వం రైతులకు ఆ న్ని పంటలకు ఉచిత పంటల బీమా అమలు చేసింది. రైతులకు చాలా ప్రయోజనకరంగా ఉండేది. కనుక కూటమి ప్రభుత్వము కూడా 2026 ,27 ఖరీఫ్, రబి సీజన్లో వేసే అన్ని పంటలకు ప్రభుత్వము ఉచిత పంటల బీమా అమలు చేయవలసిందిగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### రోగులకు అందుబాటులో ఉంటూ

## మెరుగైన వైద్యం అందించాలి



**సిద్దిపేట(భారత శక్తి)** ఆరోగ్య కేంద్రాలలో రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి డాక్టర్లను ఆదేశించారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపి మెయింటెనెన్స్ ఎలా ఉంది, అందరూ సమయ వేళలు పాటిస్తున్నారా, మెడిసిన్ అందుబాటులో ఉందా అని మెడికల్ ఆఫీసర్ ను అడగ్గా సమయానికి వస్తున్నామని ఉదయం సాయంత్రం వేళల్లో ఎక్కువగా రోగులు వస్తారని ఏంఓ కలెక్టర్ కు తెలిపారు. పిఎచ్ సి కి వచ్చిన వృద్ధుని పలకరిస్తూ అనారోగ్య సమస్యలు ఏవైనా ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేసుకోవాలని, పెద్ద సమస్య వస్తే జిల్లా కేంద్రంలోని జీజీఎచ్ కి వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం నిరుపేదలకు వైద్యం చేయడం కోసం ఆసుపత్రులలో అన్ని సదుపాయాలు కల్పించిందని, తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ప్రైవేటు దావకానకు వెళ్ళి అనవసరంగా డబ్బులు వృధా చేసుకోవద్దని తెలిపారు. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్త చర్యల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. పిహెచ్ సి ప్రాంతంలో పిచ్చి మొక్కలు తొలిగించి శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని మండల స్పెషల్ ఆఫీసర్ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.

### గ్రామ రెవెన్యూ సహాయకులకు

## పే స్కేల్ జీతాలు చెల్లించాలి

**- డీ ఎ జీతంతో కలపాలి నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలి**


**- గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం డిమాండ్**



**కొత్తపల్లి (భారత శక్తి):** వీఆర్ఏలకు పే స్కేలు జీతాలు చెల్లించాలని నైట్ డ్యూటీలు రద్దు చేయాలని డి ఏ ను జీతంతో కలపాలని నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని వీఆర్వో అటెండర్ వాచ్మెన్ రికార్డ్ అసిస్టెంట్ తదితర ఖాళీ పోస్టుల భర్తీలో 70% వీఆర్ఏలకు కేటాయించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి ఏసురత్నం సిఐటియు కార్యదర్శి రామ్ నాయక్ వీఆర్ఏల సంఘం కొత్తపల్లి మండల నాయకులు కలాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన తర్వాత నేటి వరకు వీఆర్ఏలకు జీతాలు పెంచలేదు ముఖ్యమంత్రులతో పాటు రెవెన్యూ మంత్రులు మారారు ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ వీఆర్ఏల జీతం మాత్రం గొర్రె తోక బెత్తెడులా ఉన్నది. గత 10 సంవత్సరాలుగా జీతాలు పెంచలేదు డిఏ ఎత్తివేశారు పని భారం మాత్రం రెట్టింపు చేశారు ఈ కాలంలో పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర సరుకుల ధరలు అనేక రెట్లు పెరిగాయి ప్రభుత్వం ఇస్తున్న 10,500 తో వీఆర్ఏ కుటుంబాలు గడవక పస్తులతో బ్రతుకుతున్నారు గతంలో వైసిపి ప్రభుత్వం వేతనాలు పెంచుతామని మాట ఇచ్చి మాట తప్పారు నేడు రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వీఆర్ఏలకు వేతనాలు పెంచి వారి సమస్యలు పరిష్కరిస్తామని వాగ్దానం చేశారు కానీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిపోతున్న వీఆర్ఏల సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ పెట్టడం లేదు

తెలంగాణ లో అమలవుతున్న విధంగా వీఆర్ఏలకు పేస్కేల్ జీతాలు చెల్లించాలని అర్హత ఉన్న వీఆర్ఏలను వన్ టైం సెటిల్మెంట్ ద్వారా విఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలి నిబంధనలకు విరుద్ధంగా విధించిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలి డి ఏ జీతంతో కలపాలి వివిధ ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న అటెండర్ వాచ్మెన్ రికార్డ్ అసిస్టెంట్ మరియు విఆర్వో కాళీ పోస్టుల భర్తీలో 70% పోస్టులను వీఆర్ఏలు కేటాయించాలని కాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని పై సమస్యల సాధన కోసం జూలై 30వ తేదీన కలెక్టర్ కార్యాలయం దగ్గర జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున జిల్లాలోని గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో వీఆర్ఏ సంఘం నాయకులు విజయుడు అమ్మని ముర్తుజా శీను మియ్యసావు లక్ష్మన్న పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి




**ఆత్మకూర్:(భారత శక్తి)** వెలుగోడు పట్టణంలోని భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వ భూములను పంచాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఆత్మకూరు రెవిన్యూ డివిజనల్ అధికారి వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఆర్డీవో వినతి పత్రాన్ని తీసుకొని సదరు వినతిపత్రం ఇచ్చిన పేద ప్రజల ఉద్దేశించి వారు మాట్లాడుతూ సర్వేనెంబర్ 1706 లోని విస్తీర్ణం 333 - 59 ఎకరాల భూములపై విచారణ జరిపించి భూములను నిజమైన పేదవాలను గుర్తించి వారికి అందేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు అదేవిధంగా ఇంటి నివాస స్థలాలకు అర్జీలు ఇచ్చుకొని వారు ఎవరైనా ఉంటే వారు కూడా అర్జీలను ఆన్లైన్లో ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు .అనంతరం అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వై నరసింహులు అఖిల భారత రైతుకుల్లు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె ఆనందరావు అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కోశాధికారి కే లాలూ నాయక్ పాల్గొని వారు మాట్లాడుతూ భూమి లేని నిరుపేదలను గుర్తించి ప్రతి పేదవారికి భూసంస్కరణ చట్టం ద్వారా కోనేరు రంగారావు సిఫారసుల మేరకు ప్రతి పేద కుటుంబానికి రెండు ఎకురముల భూమి పంచాలని వారు కోరారు. వెలుగోడు గ్రామంలో ఉన్నటువంటి భూములను ప్రభుత్వ ఉన్నత అధికారులు మరియు ప్రజాస్వామిక వాదులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి అక్రమ దారులు ఆక్రమించుకున్న భూములను పరివేక్షించి రికార్డుల పరిశీలించి గుర్తించిన మిగులు భూములను అర్హులైన నిరుపేదలకు పంచాలని వారు కోరారు .ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం వెలుగోడు మండల కమిటీ నాయకులు వడ్ల హుస్సేన్. ఇప్ప రుద్ర ముని. ఎం నాగ స్వామి నాయక్. చిన్న జబ్బు రున్ని సా . ఉషన్ నమ్మ .ఎస్ లక్ష్మి భాయ్ ఆర్డిఓ గారిని కలిసిన వారిలో 25 మంది ప్రజలు పాల్గొన్నారు

# 'పరిమళ అండ్ కో' మూవీ రివ్యూ!




కోలీవుడ్ లో దర్శకుడిగా పాండిరాజ్ కి మంచిపేరు ఉంది. వైవిధ్యభరితమైన కథలను తెరపై వినోదభరితంగా .. ఆసక్తికరంగా ఆవిష్కరించడం ఆయన ప్రత్యేకత. కామెడీ టచ్ ఇస్తూనే ఎమోషన్స్ ను కనెక్ట్ చేయడంలో సిద్ధహస్తుడు. ఆయన రూపొందించిన సినిమానే 'పరిమళ అండ్ కో'. జయరామ్ ప్రధానమైన పాత్రగా తెరకెక్కిన ఈ సినిమా, జూన్ 5వ తేదీన థియేటర్లకు వచ్చింది. బ్లాక్ కామెడీ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఈ సినిమా, ఈ నెల 10వ తేదీ నుంచి 'జీ 5' లో ఐదు భాషల్లో అందుబాటులోకి వచ్చింది. నగరంలో పరిమళ ( జయరామ్) తన కుటుంబంతో కలిసి నివసిస్తూ ఉంటాడు. అప్పారావు (యోగిబాబు) ఇంట్లో చాలా కాలం నుంచి అద్దెకి ఉంటాడు. ఆయన భార్య స్వరాజ్యం (ఊర్వశి) కూతుళ్లు పరాశక్తి (సంజనా కృష్ణమూర్తి) మధుమిత (అనంతిక). పరిమళ మిడిల్ క్లాస్ ఫ్యామిలీని చాలా పొదుపుగా నెట్టుకొస్తుంటాడు. అయితే ఆ సిటీలో వర్గీస్ (శాండీ) అనే జులాయి తిరుగుతూ ఉంటాడు. అతను నగరంలోని కాలేజ్ కుర్రాళ్లకు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తుంటాడు. అతని వెనక రాజకీయనాయకులు ఉండటంతో పోలీసులు వెనకడుగు వేస్తుంటారు. 'జాలరిపేట'కి చెందిన వర్గీస్, హత్యలు చేయడానికి కూడా ఎంతమాత్రం వెనుకాడడు. అందువలన అతనంటే అక్కడి వాళ్లంతా భయపడుతుంటారు. ప్రేమిస్తున్నానంటూ అతను మధుమిత వెంటపడుతూ ఉంటాడు. పరిమళతో పాటు అతని పెద్ద కూతురు .. చిన్నకూతురు ఎంతగా మందలించినా అతను వినిపించుకోడు. వర్గీస్ తల్లి సురేఖావాణి కూడా ఆ ఏరియాలో తన దందా కొనసాగిస్తూ ఉంటుంది. మధుమిత విషయంలో ఆమె కొడుకును మరింత సపోర్ట్ చేస్తుంది. దాంతో వర్గీస్ చనిపోతేనే తాము ప్రశాంతంగా బ్రతకగలమని పరిమళ భావిస్తాడు. మిగతా కుటుంబ సభ్యులంతా అతని నిర్ణయానికి తమ మద్దతును తెలియజేస్తారు. చిట్టీ ( సంతోష్ శోభన్)అనే యుకుడిని పరాశక్తి ప్రేమిస్తూ ఉంటుంది. వర్గీస్ విషయంలో తమ ఫ్యామిలీ తీసుకున్న నిర్ణయాన్ని గురించి ఆమె చిట్టీతో చెబుతుంది. ఆ మరుసటి రోజునే వర్గీస్ దారుణంగా హత్య చేయబడతాడు. ఈ వార్త బయటికి రాగానే, సిటీ అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడుతుంది. వర్గీస్ చనిపోవడానికి ముందు అతనికి పరిమళ ఫ్యామిలీతో గొడవ జరిగిందని తెలుసుకున్న సురేఖావాణి, తన అనుచరులతో బయల్దేరుతుంది. వర్గీస్ తో పరిమళకు గల గొడవను గురించి తెలుసుకున్న పోలీస్ టీమ్ కూడా పరిమళ ఇంటికి బయల్దేరుతుంది. తన ఫ్యామిలీ ప్రమాదంలో పడుతుందని గ్రహించిన పరిమళ ఏం చేస్తాడు? అతను తీసుకున్న నిర్ణయం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుంది? వర్గీస్ ను హత్య చేసింది ఎవరు? అనేది మిగతా కథ. ఒక మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఒక రౌడీ హత్య కేసులో చిక్కుకుంటుంది. ఆ ఫ్యామిలీ కోసం ఒక వైపున పోలీస్ ఆఫీసర్ ఏడుకొండలు గాలిస్తుంటే, మరో వైపున ఆ రౌడీ తాలూకు గ్యాంగ్ వెంటాడుతూ ఉంటుంది. వాళ్ల బారి నుంచి ఆ ఫ్యామిలీ తప్పించుకో గలుగుతుందా? ప్రాణాలతో బయటపడగలుగుతుందా? వర్గీస్ హత్య వెనకున్న సూత్రధారులు ఎవరు? అనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది. మధ్యతరగతి కుటుంబీకులు పరువుకు ప్రాణం ఇస్తుంటారు. డబ్బు .. అధికారం .. రాజకీయనాయకుల అండదండలు ఉన్నవారు, మిడిల్ క్లాస్ అమ్మాయిలను టార్గెట్ చేస్తుంటారు. అలాంటివారైతే పరువుకు భయపడి బయటికి రారనీ, తమని ఏమీ చేయలేరనే ఒక ధైర్యంతో ఉంటారు. అయితే అలాంటి మిడిల్ క్లాస్ ఫ్యామిలీని కాపాడుకోవడానికి తండ్రి అనేవాడు ఎంతకైనా తెగిస్తాడనే విషయాన్ని చాటి చెప్పిన సినిమానే 'దృశ్యం'. అలాంటి ఒక సినిమాను పోలినదిగా 'పరిమళ అండ్ కో' కనిపిస్తుంది. అయితే కంటెంట్ పరంగా ఇది 'దృశ్యం' సినిమాకి పూర్తి భిన్నంగా ఉంటుంది. 'దృశ్యం' సినిమా సీరియస్ గా కొనసాగితే, ఈ సినిమా మాత్రం కామెడీ టచ్ ఇస్తూ ఫ్యామిలీ ఎమోషన్స్ ను కనెక్ట్ చేస్తుంది. హంతకుడు ఎవరనేది చివరివరకూ ఆడియన్స్ కనుక్కోలేని విధంగా దర్శకుడు ఈ కథను నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది. ఒక రౌడీ హత్య .. ఆ విషయంలో అనుమానితులుగా నిలిచిన ఒక ఫ్యామిలీ, ఆవేశంతో వాళ్లను వెంటాడే హతుడి తాలూకు అనుచరులు .. అసలేం జరిగిందనేది తెలుసుకోవడానికి రంగంలోకి దిగిన పోలీస్ టీమ్. ఇలా ఈ మూడు వైపుల నుంచి కథను .. పాత్రలను నడిపించిన తీరు చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. ప్రతి ఒక్కరూ చాలా సహజంగా తమ పాత్రలను పండించారు .. సన్నివేశాలను రక్తికట్టించారు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఈ కంటెంట్ ను నెక్స్ట్ లెవెల్ కి తీసుకుని వెళ్లాయి. ఈ సినిమాలో బరువైన పాత్రలు గానీ, బలమైన సన్నివేశాలు గానీ లేవు. సరదాగా నవ్విస్తూనే, నెక్స్ట్ ఏం జరగనుందా? అనే ఒక కుతూహలాన్ని రేకెత్తిస్తుంది. చివర్లో వచ్చే ట్విస్టులు ఈ కథకి మరింత బలాన్ని చేకూర్చుతాయి. ఫ్యామిలీతో కలిసి చూడదగిన సినిమానే ఇది.

# రాజా ది రాజా ఓ భిన్నమైన కథ



'ఇది చాలా బలమైన కథ. ఇందులో రెండు విభిన్నమైన ఛాలెంజింగ్ పాత్రల్లో హీరో రుత్విక్ కనిపిస్తాడు. ఫైనల్ అవుట్‌పుట్ చూసి సంతృప్తిగా ఉన్నాం' అని నిర్మాత కె.నిహారిక దాసరి అన్నారు. రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'రాజా ది రాజా'. అనిల్ బోయిడపు దర్శకుడు. ఈ నెల 17న విడుదల కానున్నది. సోమవారం నిర్మాత నిహారిక దాసరి విలేకరులతో మాట్లాడారు. 'మా తమ్ముడు రుత్విక్ అమెరికాలో ఫిల్మ్ కోర్స్ చేశాడు. ఒక షార్ట్ ఫిల్మ్‌లో అబ్బాయిగా, అమ్మాయిగా రెండు పాత్రల్లో నటించాడు. అది చూశాక అతని టాలెంట్‌పై నమ్మకం కుదిరింది. మంచి ఛాలెంజింగ్ పాత్ర ద్వారా అతన్ని హీరోగా పరిచయం చేయాలనుకున్నాం. అలా తెరకెక్కిన సినిమానే 'రాజా ది రాజా'. ట్రైలర్ రిలీజ్ తర్వాత అంతా ఈ సినిమాను 'మగధీర'తో కంపేర్ చేస్తున్నారు. నిజానికి ఇది డిఫరెంట్ స్టోరీ' అని నిహారిక దాసరి చెప్పారు. ఇందులో గ్రాఫిక్ వర్క్ అద్భుతంగా ఉంటుందని, కథానాయిక విశాఖ ధిమాన్ సహజంగా నటించిందని, నరేశ్, అవసరాల శ్రీనివాస్ పాత్రలు ఆసక్తికరంగా ఉంటాయని, మైత్రీవారు విడుదల చేస్తుండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయని నిహారిక దాసరి ఆనందం వెలిబుచ్చారు.

## చెన్నైలో కొత్త ఇంట్లోకి

# శ్రుతి

## గృహప్రవేశానికి దూరంగా కమల్ హాసన్



ప్రముఖ నటి శ్రుతి హాసన్ తన జీవితంలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. చెన్నైలో కొనుగోలు చేసిన కొత్త ఇంట్లోకి ఆమె అడుగుపెట్టారు. నిన్న తన నూతన గృహంలో సంప్రదాయబద్ధంగా గృహప్రవేశ పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో పంచుకోవడంతో అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.(ఈ పూజా కార్యక్రమంలో శ్రుతి హాసన్ చాలా నిరాడంబరంగా, సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. తక్కువ ఆభరణాలు ధరించి పూజలో కూర్చున్న ఫొటోలతో పాటు ఈ సందర్భంగా సిద్ధం చేసిన పిండివంటలు, కొత్త ఇంటి తాళాలను కూడా ఆమె షేర్ చేశారు. చెన్నైలో ఆమె కొత్త ప్రయాణం ప్రారంభించడంపై అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలియజేస్తున్నారు. అయితే, ఈ ముఖ్యమైన కార్యక్రమానికి శ్రుతి తండ్రి, ప్రముఖ నటుడు కమల్ హాసన్, సోదరి అక్షర హాసన్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులు హాజరుకాకపోవడం గమనార్హం. కేవలం కొద్దిమంది సన్నిహితులు, స్నేహితుల సమక్షంలోనే ఈ వేడుకను నిరాడంబరంగా పూర్తి చేశారు. వారి గైర్హాజరుకు గల కారణాలపై హాసన్ కుటుంబం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. అయితే, సోషల్ మీడియాలో దీనిపై పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా ముంబై, చెన్నై మధ్య ప్రయాణాలు చేస్తూ గడిపిన శ్రుతి, ఇప్పుడు చెన్నైలో స్థిరపడటం ఆమె నగరంతో ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తోంది. గతంలో ముంబైలోని ఆమె ఇల్లు తన కళాత్మక అభిరుచులకు అద్దం పట్టేలా ఉండేది. ఇప్పుడు చెన్నైలోని కొత్త ఇంటిని కూడా తనదైన శైలిలో ఎలా తీర్చిదిద్దుకుంటారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కెరీర్ పరంగా చూస్తే.. శ్రుతి హాసన్ ప్రస్తుతం ఫుల్ బిజీగా ఉన్నారు. ఇటీవలే రామ్ చరణ్ నటించిన 'పెద్ది' చిత్రంలో ఓ ప్రత్యేక గీతంలో మెరిశారు. ప్రస్తుతం ఆమె విజయ్ సేతుపతితో కలిసి మిస్కిన్ దర్శకత్వంలో నటిస్తున్న 'ట్రైన్' సినిమాపై భారీ అంచనాలున్నాయి. వీటితో పాటు 'ఆకాశంలో ఒక తార' అనే మరో చిత్రం, పలు మ్యూజిక్ ప్రాజెక్టులతో ఆమె కెరీర్ పరంగా జోరు చూపిస్తున్నారు.


## డిసెంబర్‌లో రానున్న

# 'ఇడుపు కాయితం'




అచ్చ తెలంగాణ మాండలికమైన ఇడుపు కాయితం అనే మాటను టైటిల్‌గా పెట్టి రూపొందిస్తున్న 'ఇడుపు కాయితం' చిత్రం ముహూర్తం రోజు నుంచే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. ఇందులో జానపద గీతాలతో సుపరిచితురాలైన నాగదుర్గ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ప్రియదర్శి హీరోగా తెలంగాణ నేపథ్య కథాంశంతో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి వంశీ రెడ్డి దొండపాటి దర్శకుడు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. త్వరలో రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించి, డిసెంబర్ తొలివారంలో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని మేకర్స్ తెలిపారు. శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), జోర్దార్ సుజాత, చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చ రవి, బిత్తిరి సత్తి, అజయ్ బేతిగంటి, మైమ్ మధు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, నిర్మాణం: సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్, నిర్మాత: బన్నీ వాస్, దర్శకత్వం: వంశీ దొండపాటి.

# ఆత్మతో కనకరాజు అవస్థలు



మెగా హీరో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కొరియన్ కనకరాజు'. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్నది. ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చిందని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఈ టీజర్‌ని ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. రాయలసీమలోని పెనుగొండ ప్రాంతాన్ని పరిచయం చేస్తూ కనకరాజు వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. సరదాగా సాగే కనకరాజు జీవితం, ఓ కొరియన్ అమ్మాయిని ప్రేమించిన తర్వాత ఎలా మారింది? అనేది ఈ టీజర్‌లో ఆసక్తికరంగా సాగింది. ఆత్మలు, అతీంద్రియ శక్తుల నేపథ్యంలో కామెడీ, యాక్షన్, ఫాంటసీ హారర్ అంశాలతో ఈ కథ సాగుతుందని టీజర్ చెబుతున్నది. రాయలసీమ గ్రామీణ నేపథ్యాన్ని, కొరియా వాతావరణాన్ని మేళవిస్తూ వినోదాత్మకంగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయిక. సత్య కీలక పాత్ర పోషిస్తున్నారు. కెమెరా: మనోజ్ రెడ్డి, సంగీతం: తమన్.

# టాలీవుడ్‌లో ఫహాద్ ఫాజిల్ ఇంద్రజాలం



ఫహాద్ ఫాజిల్ ఇంద్రజాలికుని పాత్రలో కనిపించనున్న ఫాంటసీ డ్రామా 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. ప్రఖ్యాత దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి సమర్పణలో ఆర్కా మీడియా వర్క్స్, షోయింగ్ బిజినెస్ పతాకాలపై ఎస్.ఎస్.కార్తికేయ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శశాంక్ యేలేటి దర్శకుడు. సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్ రిలీజ్ ఈవెంట్ సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. 'మనసులకు హత్తుకునే సినిమా ఇది. టీజర్ అందరికీ నచ్చే ఉంటుంది. ఇకపై రాబోయే కంటెంట్ ఇంకా బాగుంటుంది. ఫహాద్ ఫాజిల్ అంటే నాకు అభిమానం. 'పుష్ప' షూట్‌లో ఆయన్ను కలిసి ఈ కథ వినిపించాం. ఫస్ట్ నేరేషన్లోనే ఓకే చేశారు.(ఈ మధ్యకాలంలో ఇలాంటి జానర్ రాలేదు. ఇందులో వీఎఫ్ఎక్స్ కీలకం. రాజమౌళి స్టాంప్ పడ్డాకే స్క్రిప్ట్ లాక్ చేశాం. షూటింగ్ పూర్తయ్యాక మరోసారి ఆయనకు చూపిస్తాం' అని నిర్మాత ఎస్.ఎస్.కార్తికేయ చెప్పారు. ఆడియో బైట్ ద్వారా ఫహాద్ ఫాజిల్ మాట్లాడుతూ 'తెలుగులో హీరోగా స్ట్రెయిట్ సినిమా చేయాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. మంచి స్క్రిప్ట్ కోసం చూస్తున్న సమయంలో డైరెక్టర్ శశాంక్ ఈ కథ చెప్పారు. ఇలాంటి మంచి ఫాంటసీ డ్రామా ఎలిమెంట్స్ ఉన్న కథ ద్వారా తెలుగులో సినిమా చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. ప్రేక్షకులకు అద్భుతమైన వినోదాన్ని పంచే సినిమా ఇదని దర్శకుడు శశాంక్ యేలేటి నమ్మకంగా చెప్పారు.

# రావణ్ విషయంలో నేతల యూ టర్న్



**విజయవాడ,(భారత శక్తి)** ఏపీలో ఆసక్తి రేకెత్తించిన జోసెఫ్ రావణ్ అలియాస్ ప్రశ్న రావణ్ వ్యవహారంపై కొత్త కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. జనసేన అదినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై అసభ్య పదజాలాన్ని ప్రయోగించిన కేసులో అరెస్టు అయిన రావణ్ కు న్యాయ సహాయం చేసిన ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ కుమార్? తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ప్రశ్న రావణ్ తో తనకు అంతగా సంబంధాలేమీ లేవని చెప్పిన శ్రావణ్? రావణ్ కు అతడి కుటుంబం నుంచి కూడా పెద్దగా మద్దతు లేదని సంచలన వ్యాఖ్య చేశారు. రావణ్ వ్యవహారంలో విపక్ష వైసీపీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని కూడా శ్రావణ్ ఆరోపించారు.ప్రశ్న రావణ్ తో తనకు పెద్దగా స్నేహమే లేదని శ్రావణ్ తెలిపారు. ఆకివీడు వ్యవహారంలోనే తనకు రావణ్ తో పరిచయం అయ్యిందని, ఆ తర్వాత తన ఇంటర్వ్యూ కోసం రావణ్ తనను సంప్రదించారని తెలిపారు. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా కేవలం ఒకటి రెండు సార్లు మాత్రమే తాను రావణ్ తో ఫోన్ లో మాట్లాడానని ఆయన తెలిపారు. అంతకుమించి రావణ్ తో తనకు ప్రత్యక్ష సంబంధాలేమీ లేవని కూడా ఆయన పేర్కొనడం గమనార్హం. ఇక ఓ బాధ్యత కలిగిన సామాజిక వేత్తగా, న్యాయవాదిగా మాత్రమే తాను రావణ్ కేసులను వాదించానని, అంతకుమించి రావణ్ తో తనకు మైత్రి లేదని ఆయన తేల్చేశారు.ఇక రావణ్ ఓ రేంజిలో ఎలివేట్ కావడానికి దారి తీసిన ఏలూరు బహిరంగ సభలో అంతా తన ప్రమేయం లేకుండానే జరిగిపోయిందని శ్రావణ్ పేర్కొన్నారు. ఆ సభలో వేదిక మీదకు వచ్చేవారిలో రావణ్ పేరే లేదని ఆయన అన్నారు. ఆహ్వానితుల జాబితాలో పేరు లేకున్నా.. సభ నిర్వాహకుడిగా ఉన్న తన అనుమతి లేకుండానే రావణ్ వేదిక మీదకు వచ్చారని, అంతేకాకుండా తనకంటే ముందుగానే తన అనుమతి లేకుండా రావణ్ మైకందుకుని మరీ ప్రసంగించారని ఆయన ఆరోపించారు. అయితే వేడిపై శ్రవణ్ అన్న రమ్మంటేనే వచ్చానని రావణ్ మాట్లాడడం గమనార్హం. రావణ్ చేసిన ఘాటు వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కూడా ఆయన తేల్చేశారు. తాను నిర్వహించిన సభలో తన అనుమతి లేకుండా మాట్లాడిన రావణ్ అరెస్టు అయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ మాటలు చూస్తుంటే జడ శ్రవణ్ ఈ కేసు నుండి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇక రావణ్ కు వైసీపీ మద్దతు పలుకుతున్న వైనంపైనా శ్రావణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అదికార కూటమికి చెందిన కీలక నేతలపై పరుష పదజాలంతో విరుచుకుపడుతున్న ప్రతి ఒక్కరికి వైసీపీ నుంచి మద్దతు లభిస్తోందని ఆయన అన్నారు. అందులో భాగంగానే రావణ్ కు వైసీపీ నుంచి మద్దతు లభించిందని ఆయన అన్నారు. అయితే రావణ్ హిందూ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిన తర్వాత వైసీపీ అతడి నుంచి దూరం జరగాలని భావించిందని, అయితే అది అంత ఈజీ కాదన్న విషయం తెలుసుకుని వైసీపీ నేతలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. తనకు మాత్రం వైసీపీ నుంచి ఎలాంటి మద్దతు లేదని ఆయన అన్నారు. ఎంగిలి మెతుకులనూ విదల్చని మాదిరిగా వ్యవహరిస్తున్న వైసీపీ నుంచి తనకు ఎలాంటి సాయం అవసరం లేదని కూడా ఆయన ఘాటు వ్యాఖ్య చేశారు.ఇక రావణ్ వ్యవహారంలో పరిమితికి మించి స్పందిస్తున్న ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ వ్యవహారంపైనా శ్రావణ్ స్పందించారు. రావణ్, ప్రకాశ్ రాజ్ ల మధ్య చాలా కాలం నుంచే పరిచయం ఉన్నట్టుందని ఆయన వ్యాఖ్యానించారు. రావణ్ గురించి మాట్లాడేందుకే ప్రకాశ్ రాజ్ తనకు పలుమార్లు కాల్ చేశారని ఆయన చెప్పారు. ఇక రావణ్ కు అతడి కుటుంబం నుంచి ఎలాంటి మద్దతు లేదని చెప్పారు. రావణ్ కు న్యాయ సహకారంతో పాటుగా ఇతరత్రా సాయాన్ని కూడా తానే చేస్తున్నానని తెలిపారు. రావణ్ కు అన్నీ తానై సాయం చేస్తుంటే? అతడి బృందంలోని గమన అనే యువతి వైసీపీ అదినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన తీరుపై శ్రావణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

**దారిలోకి వచ్చిన ఎబీవీ** రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీవీ వెంకటేశ్వరరావు గత వైసీపీ పాలనలో ఎదుర్కొన్న ఇబ్బందులు తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే ఆయన పదవీ విరమణ చేశారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై పలు సందర్భాల్లో తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ వస్తున్నారు. గతంలో కూటమి ప్రభుత్వానికి సూచనలు చేసిన సందర్భాల్లోనూ ఆయన విమర్శలు ఎదుర్కొన్నారు.తాజాగా ఉపా చట్టం (యూఏపీఏ) వినియోగంపై తన అభిప్రాయాన్ని వెల్లడించిన ఏబీవీ, ఒక కార్యక్రమంలో మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుతో వేదికను పంచుకోవడంపై వస్తున్న విమర్శలకు స్పందించారు. ఆ వేదికపై అంబటి రాంబాబు ఏమి మాట్లాడారో తాను వినలేదని, ఆయన పక్కన కూర్చున్నాననే కారణంతో సభ మధ్యలో లేచి వెళ్లిపోవడం సభా మర్యాద కాదని చెప్పారు."మీ అందరితో హీరో అనిపించుకోవడం కోసం నేను సంస్కారం వదిలేయాలా? మీరు నా గురించి పొరబడ్డారు. నేనలాంటి వాడిని కాదు" అంటూ ఏబీవీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. గతంలో జగన్ ప్రభుత్వం మాట్లాడే స్వేచ్ఛ ఇవ్వలేదని, ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరించాలనుకుంటుందా? అని ప్రశ్నించారు.ఇంతకుముందు అమరావతి భూసేకరణ అంశంపైనా ఏబీవీ స్పందించారు. రెండో విడతలో వేలాది ఎకరాల భూమిని సేకరించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులు రోడ్డెక్కే పరిస్థితి వస్తే ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం కష్టమవుతుందని హెచ్చరించారు. అలాగే అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయకపోతే కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసినట్టేనని వ్యాఖ్యానించారు.అలాగే జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' అంశాన్ని కూడా తేలికగా తీసుకోవద్దని సూచించారు. యూట్యూబ్ వ్యాఖ్యలపై ఉపా చట్టాన్ని ప్రయోగించే విషయంలో రాజద్రోహం కేసు అవసరం లేదని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. దీంతో కూటమి కార్యకర్తల నుంచి విమర్శలు రావడంతో, తాను చేస్తున్న వ్యాఖ్యలను సద్విమర్శలుగా స్వీకరించాలని ఏబీవీ కోరుతున్నారు. ఈ నేపథ్యంలో వరుస పోస్టులు చేస్తూ తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు.

# మార్చిలోనే పోలవరం ప్రారంభం

**ఏలూరు,(భారత శక్తి)** పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమాచారం వెల్లడించారు. ప్రస్తుతం 89 శాతం మేర పనులు జరిగాయని, గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా ప్రాజెక్టు పూర్తవుతుందని, ఆ తర్వాత జాతికి అంకితం చేస్తామని సీఎం పేర్కొన్నారు. గోదావరి జిల్లాల పర్యటన సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజి వద్ద జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ పునరుద్ధరణ, పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమైన సమాచారాన్ని సీఎం పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలవరం పనులు 89 శాతం పూర్తయ్యాయని సీఎం చంద్రబాబు వివరించారు. రెండేళ్లలోనే పనులు పరుగులు పెట్టించామని వ్యాఖ్యానించారు. 2014-19 మధ్య పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే చేసి చేతులెత్తేసిందని విమర్శించారు. 2019లో టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తి చేసేవారమని సీఎం వ్యాఖ్యానించారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసి వచ్చే మార్చిలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం హామీ ఇచ్చారుఇక ధవళేశ్వరం పర్యటన తర్వాత సీఎం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ముందుగా హెలికాప్టర్ నుంచి గోదావరి ప్రవాహం, ఎగువ దిగువ కాఫర్ డ్యాం పనులను చూశారు. అనంతరం ప్రాజెక్టులోని ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం గ్యాప్ 1, గ్యాప్ 2 నిర్మాణాలను విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేసేలా సిబ్బంది పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా, కూటమి ప్రధాన ఎన్నికల హామీ అయిన పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే పూర్తి చేస్తామనే పట్టుదల ప్రభుత్వంలో కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. గత రెండేళ్లలో సుమారు 24 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్న ప్రభుత్వం పోలవరం పూర్తికి అధిక ప్రాధాన్యమిస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం స్పిల్ వేతోపాటు ఈసీఎఫ్ఆర్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు పూర్తయ్యాయని చెబుతున్నారు. ఇంకా జల విద్యుత్ కేంద్రం నిర్మాణాలు మాత్రమే పెండింగులో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం పూర్తయిన పనులతో కాలువలకు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సిద్ధం చేశాకే ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోందని చెబుతున్నారు. దీంతో వచ్చే ఖరీఫ్ నాటికి పోలవరం అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

# జనసేన విస్తరణకు పక్కా ప్లాన్

## - బూత్ కమిటీలతో రెడీ అవుతున్న కేడర్

**కాకినాడ(భారత శక్తి),** జనసేన పార్టీని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలనే వ్యూహానికి పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా పార్టీని పోలింగు బూతు స్థాయిలో బలపేతం చేయాలనే నిర్ణయానికి వచ్చారని అంటున్నారు. 2014లో పార్టీ ప్రారంభించిన నుంచి జనసేనాని సెంట్రిక్ గానే పార్టీ కార్యకలాపాలు నడిచాయి. మధ్యలో కొందరు కార్యకర్తలు పార్టీలో చేరిన క్షేత్రస్థాయిలో పార్టీ విస్తరణపై ఇప్పటివరకు ఫోకస్ చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి ఆదరణ ఉన్నప్పటికీ పోలింగు బూతు స్థాయిలో ఓటర్లను సమన్వయం చేసే కేడర్ లేక జనసేన బలం కొంతవరకే పరిమితం అన్న అంచనాలు ఏర్పడ్డాయి. దీంతో పవన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మరికొద్ది రోజుల్లో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జనసేన పార్టీకి పోలింగు బూతు లెవల్ లో కమిటీలు వేయాలని పవన్ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో వాటా పొందుతోంది. స్థానిక ఎన్నికల్లో కూడా జనసేనకు ప్రాతినిధ్యం పెరగాలని, క్షేత్రస్థాయి కార్యకర్తలకు స్థానికంగా గౌరవం దక్కాలంటే స్థానిక ఎన్నికల్లో గెలవడం అత్యావసరమని జనసేనాని భావిస్తున్నారని అంటున్నారు. దీంతో ఇటీవల పార్టీలో చేరికల కమిటీని నియమించడంతోపాటు పార్టీలో తొలి నుంచి కష్టపడిన కార్యకర్తలను గుర్తించేందుకు మరో కమిటీని నియమించారు. ఈ విధంగా పార్టీని బలోపేతం చేయడానికి పవన్ దశలవారీగా చర్యలు తీసుకుంటుండటం రాజకీయంగా చర్చనీయాంశం అవుతోంది. జనసేన పార్టీ స్థాపించి ఇప్పటికి 12 ఏళ్లు అవుతోంది. ఈ పుష్కర కాలంలో పార్టీ విస్తరణపై పవన్ ఎప్పుడు ఇంతలా దృష్టి పెట్టలేదని అంటున్నారు. దీంతో వచ్చే మూడు నెలలో జనసేన పార్టీ భవిష్యత్తు కీలక మలుపు తీసుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకుంది. ఇంకా మరో మూడేళ్లు పదవీ కాలం ఉండటం, స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండే అంచనాలు వ్యక్తమవుతుండటంతో జనసేనాని వ్యూహం సత్ఫలితాలు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారుఈ నేపథ్యంలో జనసేన కేడర్ లో జోష్ కనిపిస్తోంది. అదే సమయంలో ఇతర పార్టీల నుంచి పదవుల ఆశతో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు జనసేనలో చేరే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తంగా జనసేనాని వ్యూహానికి తగినట్లు పార్టీని రాష్ట్రంలో 175 నియోజకవర్గాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. స్థానిక ఎన్నికల లోగా 175 నియోజకవర్గాల్లోనూ బూత్ కమిటీలు నియమించాలనే లక్ష్యంతో జనసేన నేతలు పావులు కదుపుతున్నారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ బూతు కమిటీలే పార్టీకి కీలకంగా మారే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఈ పరిణామం ఒక విధంగా విపక్షంతోపాటు కూటమిలోని ప్రధాన పార్టీలు అప్రమత్తం అవ్వాల్సిన పరిస్థితులు సూచిస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు

# వ్యూహం మార్చుకుంటున్న వైసీపీ?

## - ఐ ప్యాక్ స్థానంలో కపిల్ సాహు

**విజయవాడ,(భారత శక్తి)** 2029 అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్న విపక్ష వైసీపీ 'సరికొత్త వ్యూహం'తో ముందుకు వస్తుందా? అన్న చర్చ జరుగుతోంది. కూటమిలోని మూడు పార్టీలు మళ్లీ కలిసికట్టుగా పోటీ అంటుండటంతో తమ గెలుపునకు సరైన వ్యూహం అవసరమని వైసీపీ గుర్తించిందని చెబుతున్నారు. దీంతో కొత్త రాజకీయ ఎత్తుగడతో ప్రజల ముందుకు రావాలనే ఆలోచనకు ఆ పార్టీ అధిష్టానం వచ్చిందని చెబుతున్నారు. ప్రధానంగా పార్టీకి ఇప్పటివరకు రాజకీయ వ్యూహాలు అందిస్తున్న 'ఐ-ప్యాక్'ను వదిలించుకోవాలని నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐ ప్యాక్ స్థానంలో తమిళనాడులోని టీవీకే పార్టీకి వ్యూహకర్తగా పనిచేసిన కపిల్ సాహును వ్యూహకర్తగా నియమించుకోవాలని వైసీపీ భావిస్తోందని చెబుతున్నారు. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు వైసీపీ సన్నాహాలు మొదలుపెట్టినట్లేనని అంటున్నారు రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర ఓటమి ఎదుర్కొన్న వైసీపీ మూడేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇందుకోసం అనేక వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఇందులో ప్రధానమైనది పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాదయాత్ర ఒకటి అయితే, రెండోది పార్టీకి సరైన ఎన్నికల వ్యూహాలు అందించే బృందంగా భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ సలహాలు, సూచనలతో రికార్డు విజయాన్ని సొంతం చేసుకున్న వైసీపీ.. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిషోర్ బృందంలోని రిషిరాజ్ సింగ్ వ్యూహాలతో బోల్తా కొట్టింది. అయితే ఈ సారి తమిళనాడులో టీవీకే పార్టీని అధికారంలోకి తీసుకువచ్చిన కపిల్ సాహు వైపు చూస్తోందని కొద్దిరోజులుగా విస్తృత ప్రచారం జరుగుతోంది.ప్రశాంత్ కిషోర్ బృందానికే చెందిన కపిల్ సాహు ప్రస్తుతం సొంతంగా పనిచేస్తున్నట్లు చెబుతున్నారు.

ప్రధానంగా డిజిటల్ ప్రచారంలో కపిల్ సాహుకు మంచి గుర్తింపు ఉందని చెబుతున్నారు. తమిళనాడులో టీవీకే పార్టీకి రాజకీయ వ్యూహాలు అందించిన కపిల్ సాహు సైలెంట్ గా టార్గెట్ ను కొట్టడమే హాట్ టాపిక్ అవుతోంది. ఎన్నికలకు ముందు ఎటువంటి అంచనాలు లేని టీవీకేని ఏకంగా ప్రభుత్వంలోకి తీసుకురావడానికి కపిల్ సాహు వ్యూహాలు బాగా పనికొచ్చాయని చెబుతున్నారు. రెండు బలమైన ప్రాంతీయ పార్టీలను మట్టి కరిపించి టీవీకేను ఓటర్లకు చేరువ చేయడంలో కపిల్ సాహు సక్సెస్ అయ్యారని అంటున్నారు. ఇదే అంశం వైసీపీని ఆకర్షిస్తోందని అంటున్నారు. కూటమి పార్టీలు కలిసి వుంటే ఓట్లు చీలడం కష్టమనే అభిప్రాయంతో ఉన్న వైసీపీ.. కూటమికి విరుగుడుగా వ్యూహాలు రచించే సరైన స్ట్రాటజిస్టు కోసం అన్వేషిస్తున్న క్రమంలో కపిల్ సాహు పేరు తెరపైకి వచ్చిందని అంటున్నారు. దీంతో ఆయనతో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయని చెబుతున్నారు. కపిల్ సాహుతో ఒప్పందం కుదిరితే రిషిరాజ్ సింగ్ కు చెందిన ఐ-ప్యాక్ స్థానంలో కపిల్ సాహు సెల్ఫ్-ఎంప్లాయిడ్ బృందం తెరపైకి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. కాగా, వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తలపైనే ఆధారపడాలా? అన్న ప్రశ్న పార్టీలో విస్తృతంగా వినిపిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీకి మరమ్మతులు చేయకుండా ఏం చేసినా ఉపయోగం లేదనే వాదన బలంగానే వ్యక్తమవుతోందని చెబుతున్నారు.

# పసిమొగ్గపై లైంగిక దాడి

**బెంగాల్,(భారత శక్తి)** పశ్చిమ బెంగాల్‌లోని మేదినీపూర్ జిల్లాలో పసిమొగ్గపై జరిగిన లైంగిక దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల అమాయక చిన్నారిపై పాఠశాల ఆవరణలోనే బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ దారుణానికి ఒడిగట్టాడు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్వయంగా స్కూల్ ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు ప్రయత్నించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.!పశ్చిమ బెంగాల్‌లోని మేదినీపూర్ జిల్లాలో పసిమొగ్గపై జరిగిన లైంగిక దాడి ఉదంతం తీవ్ర కలకలం రేపుతోంది. ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల అమాయక చిన్నారిపై పాఠశాల ఆవరణలోనే బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ దారుణానికి ఒడిగట్టాడు. ఈ దారుణాన్ని కప్పిపుచ్చేందుకు స్వయంగా స్కూల్ ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు ప్రయత్నించడంపై స్థానికంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. ఆరేళ్ల చిన్నారి ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్ళింది.

స్కూల్ ముగిసిన తర్వాత తల్లి ఆమెను ఇంటికి తీసుకురావడానికి వెళ్లినప్పుడు, ఆ చిన్నారి తీవ్ర భయాందోళనలతో కలత చెంది కనిపించింది. ఇంటికి వచ్చిన తర్వాత భయపడుతూనే పాఠశాలలో జరిగిన ఘోరాన్ని తల్లిదండ్రులకు వివరించింది. తాను టాయిలెట్‌కు వెళ్లిన సమయంలో బాయ్స్ టాయిలెట్ అటెండెంట్ తలుపు లోపల గడియ పెట్టి, బాలుడిపై లైంగిక దాడికి పాల్పడ్డాడని చెప్పింది. ఆ సమయంలో నిందితుడి స్నేహితుడు వచ్చి బయటి నుండి తలుపు తట్టడంతో నిందితుడు చిన్నారిని వదిలేశాడు. లేకపోతే ఊపిరాడక స్పృహ కోల్పోయే స్థితికి ఆ చిన్నారి చేరుకుండేదని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఈ దారుణంపై చిన్నారి తల్లిదండ్రులు వెంటనే పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. అయితే, బాధితులకు న్యాయం చేయాల్సిన ప్రిన్సిపాల్.. నిందితుడిని సమర్థించే ప్రయత్నం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పాఠశాల పరువు పోతుందని బెదిరిస్తూ, వారిని కూడా ఫిర్యాదు చేయకుండా అడ్డుకున్నారు. పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ నిర్లక్ష్యపూరిత చర్యపై ఇతర విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. స్కూల్ ఎదుట ఆందోళన తీవ్రం కావడంతో చివరికి పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వచ్చింది.బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, తక్షణమే అతడిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ పాపియా సుల్తానా స్పందిస్తూ.. బాధితురాలి వయసు, సున్నితత్వాన్ని పరిగణనలోకి తీసుకుని మరిన్ని వివరాలను గోప్యంగా ఉంచుతున్నామని, తక్షణమే కఠిన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. మరోవైపు, నిందితుడిని కాపాడటానికి ప్రయత్నించిన ప్రిన్సిపాల్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలని, బాధితులను హేళన చేస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన తోటి ఉపాధ్యాయులను కూడా సస్పెండ్ చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో విద్యార్థుల భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

# జొన్నగిరి గోల్డ్ మైన్స్ విస్తరణ..

**కర్నూలు,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామిక మరియు గనుల రంగాన్ని బలోపేతం చేసే దిశగా ఒక కీలక నిర్ణయం తీసుకుందికర్నూలు జిల్లాలోని ప్రసిద్ధ 'జొన్నగిరి గోల్డ్ మైన్స్'బంగారు గనులు) ప్రాజెక్టు విస్తరణకు ప్రభుత్వం భారీగా భూములను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు కోసం అదనంగా మరో 998 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసింది. ఈ భూసేకరణలో భాగంగా ఏపీ దేవాదాయ శాఖకు చెందిన భూములను కూడా వినియోగించుకోనున్నారు.దేవాదాయ శాఖ పరిధిలోని సుమారు 40 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్ట్ కోసం ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన లీజు నిబంధనలు మరియు ప్రక్రియను పూర్తి చేస్తూ ఏపీ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను విడుదల చేసింది. ఈ గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు విస్తరణ ద్వారా రాయల్టీ మరియు పన్నుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరనుంది.అంతేకాకుండా, ఈ మైనింగ్ పనులు పూర్తిస్థాయిలో ఊపందుకుంటే కర్నూలు జిల్లా పరిసర ప్రాంతాల్లోని వందలాది మంది స్థానిక యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వెనుకబడిన ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధికి కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. బంగారు గనుల తవ్వకం మరియు ప్రాజెక్ట్ పనులను మరింత వేగవంతం చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది. భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, ప్రాజెక్టు విస్తరణకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జొన్నగిరి గోల్డ్ మైన్స్ పనులు మరింత వేగంగా ముందుకు సాగనున్నాయి.

# టీడీపీలో భారీ మార్పులు



**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార కూటమి పరిపాలనలో దూసుకుపోతున్న తరుణంలో, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ అంతర్గత బలోపేతంపై అత్యంత కీలకమైన వ్యూహాత్మక కసరత్తును ప్రారంభించారు. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు ఒక భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందులో భాగంగా చాలా మంది సీనియర్లను, యాక్టివ్‌గా లేని నాయకులను పక్కన పెట్టేసి, కొత్త ముఖాలకు, యువ నాయకత్వానికి పెద్దపీట వేయాలని టీడీపీ అధిష్టానం డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీకి సొంత ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాలపై టీడీపీ అధిష్టానం ఇప్పుడు ప్రత్యేక దృష్టి సారించింది. గత ఎన్నికల్లో కొన్ని సమీకరణాల వల్ల వెనుకబడిన ప్రాంతాలు లేదా ఇన్‌ఛార్జ్‌లు సరిగ్గా పని చేయని చోట్ల గ్రౌండ్ లెవెల్ రిపోర్ట్ తెప్పించుకుంటున్నారు. కేవలం పేరుకే ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటూ, క్యాడర్‌ను పట్టించుకోని వారిని మార్చేయాలని చంద్రబాబు గట్టిగా ఉన్నారట. అక్కడ సమర్థులైన, ప్రజల్లో నిరంతరం ఉండే కొత్త నాయకులను ఎంపిక చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. ప్రారంభించిన సీఎం చంద్రబాబుఇక ఈ సమీక్షల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపైనా టీడీపీ అంతర్గతంగా సమీక్షలు నిర్వహిస్తోంది. కూటమి ధర్మం ప్రకారం ఆయా స్థానాలు మిత్రపక్షాలకే ఉన్నప్పటికీ, అక్కడ టీడీపీ ఓటు బ్యాంక్ చెల్లాచెదురు కాకుండా చూసుకోవడం, క్యాడర్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యవసరం అని భావిస్తున్నారు. భవిష్యత్తు రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, మిత్రపక్షాల స్థానాల్లో కూడా టీడీపీ బలాన్ని తగ్గకుండా చూసుకునేందుకు అంతర్గత సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు.మరోవైపు, గత ఎన్నికల్లో వైసీపీ గెలుచుకున్న ఆ 11 నియోజకవర్గాలపై టీడీపీ టాప్ ప్రయారిటీ పెట్టింది. ఆ 11 స్థానాల్లో వైసీపీని పూర్తిగా ఖాళీ చేయడమే లక్ష్యంగా కసరత్తు జరుగుతోంది. అక్కడ పార్టీ ఎందుకు ఓడిపోయింది? ఎక్కడ లోపాలు జరిగాయి? అనే విషయాలపై ప్రత్యేక నివేదికలు తెప్పించుకున్నారు. ఆ నియోజకవర్గాల్లో ప్రస్తుత ఇన్‌ఛార్జ్‌ల పనితీరును బేరీజు వేస్తున్నారు. ఒకవేళ వారి వల్ల పార్టీ పుంజుకునే అవకాశం లేదని తేలితే, క్షణం కూడా ఆలోచించకుండా వారిని పక్కన పెట్టి.. ఆర్థికంగా, అంగబలం పరంగా, ప్రజల్లో క్రేజ్ ఉన్న సరికొత్త సమర్థ నాయకులను రంగంలోకి దించేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.ఇక అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈసారి సమీక్షల్లో కేవలం "పనితీరు" మాత్రమే ఏకైక ప్రామాణికం అని చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎంతటి సీనియర్ నాయకుడైనా, గతంలో ఎంత పెద్ద పదవి అనుభవించినా సరే.. ఇప్పుడు క్షేత్రస్థాయిలో యాక్టివ్‌గా లేకపోతే, సమన్వయ కమిటీలు సరిగ్గా నడపకపోతే వారిని తప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. చాలా మంది పాత తరం నేతలను పక్కన పెట్టేసి, కొత్త వారికి, యువతకు ఛాన్స్ ఇవ్వాలనే గట్టి ఆలోచనలో అధిష్టానం ఉంది.

# మాజీ మంత్రి ఓటు గల్లంతు

**గుంటూరు,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్న వేళ మాజీ మంత్రి ఓటే గల్లంతు కావడం చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి డాక్టర్ శనక్కాయల అరుణకుమారి పేరు గుంటూరు నగర ఓటరు జాబితాలో కనిపించకపోవడంతో ఆమె అధికారులను ఆశ్రయించారు. ఒక మాజీ మంత్రి ఓటే లేకపోతే సామాన్య ఓటర్ల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ఓటరు జాబితాలో తన పేరు లేదని ఎన్నికల అధికారులు చెప్పడంతో అరుణకుమారి ఆశ్చర్యానికి గురయ్యారు. అనంతరం గుంటూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తన ఓటును పునరుద్ధరించాలని కోరారు.డాక్టర్ శనక్కాయల అరుణకుమారి 1999 నుంచి 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రెండో మంత్రివర్గంలో ఆమెకు మంత్రి పదవి దక్కింది.ఇదిలా ఉండగా, కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముగింపు దశకు చేరుకుంది. ఇంటింటి సర్వే, డిజిటలైజేషన్ ప్రక్రియకు జూలై 14 చివరి గడువుగా నిర్ణయించారు. మరణించినవారు, వేరే ప్రాంతాలకు వెళ్లినవారు, డూప్లికేట్ ఓట్లను తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ ప్రక్రియ లక్ష్యం.చివరి రెండు రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో అధికారులు సవరణ పనుల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు తమ పేర్లు జాబితాలో ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు ప్రజలు హెల్ప్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారు. ఇలాంటి సమయంలో మాజీ మంత్రి ఓటు గల్లంతు కావడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

# శంషాబాద్‌కు మరో గుర్తింపు

**హైదరాబాద్,(భారత శక్తి)** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు (శంషాబాద్ విమానాశ్రయం) మరో అంతర్జాతీయ గుర్తింపును సొంతం చేసుకుంది. ఫ్యామిలీలతో ప్రయాణించే వారికి అత్యంత అనుకూలమైన విమానాశ్రయాల జాబితాలో ప్రపంచవ్యాప్తంగా నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. బ్రిటన్‌కు చెందిన ప్రముఖ ట్రావెల్ సంస్థ ఀబిబితీజీఇ-బితినీనితిఇ-ఎవబిబ.ఇనీఎ నిర్వహించిన 'హ్యాపియెస్ట్ ఎయిర్‌పోర్ట్స్ ర్యాంకింగ్స్'లో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఈ ఘనతను సాధించింది. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న భారతదేశంలోని 2 విమానాశ్రయాల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఒకటిగా నిలవడం విశేషం.ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన సర్వేలో ప్రపంచవ్యాప్తంగా 140కుపైగా విమానాశ్రయాలను ట్రావెల్ సంస్థ పరిశీలించింది. ప్రధానంగా కుటుంబ సభ్యులతో ప్రయాణించే వారికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులను ప్రకటించారు. పిల్లల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, బేబీ చేంజింగ్ సదుపాయాలు, ఫ్యామిలీ సెక్యూరిటీ లేన్లు, స్ట్రోలర్ సేవలు, విశ్రాంతి ప్రాంతాలు, ఉచిత వై ఫై, ప్రయాణికుల భద్రత, విమానాశ్రయ విస్తీర్ణం, గూగుల్ సమీక్షలు, ప్రత్యేక అవసరాలున్న ప్రయాణికులకు అందిస్తున్న సేవలు వంటి మొత్తం 9 ప్రమాణాల ఆధారంగా ప్రతీ ఎయిర్‌పోర్టును అంచనా వేశారు.ఈ పరిశీలనలో హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు 20 పాయింట్లకు గాను 18.5 పాయింట్లు సాధించి ప్రపంచంలోనే నాలుగో అత్యుత్తమ ఫ్యామిలీ ఫ్రెండ్లీ ఎయిర్‌పోర్ట్‌గా గుర్తింపు పొందింది. ప్రయాణికుల సౌకర్యాలు, ఆధునిక మౌలిక వసతులు, అందరికీ అందుబాటులో ఉండే సేవలు ఈ విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.ఈ సందర్భంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు సాధించిన ఘనతపై జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈవో కదీర్ కదిరవన్ స్పందించారు. ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, సమగ్ర సేవలు అందించాలనే తమ లక్ష్యానికి ఈ గుర్తింపు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రయాణ అనుభవాన్ని నిత్యం మెరుగుపరుస్తూ ప్రపంచ స్థాయి ప్రమాణాలను కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన వెల్లడించారు.

## ధర్మపురి పోలీసులకు ప్రశంసా పత్రాలు



జగిత్యాల, జూలై 14 (భారత శక్తి ప్రతినిధి): జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ కె. పురుషోత్తం రెడ్డి ధర్మపురి పోలీస్ స్టేషన్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సీఐ ఎ. రాం నర్సింహారెడ్డి, దొంగతనం కేసును 24 గంటల్లో ఛేదించిన ఎస్సై జి. మహేష్, సిబ్బంది ఏ. సంజీవ్, ఎం.డి. ఆరిఫ్, అంతర్ రాష్ట్ర నిందితుడిని ఒడిశా నుంచి పట్టుకొచ్చిన ఎస్సై-2 ఎం. రవీందర్, సిబ్బంది కె. కిరణ్, పి. రణధీర్‌లను వారు అభినందించి ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ కె. పురుషోత్తం రెడ్డి ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలనలో ఇదే స్ఫూర్తితో మరింత సమర్ధవంతంగా పనిచేయాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

### ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్‌లో

# తెలంగాణకు పెద్దపీట

- జాతీయ కార్యదర్శిగా వక్కలంక శ్రీనివాసరావు
- జాతీయ ఉపాధ్యక్షుడిగా చింతపల్లి మంగపతిరావు నియామకం
- నేషనల్ సెక్రటరీ జనరల్ ద్రోణంరాజు రవికుమార్ వెల్లడి




హైదరాబాద్: జూలై 14 భారతశక్తి, ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ (ఏ ఐ బి ఎఫ్ ) సంస్థాగత బలోపేతం, దేశవ్యాప్తంగా బ్రాహ్మణుల సంక్షేమం లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన సీనియర్ బ్రాహ్మణ నాయకులకు జాతీయ కార్యవర్గంలో కీలక బాధ్యతలు అప్పగించినట్లు ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ నేషనల్ సెక్రటరీ జనరల్ ద్రోణంరాజు రవికుమార్ ప్రకటించారు. ఇటీవల జైపూర్‌లో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు, జాతీయ అధ్యక్షులు ఎస్ డి శర్మ అనుమతితో... వక్కలంక శ్రీనివాసరావును జాతీయ కార్యదర్శిగా చింతపల్లి మంగపతిరావును జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఏబి6 న్యూస్ ఛానల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు రవికుమార్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న రాజకీయ, సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ ఉద్యమాత్మకంగా పనిచేస్తుందని తెలిపారు. అలాగే విద్యా రంగంలో జుబొా చట్ట సవరణ వల్ల వస్తున్న ఇబ్బందుల నుండి బ్రాహ్మణ విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యా విధానాలకు సంబంధించిన అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి అవసరమైన చర్యలు చేపట్టేందుకు జాతీయ కార్యవర్గం నిర్ణయించినట్లు వెల్లడించారు. బ్రాహ్మణుల విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, వ్యాపారాభివృద్ధికి తోడ్పడే విధంగా రూ.25 వేల కోట్ల జాతీయ బ్రాహ్మణ సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా బ్రాహ్మణుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో నిరంతర చర్చలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే నవంబర్ 14, 15 తేదీలలో హైదరాబాద్ వేదికగా ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశాల విజయవంతానికి తెలంగాణతో పాటు అన్ని రాష్ట్రాల బ్రాహ్మణ సంఘాలు, సంస్థలు సహకరించాలని పిలుపునిచ్చారు. తమపై విశ్వాసం ఉంచి జాతీయ స్థాయి బాధ్యతలు అప్పగించిన ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ నాయకత్వానికి జాతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, జాతీయ ఉపాధ్యక్షుడు చింతపల్లి మంగపతిరావు కృతజ్ఞతలు తెలియజేస్తూ, బ్రాహ్మణ సమాజ అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కోశాధికారి తిప్పావఝల నారాయణశర్మ, ఏబి6 న్యూస్ ఛానల్ అధినేత విష్ణుకాంత్ శ్రీకాంత్, జాతీయ కార్యదర్శి వారణాసి వంశీ, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ, ప్రముఖ బ్రాహ్మణ నాయకుడు దుడ్డు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు

## మార్కెట్లను పరిశుభ్రంగా ఉంచడం మా బాధ్యత..

ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా అవగాహన కలిపిస్తాం

గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి వెల్లడి.



ఎల్ బీ నగర్ జూలై 14 (భారత శక్తి ): మార్కెట్ యార్డులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని, మార్కెట్ కి వచ్చే రైతులకు,వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం నుండి సాయంత్రం వరకు గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కూరగాయల మార్కెట్ ను దాదాపు పూర్తి స్థాయిలో శుభ్రం చేయడం జరిగింది. వర్షాకాలం ప్రారంభం దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరక్టర్లు బండి మధుసూదన్ రావు, మెగావత్ గణేష్ నాయక్, చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి, నాయకులు నవీన్, శేఖర్, సాయి,భార్గవ్ అనీల్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాలు, మత్తు పదార్థ అక్రమ రవాణాలను నిర్మూలించాలి

## - ఎస్పీ కేకాన్ సుధీర్ రామ్ నాథ్




ములుగు జిల్లా ప్రతినిధి, జులై 14 (భారత శక్తి) : ప్రధానంగా దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలన, కల్తీ మద్యం, గుడుంబా తయారీ, రోడ్డు ప్రమాదాలు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రించాలని మంగళవారం పోలీసు అధికారులతో ఏర్పాటు చేసిన అర్ధవార్షిక నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ తెలిపారు. దొంగతనాల నియంత్రణ కు ప్రస్తుతం నిర్వహిస్తున్న గస్తీ విధులు పెంచాలని ఎస్పీ అధికారులను జాతీయ రహదారినీ ఆనుకొని ఉన్న గ్రామాలలో గస్తీ పెంచాలని అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణకు మారుమూల గ్రామాలలో సైతం సిసి కెమెరాల యొక్క ఉపయోగాలు తెలియచేస్తూ, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ సీసీ కెమెరాలను పెట్టించేలా కృషి చేయాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు గ్రామస్థాయిలో బలమైన సమాచార వ్యవస్థ (ఇన్ఫార్మర్ నెట్వర్క్) ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా క్రమం తప్పకుండా వాహనాల తనిఖీలు నిర్వహించి గంజాయి రవాణాను అడ్డుకోవాలని, యువత గంజాయి వినియోగానికి అలవాటు పడుతున్న ప్రాంతాలను (హాట్‌స్పాట్స్) గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. అర్రి అలీ వ్ కార్యక్రమం లో భాగంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. మైనర్ డ్రైవింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. మైనర్లకు డ్రైవింగ్ ఇవ్వకుండా తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసులలో బాధితులకు నష్టపరిహారం అందేలా కృషి చేయాలని ఆదేశించారు. మద్యం కల్తీ చేసే వారిపై, గుడుంబా తయారీ దారులపై కఠిన వైఖరి ప్రదర్శించాలని ఆదేశించారు. గ్రామస్తుల భాగస్వామ్యంతో గుడుంబా రహిత గ్రామాలు గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కోర్టు విచారణలలో ఉన్న కేసుల పురోగతిపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కోర్టు కానిస్టేబుల్ ల పనితీరును నిత్యం పర్యవేక్షించాలని, సరైన సాక్ష్యాధారాలను, సాక్షులను సరైన సమయంలో కోర్టులలో ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని, నిరంతరం ఆదేశించారు. అధికారులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా పని చేయాలని సూచించారు. ఎవరైనా అధికారి విధులలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ బట్, అదనపు ఎస్ పి సదానందం, డి సి ఆర్ బి డి ఎస్ పి కిషోర్ కుమార్, డి ఎస్ పి రవీందర్, సిఐలు, ఎస్ఐలు డిసిఆర్బి ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి లోకంపై పోలీసు ఉక్కుపాదం

- ప్రశ్నించే గొంతుకలపై నిర్బంధాల పర్వం!
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన పాలకుల తీరు, రాష్ట్రవ్యాప్తంగా ఏఐవైఎఫ్ నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర

హైదరాబాద్, జూలై 14 (భారత శక్తి ): రాష్ట్రంలో విద్యార్థుల ప్రాథమిక హక్కులను కాలరాస్తూ, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన సంఘాలు శాంతియుతంగా చేపట్టిన ఆందోళనలను భగ్నం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను దారుణంగా దుర్వినియోగం చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. మల్లాపూర్ లోని తన నివాసం వద్ద నాచారం పోలీసులు తనను గృహ నిర్బంధం చేయడాన్ని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఏఐవైఎఫ్ నాయకులను ముందస్తుగా అక్రమ అరెస్టులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

#### - రూ. 10,000 కోట్ల బకాయిలు: అంధకారంలో పది లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు

రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థుల విద్యా హక్కుకు సంబంధించిన దాదాపు పది వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడం విద్యా వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టిందని కల్లూరు ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు.

#### - కళాశాలల ఒత్తిళ్లు - విద్యార్థుల బందీలు:

ప్రభుత్వం నుండి నిధులు రాకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల కోసం తీవ్ర ఒత్తిడి తెస్తున్నాయి.

#### - సర్టిఫికెట్ల నిలిపివేత:

డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల అసలు ధృవీకరణ పత్రాలు, బదిలీ ధృవీకరణ పత్రాలను యాజమాన్యాలు బందీగా ఉంచుకుని వేధిస్తున్నాయి. దీనివల్ల వేలాది మంది యువత ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు మరియు విదేశీ విద్యా అవకాశాలకు దూరమవుతున్నారు.

#### - శాస్త్రీయ విశ్లేషణ: బకాయిల ఆలస్యం - మానవ వనరుల క్షీణతకు నాంది

#### - నిపుణుల శాస్త్రీయ అంచనా:

విద్యా నిధుల విడుదలలో జరిగే ప్రతి ఆరు నెలల ఆలస్యం, పేద విద్యార్థుల ఉన్నత విద్యా ప్రవేశాల శాతాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. సమాజంలో మానవ వనరుల అభివృద్ధి సూచీ మందగించడానికి మరియు నిరుద్యోగ రేటు పెరగడానికి ఇది ప్రత్యక్ష కారణమవుతుంది. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రాథమిక మరియు ఉన్నత విద్యా ప్రమాణాలు దెబ్బతిని, యువత మానసిక ఆందోళనలకు గురవుతున్నారని సామాజిక సర్వేలు స్పష్టం చేస్తున్నాయి.

#### - పాలకుల ప్రయోజనాల కోసం పోలీసుల దుర్వినియోగం?

ఎన్నికల సమయంలో యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధర్మేంద్ర విమర్శించారు. కనీసం తాము ఎక్కడ ఏ ఆందోళన నిర్వహిస్తున్నామో కూడా స్పష్టమైన సమాచారం లేకుండానే, కేవలం అనుమానాలతో ఇళ్ల వద్దే నాయకులను నిర్బంధించడం పోలీసు వ్యవస్థ పనితీరుపై తీవ్ర అనుమానాలను కలిగిస్తోందన్నారు. ప్రజాస్వామ్యబద్ధమైన నిరసనలను అణచివేయడానికి పోలీసులు పాలకుల చేతిలో రాజకీయ సాధనాలుగా మారడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని స్పష్టం చేశారు.




#### 'భారత శక్తి' వేదికగా ఏఐవైఎఫ్ డిమాండ్లు:

- వెంటనే విడుదల: పెండింగ్‌లో ఉన్న రూ. 10 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలి.
- యాజమాన్యాలపై చర్యలు: నిధుల చెల్లింపు సాకుతో విద్యార్థుల అసలు ధృవీకరణ పత్రాలను నిలిపివేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- నాయకుల విడుదల: అక్రమంగా నిర్బంధించిన ఏఐవైఎఫ్ నాయకులను, విద్యార్థి ప్రతినిధులను ఎటువంటి షరతులు లేకుండా తక్షణమే విడుదల చేయాలి.

ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండివైఖరిని వీడి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన లోకం మలిదశ పోరాటానికి సిద్ధమవుతుందని కల్లూరు ధర్మేంద్ర హెచ్చరించారు.

# జి.హెచ్.ఎం.సి కార్మికుని కుటుంబానికి భరోసా

**మానవ హక్కుల కమిషన్ ఆదేశాల అమలు!**

**- రూ. 15.50 లక్షల పరిహారం, రెండు ఉద్యోగాలు..**

**భద్రతా చర్యలు ముమ్మరం చేసిన జిహెచ్ఎంసి పాలక.**




హైదరాబాద్ జూలై 14 : భారత శక్తి, యూసుఫ్‌గూడ చెత్త తరలింపు కేంద్రంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన పారిశుద్ధ్య కార్మికుడు మీశాల సుధాకర్ కుటుంబానికి ఎట్టకేలకు న్యాయం చేకూరింది. ఈ విషాద ఘటనపై స్వచ్ఛందంగా స్పందించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ జారీ చేసిన ఆదేశాలను గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థ పూర్తిగా అమలు చేసింది. బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు ఉపాధి కల్పిస్తూ తీసుకున్న చర్యల నివేదికను కమిషన్ ఆమోదించింది. ఈ నేపథ్యంలో, సదరు కేసుపై విచారణను మానవ హక్కుల కమిషన్ ముగించింది.

#### - మానవత్వంతో స్పందించిన హక్కుల కమిషన్

నగరంలోని యూసుఫ్‌గూడ చెత్త తరలింపు కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికుడు సుధాకర్ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటనపై మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఈ ఏడాది జనవరి 25న కమిషన్ స్వప్రేరణతో కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టింది. కార్మికుడి కుటుంబానికి తక్షణ న్యాయం అందించడంతో పాటు, భవిష్యత్తులో ఇలాంటి ముప్పులు పొంచి ఉండకుండా చూడాలని నగర పాలక సంస్థను ఆదేశించింది.

#### - నగర పాలక సంస్థ తీసుకున్న కీలక చర్యలు:

**కమిషన్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు పలు నిర్ణయాలు తీసుకుంది. ఆ వివరాలను నివేదిక రూపంలో కమిషన్‌కు సమర్పించింది. ఆ నివేదికలోని ముఖ్యాంశాలు:**

- **ఆర్థిక సహాయం:** మృతుడి కుటుంబానికి రూ. 15.50 లక్షల పరిహారాన్ని నగర పాలక సంస్థ చెల్లించింది.




- **ఉపాధి కల్పన:** అర్హత నిబంధనల ప్రకారం బాధిత కుటుంబ సభ్యులలో ఇద్దరికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు.
- **రక్షణ చర్యలు:** నగరంలోని అన్ని చెత్త తరలింపు కేంద్రాలలో కార్మికుల ప్రాణాలకు పూర్తి రక్షణ కల్పించేలా కఠినమైన భద్రతా ప్రమాణాలను అమలులోకి తెచ్చారు.

బాధిత కుటుంబానికి మానవతా దృక్పథంతో అవసరమైన సహాయం అందడం, అలాగే భవిష్యత్తు ప్రమాదాల నివారణకు నగర పాలక సంస్థ పటిష్టమైన చర్యలు చేపట్టడంపై కమిషన్ సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో, ఈ కేసుపై తదుపరి విచారణ అవసరం లేదని భావిస్తూ ఈ నెల 6న కేసును ముగిస్తున్నట్లు కమిషన్ ప్రకటించింది.

# బీజేపీ రంగారెడ్డి అర్బన్ మీడియా కన్వీనర్‌గా సంతోష్ కుమార్ నియామకం

**- పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తా: సంతోష్ కుమార్ - జిల్లా నాయకత్వానికి ధన్యవాదాలు**

హైదరాబాద్ జూలై 14 (భారత శక్తి): భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రచార విభాగం (మీడియా) కన్వీనర్‌గా మొరిశెట్టి సంతోష్ కుమార్ నియమితులయ్యారు.

ఈ మేరకు పార్టీ జిల్లా శ్రేణులు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశాయి. ఈ నియామకం పట్ల సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ, తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించినందుకు పార్టీ జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

#### - నిబద్ధతతో పనిచేస్తా..

ఈ సందర్భంగా మొరిశెట్టి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు యశ్పాల్ గౌడ్, బండారి భాస్కర్, కొత్త రవీందర్ గౌడ్, మాజీ పురపాలక సంఘ సభ్యులు (కార్పొరేటర్లు) కొప్పుల నర్సింహారెడ్డి, నరసింహ గుప్తాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అప్పగించిన బాధ్యతలను పూర్తి చిత్తశుద్ధితో, నిబద్ధతతో నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

#### - ప్రచార విభాగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం

"పార్టీ సిద్ధాంతాలను, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను మీడియా ద్వారా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు శ్రమిస్తాను. ప్రచార విభాగాన్ని మరింత క్రియాశీలంగా మార్చి, రాబోయే రోజుల్లో పార్టీ విజయాల్లో నా వంతు పాత్ర పోషిస్తాను."

**మొరిశెట్టి సంతోష్ కుమార్**

పార్టీ బలోపేతానికి, ఎదుగుదలకు నిరంతరం అంకితభావంతో పనిచేస్తానని సంతోష్ కుమార్ పునరుద్ఘాటించారు. ఈ నియామకం పట్ల పార్టీ శ్రేణులు, పలువురు ముఖ్య నాయకులు సంతోష్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు.



Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446,
Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy